ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 01.04.2025 | సంపుటి : 11 సంచిక : 252 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ఆఫ్‌షోర్ మైనింగ్ టెండర్లను

## రద్దు చేయాలి

దీనితో తీరప్రాంత జీవజాలానికి ముప్పు

ప్రధానికి రాహుల్ లేఖ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవులలో ఆఫ్‌షోర్ మైనింగ్‌కు టెండర్లను రద్దు చేయాలని కోరుతూ లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రధాని మోడీకి

మిగతా 2లో..

## మళ్లీ పెరిగిన టోల్‌చార్జీలు

నేటి నుంచి అమల్లోకి రానున్న నిబంధనలు

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుపై టోల్ చార్జీలు మరోసారి పెరిగాయి. పెరిగిన చార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ వెల్లడించింది. హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ నిర్వహణలో ఉండే ఓఆర్ఆర్‌ను ఐఆర్‌బీ సంస్థ రెండేండ్ల క్రితం 30 ఏండ్ల కాలానికి లీజు తీసుకుంది. నిబంధనల ప్రకారం ఏటా 5 శాతం వరకు టోల్‌ఛార్జీలను పెంచుకునే

మిగతా 2లో..

తెలంగాణలో

# గ్లోబల్ కేపబులిటీ సెంటర్

ఈ ఏడాది చివరికే ప్రారంభం

- దేశంలోనే తొలి కార్యాలయం హైదరాబాద్‌లో ఏర్పాటు
- అందుబాటులోకి వస్తే 2500 మందికి ఉద్యోగ అవకాశాలు
- నగరాన్ని ఈ రంగంలో హబ్‌గా తయారు చేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వ్యాన్‌గార్డ్ సీఈవో
- ప్రభుత్వ సానుకూలతల వల్లే హైదరాబాద్‌ను ఎంచుకున్నట్లు ప్రకటించిన సంస్థ



**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నట్లు వ్యాన్‌గార్డు సంస్థ ప్రకటించింది. దేశంలోనే తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లోనే స్థాపించనున్నట్లు వెల్లడించింది. వ్యాన్‌గార్డు కంపెనీ ప్రతినిధులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యాలయం అందుబాటులోకి వస్తే.. 2500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఏఐ, డేటా సెంటర్, మొబైల్ ఇంజినీరింగ్ నిపుణులకు అవకాశాలు లభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. ప్రభుత్వ సానుకూల

మిగతా 2లో..

## ఎస్ఆర్‌హెచ్-హెచ్‌సీఏ వివాదంపై సీఎం ఆగ్రహం

విజిలెన్స్ విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశం

వార్త 2లో



## తెలంగాణ టూ ఫిలిప్పీన్స్

జెండా ఊపి బియ్యం ఎగుమతులను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

- తెలంగాణ రైతాంగంలో ఇదో కీలక ఘట్టం
- భవిష్యత్తులో మరిన్ని దేశాలకు ఎగుమతి చేస్తామని వెల్లడి
- ఏడాదికి 8 లక్షల టన్నుల ఎంటీయూ బియ్యం ఎగుమతి
- తొలిదఫా ట్రంగ్ ఎన్ నౌక ద్వారా 12,500 టన్నుల సరఫరా

**కాకినాడ(జనంసాక్షి):** తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ మేరకు ఫిలిప్పీన్స్ దేశానికి 8 లక్షల టన్నుల బియ్యం ఎగుమతి చేసేం దుకు గతంలో ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలి విడతలో 12,500 టన్నుల బియ్యం ఎగుమతి చేసే నౌకను కాకినాడ పోర్టులో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మిగతా 2లో..



ఎర్రపూల వనంలో

## రాలిన మరో పువ్వు

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్

ఘటనలో శాఖమూరి అప్పారావు సహచరి రేణుక మృతి

- కవి,రచయిత ప్రభాత్ పత్రిక ఎడిటర్, ప్రెస్‌టీం ఇంఛార్జిగా బాధ్యతల నిర్వహణ.. న్యాయవాదిగా పనిచేస్తూ అజ్ఞాతంలోకి..
- 35ఏళ్ల అజ్ఞాత జీవితం.. ఆమెపై రూ. కోటి రివార్డు



**దంతేవాడ(జనంసాక్షి):**ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. బస్తర్ ప్రాంతంలో సోమవారం భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందింది. ఆమెను వరంగల్ వాసి రేణుకగా గుర్తించారు. మృతురాలి తలపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దంతేవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ సిబ్బంది యాంటీ-నక్సలైట్ ఆపరేషన్ చేపట్టారు. ఈక్రమంలో మావోయిస్టులు కాల్పులకు తెగబడగా.. భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఘటనాస్థలంలో ఓ మహిళా

మిగతా 2,11 లో..



400 ఎకరాల్లో..

ఇంచుకూడా సెంట్రల్ యూనివర్సిటీ

## భూమిలేదు

- ఆ స్థలం అంతా రాష్ట్ర ప్రభుత్వానిదే
- హెచ్‌సీయూ వివాదంపై టీజీఐఐసీ కీలక ప్రకటన



**హైదరాబాద్(జనంసాక్షి):**కంచ గచ్చిబౌలి భూములపై టీజీఐఐసీ కీలక ప్రకటన చేసింది. ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. ప్రాజెక్టులో సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూమి లేదని తెలిపింది. ఈ మేరకు టీజీఐఐసీ వెల్లడించింది. ''కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే. ఈ భూమి యజమాని తానేనని న్యాయస్థానం ద్వారా ప్రభుత్వం నిరూపించుకుంది. ప్రైవేటు సంస్థకు 21 ఏళ్ల క్రితం కేటాయించిన భూమిని న్యాయపోరాటం ద్వారా దక్కించుకుంది. అభివృద్ధికి ఇచ్చిన భూమిలో చెరువులు లేవు. సర్వేలో ఒక్క అంగుళం భూమి కూడా సెంట్రల్ యూనివర్సిటీది కాదని తేలింది. కొత్తగా చేపడుతున్న అభివృద్ధి ప్రణాళిక అక్కడ ఉన్న రాళ్ల రూపాలను దెబ్బతీయదు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి ప్రణాళికలో స్థానిక సుస్థిరాభివృద్ధి, పర్యావరణ అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించే కొందరు రాజకీయ నాయకులు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు. 400 ఎకరాల భూమి ప్రభుత్వ స్వాధీనంలో ఉంది. అటవీ భూమి అంటూ తప్పుడు ప్రచారం జరుగుతోంది.

మిగతా 2లో..

హెచ్‌సీయూ వ్యవహారంపై

### రాహుల్ స్పందించాలి

వందల ఎకరాల విలువైన స్థలాన్ని నాశనం చేస్తూ ప్రభుత్వం గ్రీన్ మర్డర్‌కు పాల్పడుతోంది:కేటీఆర్



2లో

అత్యంత ప్రతిష్టాత్మకంగా

## రాజీవ్ యువ వికాసం

ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులు స్వీకరణ పొడిగింపు

- పథకం కోసం ప్రభుత్వం రూ.9వేలకోట్లు వెచ్చిస్తోంది
- అధికారులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్(జనంసాక్షి):**రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా భావిస్తుంది, అధికారులు అప్రమ త్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. సోమవారం సాయంత్రం ప్రజా భవన్ నుంచి ఆయన చీఫ్ సెక్రటరీ, సెక్రటరీలు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు సూచనలు చేశారు.

మిగతా 2లో..

## ఎటుచూసినా హృదయవిదారకమే..



2 వేలకు పైనే మృతులు.. ఇంకా దొరకని వందల మంది ఆచూకీ!

మయన్మార్‌లో నెలకొన్న దారుణ పరిస్థితులు

**నేపిడా/బ్యాంకాక్(జనంసాక్షి):** వరుస భూప్రకంపనలతో వణికిన మయన్మార్‌లో మహా విషాదం నెలకొంది. భూకంపం ధాటికి నేలమట్టమైన భవనాల శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. భూవిలయంలో మృతుల సంఖ్య 2,056కి పెరగగా.. 3900 మందికి పైగా గాయపడినట్లు మయన్మార్ సైనిక ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటికీ ఇంకా 270 మంది ఆచూకీ లభ్యం కాలేదని తెలిపింది. ఒకవైపు మృతదేహాలు.. మరోవైపు క్షతగాత్రులతో అక్కడి ఆస్పత్రులు కిక్కిరిసిపోయాయి. భూకంపం వచ్చి

మిగతా 2లో..



## బెట్టింగ్ యాప్స్‌పై 'సిట్'

సీఐడీ అదనపు డీజీ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఏర్పాటు

ఆదేశాలు జారీ చేసిన డీజీపీ జితేందర్




**హైదరాబాద్(జనంసాక్షి):** కొంతకాలంగా బెట్టింగ్‌యాప్స్ వల్ల ఎంతోమంది అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్‌చేస్తున్న పలువురు సినీ యాక్టర్లకు నోటీసులు పంపి కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే బెట్టింగ్ యాప్స్ వ్యవహారంపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈమేరకు డీజీపీ జితేందర్ ఆదేశాలు జారీచేశారు. సీఐడీ అదనపు డీజీ పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు చేపట్టనుంది. ఇందులో ఐజీ ఎం.రమేష్‌తోపాటు ఎస్పీలు సింధు శర్మ, వెంకటలక్ష్మి, అదనపు ఎస్పీ చంద్రకాంత్, శంకర్‌లను సభ్యులుగా నియమించారు. 90 రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించారు. బెట్టింగ్

మిగతా 2లో..

## వచ్చేసారి నాదే గెలుపు

- మూడోసారి అధ్యక్షుడినయ్యే అవకాశం
- అందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి
- డొనాల్డ్ ట్రంప్ మళ్లీ సంచలన వ్యాఖ్యలు

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. తన పాలన ఎలా ఉంటుందో మరోసారి అందరికీ రుచిచూపిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి కూడా అమెరికా అధ్యక్షుడు కావాలను కుంటున్నారు. తాను మూడోసారి అమెరికా అధ్యక్షు డిగా ఎన్నిక కావడానికి మార్గాలున్నాయని ఓ న్యూస్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ విషయంలో తాను జోక్ చేయడం లేదని వ్యాఖ్యానించారు. ఇంటర్వ్యూలో భా గంగా మరోమారు అధ్యక్షుడు కావాల నుకుంటు-న్నారా..? అందుకు ఏమైనా వ్యూహాలున్నాయా..? అన్న ప్రశ్న ట్రంప్‌కు ఎదురైంది. ఇందుకు ఆయన సమాధానమిస్తూ.. 'రాజ్యాంగం అనుమతించకపోయినా.. మూడోసారి అధ్య క్షుడు కావడానికి చాలా మార్గాలు ఉన్నాయి. ఈ విషయంలో నేను జోక్ చేయ డం లేదు. నన్ను మూడోసారి కూడా అధ్యక్షుడిగా చూడాలని చాలామంది కోరుకుంటున్నారు.

మిగతా 2లో..



### అన్ని దేశాలపైనా సుంకాల మోతే

ప్రకటించిన ట్రంప్

వార్త 2లో

### ఉక్రెయిన్ ఎప్పటికీ నాటో సభ్యత్వం పొందలేదు

జెలెన్‌స్కీని హెచ్చరించిన ట్రంప్

## యుద్ధం ముగింపు.. ఓ సుదీర్ఘ ప్రక్రియ

ట్రంప్ హెచ్చరికలపై స్పందించిన రష్యా

**మాస్కో(జనంసాక్షి):** ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించేందుకు చొరవ చూపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పుతిన్, జెలెన్‌స్కీలపై ధ్వజమెత్తిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై క్రెమ్లిన్ స్పందిస్తూ.. కీలక వ్యాఖ్యలు చేసింది. యుద్ధాన్ని ముగించే ప్రయత్నాలను సుదీర్ఘ ప్రక్రియగా పేర్కొంది. పుతిన్ ను ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై నేరుగా సమాధానం ఇవ్వనప్పటికీ.. అమెరికా

మిగతా 2లో..



## మళ్లీ రాజుకుంటున్న అగ్గి



అణు డీల్‌పై ట్రంప్ హెచ్చరికలతో భారీగా క్షిపణులను మోహరించిన ఇరాన్

**టెహ్రాన్(జనంసాక్షి):**అణ్వాయుధాల అభివృద్ధి విషయంలో ఇరాన్-అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. అణు ఒప్పందం విషయంలో అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఒప్పందాన్ని కుదుర్చుకోని పక్షంలో.. ఇరాన్‌పై బాంబు దాడులకూ

మిగతా 2లో..

# ఎర్రపూల వనంలో రాలిన మరో పువ్వు

నక్సలైట్ మృతదేహాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు.మృతురాలిని తెలంగాణలోని వరంగల్‌కు చెందిన రేణుక అలియాస్, ఛైతి అలియాస్ సరస్వతిగా గుర్తించారు. ఈమె మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రెస్ టీమ్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆమె తలపై రూ.25లక్షల రివార్డు ఉన్నట్లు చెప్పారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భారీఎత్తున తుపాకులు, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో 135 మంది మావోయిస్టులను భద్రతా సిబ్బంది హతమార్చారు. ఇందులో 119 మంది ఒక్క బస్తర్ డివిజన్‌లోనే మరణించినట్లు అధికారులు తెలిపారు. గత శనివారం సుక్మా, బీజాపుర్‌లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో 18 మంది మావోయిస్టులు చనిపోయారు. వీరిలో 11 మంది మహిళలే కావడం గమనార్హం.

### 400 ఎకరాల్లో..

# ఇంచుకూడా సెంట్రల్ యూనివర్సిటీ భూమిలేదు

400 ఎకరాలు రెవెన్యూ రికార్డుల్లోనూ ప్రభుత్వ భూమిగానే ఉంది. దీనిలో బఫెల్లో లేక్, పీకాక్ లేక్ లేవు. ప్రపంచస్థాయి ఐటీ మౌలిక వసతులు, అనుసంధానత పెంపు, తగినంత పట్టణ స్థలాల లభ్యత అనే ప్రభుత్వ ప్రాధాన్యానికి ప్రస్తుత ప్రాజెక్టు కట్టుబడి ఉంది" అని టీజీఐఐసీ పేర్కొంది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనంటూ టీజీఐఐసీ చేసిన ప్రకటనను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఖండించింది. ఈ మేరకు హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ఓ ప్రకటన విడుదల చేశారు. 2024 జులైలో అక్కడ ఎలాంటి సర్వే నిర్వహించలేదని, ఇప్పటి వరకు భూమి ఎలా ఉందన్నదానిపై ప్రాథమిక పరిశీలన మాత్రమే చేశారని అన్నారు. హద్దులకు అంగీకరించినట్లు టీజీఐఐసీ చేసిన ప్రకటనను ఖండిస్తున్నట్లు చెప్పారు. " ఇప్పటి వరకు భూమి సరిహద్దులు గుర్తించలేదు. దీనిపై హెచ్‌సీయూకి సమాచారం ఇవ్వలేదు. ఆ భూమిని యూనివర్సిటీకే ఇవ్వాలని చాలా కాలంగా కోరుతున్నాం. భూమి కేటాయించడంతోపాటు పర్యావరణం, జీవ వైవిధ్యాన్ని కాపాడాలని మరోసారి కూడా ప్రభుత్వాన్ని కోరతాం" అని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

# హెచ్‌సీయూ వద్ద భారీ బందోబస్తు

హైదరాబాద్(జనంసాక్షి):విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద సెక్యూరిటీ పెంచారు. యూనివర్శిటీ లోపల బయట భారీగా పోలీసుల మోహరించారు. వర్సిటీ భూములను చదును చేయడాన్ని ఆపాలంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో పోలీసులు భద్రతను పెంచారు. యూనివర్సిటీలోని 400 ఎకరాలను బుల్డోజర్ లతో చదును చేసేందుకు యత్నించడంతో విద్యార్థి సంఘాలు, యూనివర్సిటీ సిబ్బంది భగ్గుమన్నాయి. యూనివర్సిటీ భూములను చదును చేయడాన్ని ఆపాలంటూ స్టూడెంట్స్ గళమెత్తారు. దీంతో నిన్న రాత్రి యూనివర్శిటీ పరిసరాలు రణ రంగంగా మారాయి. రాత్రి యూనివర్శిటీ వద్ద ఉద్రిక్తత నేపథ్యంలో పలువురు విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను, విద్యార్థి నేతలను రాత్రి 10 తర్వాత విడుదల చేశారు. సోమవారం కూడా ఆందోళనలు కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు అలెర్ట్ అయ్యారు. హెచ్‌సీయూ వద్ద పోలీసులు భద్రతను కొనసాగిస్తున్నారు. యూనివర్సిటీకి సంబంధించిన ప్రధాన ద్వారంతో పాటు సెంట్రల్ యూనివర్సిటీ లోపల కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే యూనివర్సిటీకి సంబంధించిన భూములను ప్రభుత్వం వేలం వేసే ప్రయత్నం చేస్తోందంటూ వర్సిటీకి చెందిన విద్యార్థులు, సిబ్బంది పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గత రాత్రి విద్యార్థుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. నిన్నంతా వర్సిటీ లోపల, బయట రణరంగంగా మారింది. ఈ క్రమంలో సోమవారం కూడా ఉద్రిక్తతలు కొనసాగుతాయని భావించిన పోలీసులు.. ముందస్తు చర్యల్లో భాగంగా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. వర్సిటీ లోపలకు వెళ్లే వారి వివరాలను అడిగి తెలుసుకుని.. యూనివర్సిటీకి సంబంధించిన విద్యార్థులు, సిబ్బందిని మాత్రమే లోపలకు పంపిస్తున్నారు.

### హెచ్‌సీయూ వ్యవహారంపై

# రాహుల్ స్పందించాలి

హైదరాబాద్(జనంసాక్షి):హెచ్‌సీయూ సమీపంలోని కంచ గచ్చిబౌలి భూముల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికైనా స్పందించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. భూముల వ్యవహారంపై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. "400 ఎకరాల విలువైన స్థలాన్ని నాశనం చేస్తూ గ్రీన్ మర్డర్‌కు పాల్పడుతున్నారు. ఆ స్థలంలో బుల్డోజర్లు, జేసీబీలు తిరుగుతున్నాయి. వాటిని చూసి అక్కడి నెమళ్లు సాయం కోసం చూస్తున్నాయి. ఇప్పటికైనా రాహుల్ గాంధీ నోరు విప్పరా?ఇవన్నీ చూస్తూ కూడా ఆయన మాట్లాడకపోతే ఎలా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు కొన్ని వీడియోలు, ఫొటోలను కేటీఆర్ తన పోస్టుకు జత చేశారు. కంచ గచ్చిబౌలి భూములపై టీజీఐఐసీ కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. ప్రాజెక్టులో సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూమి లేదని తెలిపింది. ఈ మేరకు టీజీఐఐసీ ప్రకటన విడుదల చేసింది. "400ఎకరాల భూమి ప్రభుత్వ స్వాధీనంలో ఉంది. అటవీ భూమి అంటూ తప్పుడు ప్రచారం జరుగుతోంది. 400 ఎకరాలు రెవెన్యూ రికార్డుల్లోనూ ప్రభుత్వ భూమిగానే ఉంది. దీనిలో బఫెల్లో లేక్, పీకాక్ లేక్ లేవు. ప్రపంచస్థాయి ఐటీ మౌలిక వసతులు, అనుసంధానత పెంపు, తగినంత పట్టణ స్థలాల లభ్యత అనే ప్రభుత్వ ప్రాధాన్యానికి ప్రస్తుత ప్రాజెక్టు కట్టుబడి ఉంది" అని టీజీఐఐసీ పేర్కొంది.

# మళ్లీ రాజుకుంటున్న అగ్గి

వెనుకాడబోమని హెచ్చరించారు. దీంతో అప్రమత్తమైన టెహ్రాన్.. క్షిపణులతో సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.ఇరాన్ వ్యాప్తంగా ఉన్న భూగర్భ ప్రయోగ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణులను లాంచ్‌ప్యాడ్‌లపై సిద్ధంగా పెట్టినట్లు టెహ్రాన్ టైమ్స్ కథనం వెల్లడించింది. వైమానిక దాడుల కోసం వీటిని ప్రయోగించే అవకాశాలున్నట్లు తెలిపింది. అత్యవసర పరిస్థితులు ఎదురైతే అమెరికా సంబంధిత ప్రాంతాలపై దాడులు చేసేందుకు వీటిని ఉపయోగించనున్నట్లు సదరు కథనం పేర్కొంది.అణు ఒప్పందం విషయంలో అగ్రరాజ్యం ప్రత్యక్ష చర్చల ఆహ్వానాన్ని తిరస్కరించినట్లు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తెలిపారు. పరోక్ష మార్గంలో చర్చలు జరిపేందుకు సిద్ధమని చెప్పారు. దీనిపై ట్రంప్ ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ టెహ్రాన్‌పై బెదిరింపులకు దిగారు. "ఒకవేళ అణుఒప్పందం కుదుర్చుకునేందుకు టెహ్రాన్ నిరాకరిస్తే.. బాంబు దాడులు తప్పవు. ఆ దేశం మునుపెన్నడూ ఎరుగని రీతిలో ఇవి జరుగుతాయి. అదేవిధంగా మరోవిడత ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని హెచ్చరించారు. అయితే, ఇరాన్‌తో పరోక్ష చర్చలకు అంగీకరిస్తారా? లేదా అనేదానిపై మాత్రం ట్రంప్ స్పష్టతనివ్వలేదు.ట్రంప్ తొలి హయాంలో ఇరాన్‌తో సంబంధాలు అంతంతమాత్రంగానే సాగాయి. ఆయన అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో అణుఒప్పందం నుంచి అమెరికా వైదొలిగింది. టెహ్రాన్‌పై ఆంక్షలు విధించింది. అప్పటినుంచి ఎన్నోఏళ్లుగా పరోక్ష చర్చలు విఫలమయ్యాయి. ఈక్రమంలోనే మరోసారి అణుఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ ఇటీవల సంసిద్ధత వ్యక్తం చేశారు.

# తెలంగాణ టూ ఫిలిప్పీన్స్



జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ రైతాంగంలో ఇదో కీలక ఘట్టం అని మంత్రి ఉత్తమ్ అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్లో బియ్యం ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందన్నారు. తెలంగాణలో 280 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతోందని.. రాష్ట్ర ప్రజల అవసరాలు తీర్చిన తర్వాత మిగిలిన బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నామని వెల్లడించారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. అందుకు ఇక్కడి మట్టి, వాతావరణ పరిస్థితులే కారణమని తెలిపారు. గత ప్రభుత్వాలు ఇలాంటి ఎగుమతులు చేయలేదని తెలిపారు. ఫిలిప్పీన్స్‌తో పాటు ఇతర దేశాలతో కూడా రైస్ ఎగుమతులపై సంప్రదింపులు జరుగుతున్నాయని వివరించారు. తెలంగాణ రైతులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.భవిష్యత్తులో మరిన్ని దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలను రాష్ట్రంలో మెరుగుపరుస్తామన్నారు మంత్రి ఉత్తమ్. మరోవైపు రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరిన్ని దేశాలకు తెలంగాణ బియ్యం ఎగుమతుల అవకాశాలపై చర్చలు కొనసాగుతున్నాయని.. రైతులకు మంచి ధర అందించేందుకు, పత్తి, గోధుమ వంటి ఇతర పంటల ఎగుమతులపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు.

# అత్యంత ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం

నిరుద్యోగ యువత వారి కాళ్లపై వారు నిలబడాలన్న మహోన్నత ఆశయంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి పదివేల కోట్లు ఖర్చు చేస్తుందని, అధికారులు అంతా మనసుపెట్టి పనిచేయాలని, నిరుద్యోగులకు సేవ చేసే భాగ్యం ఈ పథకం ద్వారా అధికారులకు కలుగుతుందని డిప్యూటీ సీఎం సూచించారు. దశాబ్ద కాలంగా నిరుద్యోగ యువతపై ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ నిధులు ఖర్చు చేయలేదన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రాజెక్ట్ ఇది అని వివరించారు. ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకునేందుకు



యువత కష్టపడ్డారు. చిన్న పొరపాటు వచ్చిన అధికారులు వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను ఈ పథకం ప్రగతిపై నిరంతరం సమీక్షిస్తామని అన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యుఎస్ అన్ని వర్గాల గురించి ఆలోచించి మొదటిసారి చేస్తున్న స్వయం ఉపాధి పథకం ఇది అన్నారు. గతంలో మంజూరీ అయినా చివరి వరకు నిధులు విడుదల చేయలేదని అన్నారు. ధరఖాస్తుధారులు ఎంపీడీఓ కార్యాలయాలు, మునిసిపాలిటీలో నేరుగా ధరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మంత్రులు జిల్లాలకు వచ్చినప్పుడు పథకానికి సంబంధించిన ప్రగతి సమాచారం అందించి వారి నుంచి సలహాలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేలకు పథకానికి సంబందించిన పూర్తి సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. వరుస సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు గడువు పెంచాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2న అర్హులకు శాంక్షన్ లెటర్లు ఇవ్వాలని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ మొదలు గ్రౌండింగ్ వరకు నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి జిల్లాలో ఒక యువ అధికారిని నియమించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

# ఆఫ్‌షోర్ మైనింగ్ టెండర్లను రద్దు చేయాలి

ఇటీవల లేఖ రాశారు. మార్చి 25న రాసిన లేఖ రాహుల్ వాట్సాప్ ద్వారా షేర్ చేశారు. ఆఫ్‌షోర్ మైనింగ్ వల్ల సముద్ర జీవులకు ముప్పు వాటిల్లుతుంది. జీవరాశికి జరిగే నష్టాన్ని అంచనా వేయకుండానే మైనింగ్‌కు ప్రైవేటు టెండర్లను ఆహ్వానించడం పట్ల తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు రాహుల్ లేఖలో పేర్కొన్నారు. ఆఫ్‌షోర్ మైనింగ్‌కు స్థానికుల అభిప్రాయం, పర్యావరణ అధ్యయనాలు నిర్వహించకుండా అనుమతించడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని మోడికి రాసిన లేఖలో రాహుల్ పేర్కొన్నారు. ఆఫ్‌షోర్ ఏరియాస్ మినరల్ సవరణ చట్టం 2023 తీవ్ర అభ్యంతరాలను ఎదుర్కొందని రాహుల్ తెలిపారు. కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవులలో గనుల మంత్రిత్వశాఖ 13 ఆఫ్‌షోర్ బ్లాక్‌లకు లైసెన్స్ మంజూరు చేసినప్పుడు ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మత్స్యకారులు నిరసన చేశారు. అలాగే ఆఫ్‌షోర్ మైనింగ్ వల్ల ముఖ్యంగా కొల్లంలో వినాశకరమైన ప్రభావం చూపుతుందని కేరళ విశ్వవిద్యాలయం లోని అక్వాటిక్ బయాలజీ మరియు ఫిషరీస్ విభాగానికి చెందిన మెరైన్ మానిటరింగ్ ల్యాబ్ (ఎంఎంఎల్) నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడైందని రాహుల్ పేర్కొన్నారు. కేరళలో 11 లక్షల మందికిపైగా ప్రజలు చేపల వేటపై ఆధారపడుతున్నారు. ఈ మైనింగ్ వల్ల వారి జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ మైనింగ్ వల్ల ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని అంచనా వేయకుండానే ఉద్దేశపూర్వకంగానే మోడీ ప్రభుత్వం ప్రయివేటు-కి అప్పగించడం ఆందోళకరం అని ఆయన లేఖలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రయివేటు-టెండర్లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణలో గ్లోబల్ కేపబులిటీ సెంటర్

పాలసీల వల్లే హైదరాబాద్‌ను ఎంచుకున్నట్లు వ్యాన్‌గార్డ్ సీఈవో తెలిపారు. హైదరాబాద్‌లో అన్ని రంగాల నిపుణులు ఉన్నారని సీఈవో చెప్పారు. హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల హబ్‌గా చేస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

# ఎస్‌ఆర్‌హెచ్-హెచ్‌సీఏ వివాదంపై సీఎం ఆగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ వివాదంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌సీఏ పై వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు. ఐపీఎల్ టికెట్లు, పాస్‌ల కోసం హెచ్‌సీఏ వేధిస్తోందని ఎస్‌ఆర్‌హెచ్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఉచిత టికెట్ల కోసం హెచ్‌సీఏ నుంచి ఎదురవుతున్న బెదిరింపుల నేపథ్యంలో తీవ్ర ఆందోళన చెందినట్లు హెచ్‌సీఏ కోశాధికారికి సన్‌రైజర్స్ ప్రతినిధి రాసిన లేఖ వెలుగులోకి వచ్చింది.ఒప్పందం ప్రకారం హెచ్‌సీఏకు 10శాతం (3900) కాంప్లిమెంటరీ టికెట్లు కేటాయిస్తున్నామని, 50 సీట్ల సామర్థ్యం ఉన్న ఎఫ్ 12ఏ కార్పొరేట్ బాక్స్ టికెట్లు కూడా అందులో భాగమేనని ఆయన లేఖలో పేర్కొన్నారు. కానీ, ఈ ఏడాది దాని సామర్థ్యం 30 మాత్రమే అని పేర్కొంటూ... అదనంగా మరో 20 టికెట్లు కేటాయించాలని అడిగారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే గత మ్యాచ్ సందర్భంగా ఎఫ్-3 బాక్సుకు తాళాలు వేశారని తెలిపారు. ఈ వ్యవహారం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో హెచ్‌సీఏ తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌సీఏపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించారు.

# యుద్ధం ముగింపు.. ఓ సుదీర్ఘ ప్రక్రియ

అధ్యక్షుడితో మాట్లాడేందుకు తమ నేత ఎల్లప్పుడూ సిద్ధమేనని తెలిపింది."ఉక్రెయిన్ అంశానికి సంబంధించి కొన్ని ఆలోచనల అమలు విషయంలో కసరత్తు సాగుతోంది. యుద్ధం ముగింపు విషయంలో.. ప్రకటన వెలువరించేంత స్థాయిలో ఇంకేమీ జరగలేదు. విషయానికి ఉన్న సంక్లిష్టత దృష్ట్యా.. ఇదొక సుదీర్ఘ ప్రక్రియ" అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మీడియాతో చెప్పారు. అమెరికాతో సంప్రదింపుల విషయంలో పుతిన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ట్రంప్‌తో మాట్లాడేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలంటే జెలెన్‌స్కీ ప్రభుత్వం మారాలని ఇటీవల పుతిన్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ మండిపడ్డారు. ఉక్రెయిన్‌లో రక్తపాతం ఆగకపోతే.. ఆ బాధ్యత పుతిన్‌దేనని స్పష్టం చేశారు. అప్పుడు తాను రష్యాను ఉపేక్షించనని.. ఆ దేశంపై భారీ సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. అదేవిధంగా ఉక్రెయిన్ ఎప్పటికీ 'నాటో'లో సభ్య దేశం కాలేదని, అరుదైన ఖనిజాల ఒప్పందం నుంచి వైదొలగడానికి యత్నిస్తే జెలెన్‌స్కీ పెద్ద సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

# మళ్లీ పెరిగిన టోల్‌చార్జీలు

వెసులుబాటు సంస్థకు కల్పించింది. ఇందులో భాగంగా టోల్? ధరలను పెంచింది. దీని ప్రకారం కారు, జీపు, వ్యాన్, లైట్ వాహనాలకు కిలోమీటర్‌కు 10 పైసలు పెంచింది. దీంతో ప్రస్తుతం కిలోమీటర్‌కు రూ.2.34గా ఉన్న చార్జీలు రూ.2.44కు పెరిగాయి. అదేవిధంగా మినీబస్, ఎల్‌సీవీలకు కిలోమీటర్‌కు 20 పైసలు వడ్డించింది. దీంతో ప్రస్తుతం ఉన్న రూ.3.77 నుంచి రూ.3.94కు చేరింది. 2 యాక్సిల్ బస్సులకు కిలోమీటర్‌కు రూ.6.69 నుంచి రూ.7కు పెంచింది. భారీ వాహనాలకు కిలోమీటర్‌కు రూ.15.09 నుంచి రూ.15.78కు పెంచింది. ప్రతి ఏడాది ఏప్రిల్ 1న టోల్‌చార్జీలను సంస్థ పెంచుతూ వస్తున్నది. ఇందులో భాగంగా గతేడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జూన్ నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి. తాజాగా మరోసారి చార్జీలను పెంచింది.

# బెట్టింగ్ యాప్స్‌పై 'సిట్'

యాప్స్ ప్రమోషన్స్‌పై ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యా యి. హైదరాబాద్ పంజాగుట్టతోపాటు సైబరాబాద్ మియాపూర్‌లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. టాలీవుడ్, బాలీవుడ్ నటులతోపాటు యూట్యూబర్స్, టీవీ యాంకర్లు 25 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కూడా సిట్‌కు బదిలీ చేశారు.

# ఎటుచూసినా హృదయవిదారకమే..

మూడు రోజులు గడుస్తున్న నేపథ్యంలో శిథిలాల కింద చిక్కుకున్నవారి పరిస్థితిపై తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు, మూడు రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుండగా.. తమవారు సజీవంగానే ఉండొచ్చనే ఆశతో పలువురు తమ చేతులతో శిథిలాలను తొలగిస్తున్న దృశ్యాలు హృదయాలను కలచివేస్తున్నాయి. మయన్మార్‌లో భూకంపం తీవ్రతపై సైనిక ప్రభుత్వం విడుదల చేస్తున్న సమాచారంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2021 నుంచి ఆ దేశంలో మీడియాపై నియంత్రణ, ఇంటర్నెట్ వినియోగం పరిమితం చేయడం వంటి ఘటనలే ఇందుకు కారణం. అక్కడ వేలాది మంది ప్రజలు నీరు, విద్యుత్ లేక అల్లాడుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. భూవిలయంతో జరిగిన విధ్వంసాన్ని కవర్ చేసేందుకు తమకు అనుమతించాలంటూ అంతర్జాతీయ జర్నలిస్టుల అభ్యర్థనను సైతం అక్కడి ప్రభుత్వం తిరస్కరించినట్లు సదరు కథనాలు తెలిపాయి. మరోవైపు, మయన్మార్‌లోని సాగింగ్ నగరంలోని ఓ హైస్కూల్‌లో ఎనిమిది మంది చిన్నారులు, ముగ్గురు టీచర్లు ఇప్పటికీ శిథిలాల్లోనే చిక్కుకొని ఉన్నట్లు సహాయక సిబ్బంది తెలిపారు. ఇదిలా ఉండగా.. థాయిలాండ్‌లో మృతుల సంఖ్య 20కి పెరిగింది. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో పరిస్థితి చాలా వరకు సాధారణ స్థితికి వచ్చినట్లు ఆ దేశ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్ర వెల్లడించారు. బ్యాంకాక్ నగరంలో కుప్పకూలిన ఎత్తైన భవనం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆ భవనంలో వద్దే ఇప్పటివరకు 13 మృతదేహాలను గుర్తించారు. వీరిలో ఎనిమిది మంది పురుషులు కాగా.. ఐదుగురు మహిళలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, భవనాలు నేలమట్టమై మూడు రోజులు కావడంతో శిథిలాల కింద ఉన్నవారు సజీవంగా ఉండటం కష్టమేనని పలువురు పేర్కొంటున్నారు. ఈ భూకంపం మధ్య మయన్మార్‌లోని సాగింగ్ నగరానికి వాయువ్యంగా సంభవించింది. దేశంలోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలేలో భారీ విధ్వంసం చోటుచేసుకుంది.భూకంప బాధితులకు సహాయం అందించేందుకు అంతర్జాతీయ రెడ్ క్రాస్, రెడ్ క్రెసెంట్ సొసైటీల సమాఖ్య (ఐఎఫ్ఆర్‌సీ)100 మిలియన్ డాలర్ల పైగా మొత్తం అత్యవసరమని విజ్ఞప్తి చేసింది. అలాగే భూకంపం సంభవించిన ప్రాంతంలో అవసరాలు అంతకంతకూ పెగుతున్నాయని పేర్కొంది. రాబోయే 24 నెలల్లో లక్ష కుటుంబాలకు సహాయం అందించేందుకు మరింతగా నిధులు అవసరం కానున్నాయని పేర్కొంది. దీనికితోడు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున మరో సంక్షోభం తలెత్తకముందే అప్రమత్తం కావాల్సిన అవసరముందని సూచించింది. ఇది విపత్తు మాత్రమే కాదని, సంక్లిష్టమైన మానవతా సంక్షోభమని ఐఎఫ్ఆర్‌సీ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ అలెగ్జాండర్ మాథ్యూ పేర్కొన్నారు. భూకంపంతో దేశం అతలాకుతలం అవుతున్నసమయంలో ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న సాయుధ ప్రతిఘటన ఉద్యమం గ్రామాలపై వైమానిక దాడులు నిర్వహించడంపై మయన్మార్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. కరెన్ నేషనల్ యూనియన్ జంటా పౌరప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు చేస్తూనే ఉందని ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణ పరిస్థితులలో సైన్యం సహాయ చర్యలకు ముందుకు వస్తుందని, అయితే ఇప్పుడు దీనికి బదులుగా దేశ ప్రజలపై దాడి చేయడానికి బలగాలను మోహరించడం దురదృష్టకరమని పేర్కొంది.

### భారత్ నుంచి 30 టన్నుల సహాయక సామగ్రి

భారత నావికాదళ నౌకలు మయన్మార్‌కు 30 టన్నుల సహాయాన్ని తీసుకువెళ్లాయని భారత్ విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మీడియాకు తెలిపారు. భారత నావికాదళ నౌకలు ఐఎన్ఎస్ కార్ముక్, ఎల్‌సీయూలు 52 భూకంప ప్రభావిత ప్రాంతాలకు సహాయ సామగ్రిని తీసుకువెళ్లాయని అయన పేర్కొన్నారు. ఈ సహాయ చర్యలు ఆపరేషన్ బ్రహ్మలో భాగమని తెలిపారు. ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫారం 'ఎక్స్'లో 'ఆపరేషన్ బ్రహ్మ కొనసాగుతోంది. భారత నావికాదళ నౌకలు 30 టన్నుల సహాయక, వైద్య సామాగ్రితో యాంగోన్‌కు వెళ్లాయని తెలిపారు."భారత సైన్యం తెలిపిన వివరాల ప్రకారం 10 మంది సిబ్బందితో కూడిన మొదటి సహాయక బృందం మయన్మార్‌లోని

# వచ్చేసారీ నాదే గెలుపు

అయితే, దాని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుంది. ఆ విషయం మీకు కూడా తెలుసని ట్రంప్ పేర్కొన్నారు.నిజానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం ఏ వ్యక్తీ రెండుసార్లకు మించి అధ్యక్ష పదవిని అధిష్ఠించడానికి వీల్లేదు. ట్రంప్ మూడోసారి అధ్యక్షుడు కావాలంటే 22వ రాజ్యాంగ సవరణను మార్చాల్సి ఉంటుంది. దానికి అమెరికా కాంగ్రెస్‌తోపాటు- రాష్ట్రాల ఆమోదం పొందాల్సి ఉంటుంది. అది చాలా కష్టమైన పని. అమెరికా చరిత్రలో ఫ్రాంక్లిన్ రూజ్ వెల్ట్ ఒక్కరే నాలుగుసార్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇటు-వంటిది జరగకుండా నివారించడానికి 1951లో 22వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. అయితే, ట్రంప్ మాత్రం మూడోసారి, వీలైతే నాలుగోసారి కూడా అమెరికాను ఏలాలని కలలు కంటున్నారు. మూడోసారి అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించడంపై ఆయన ఇప్పటికే పలు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి రెండుసార్లకు మించి దేశాధ్యక్ష పదవి చేపట్టేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలంటూ పాలక రిపబ్లికన్ పార్టీ కాంగ్రెస్ (పార్లమెంటు-) సభ్యుడు యాండీ ఓగిల్స్ దిగువ సభలో ఇటీవలే సంయుక్త తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇది ఆమోదం పొందితే డొనాల్డ్ ట్రంప్ మూడుసార్లు అధ్యక్ష పదవికి ఎన్నిక కావడానికి వీలు కలుగుతుంది.

### ఉక్రెయిన్ ఎప్పటికీ నాటో సభ్యత్వం పొందలేదు: ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి): ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం ఇవ్వాలని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొంటుందంటే అధ్యక్ష పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమేనని..బదులుగా నాటో కూటమి సభ్యత్వాన్ని ఉక్రెయిన్‌కు ఇవ్వాలని ఆయన ఇప్పటికే స్పష్టంచేశారు. ఈ విషయంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ వారు ఎప్పటికీ నాటోలో సభ్యులు కాలేరని అన్నారు. అరుదైన ఖనిజాల ఒప్పందం నుంచి వైదొలగడానికి ప్రయత్నిస్తే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పెద్ద సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం అనేది ఎప్పటికీ జరగబోదని జెలెన్‌స్కీకి అర్థమై ఉంటుందని.. అందుకే తమతో ఖనిజ వనరుల ఒప్పందంపై తిరిగి చర్చలు జరపాలని జెలెన్‌స్కీ చూస్తున్నాడని ట్రంప్ పేర్కొన్నారు. పుతిన్‌తో సంబంధాలపై మాట్లాడుతూ కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ తమ మధ్య స్నేహపూర్వక బంధం ఉందని అన్నారు. యుద్ధం ముగింపు విషయంలో ఆయన తన మాటను కాదనడని నమ్ముతున్నానని తెలిపారు. ఒకవేళ ఆవిధంగా జరగకపోతే రష్యా చమురుపై అదనపు సుంకాలు విధిస్తానన్నారు. ఉక్రెయిన్- రష్యాల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా చేస్తున్న సహాయానికి బదులుగా కీవ్‌లోని అరుదైన ఖనిజాలలో తమకు వాటా ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించారు. ఇందులోభాగంగా ఉక్రెయిన్‌తో 500 బిలియన్ డాలర్ల డీల్‌ను ప్రతిపాదించామన్నారు.ఉక్రెయిన్- రష్యాల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా చేస్తున్న సహాయానికి బదులుగా కీవ్‌లోని అరుదైన ఖనిజాలలో తమకు వాటా ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించారు. ఇందులోభాగంగా ఉక్రెయిన్‌తో 500 బిలియన్ డాలర్ల డీల్‌ను ప్రతిపాదించామన్నారు. తొలుత దీనిని వ్యతిరేకించిన జెలెన్‌స్కీ ట్రంప్‌తో వాగ్వాదం తర్వాత అమెరికా సాయం ఆగిపోవడంతో అంగీకరించినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా భద్రత నిమిత్తం ఉక్రెయిన్‌లోని విద్యుత్తు ప్లాంట్లను తమకు అప్పగించాలని ట్రంప్ సూచించగా జెలెన్‌స్కీ వ్యతిరేకించినట్లు తెలుస్తోంది.అయితే అగ్రరాజ్యం ఉక్రెయిన్ నుంచి కోరుతున్న మొత్తం రెండో ప్రపంచయుద్ధం తర్వాత జర్మనీ, జపాన్‌లపై విధించిన ఆంక్షల కంటే ఎక్కువని బ్రిటన్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ ఒప్పందం కుదిరితే.. ఉక్రెయిన్‌లో భవిష్యత్ పెట్టుబడి ప్రాజెక్టుల నిబంధనలను నిర్ణయించడంలో అమెరికన్ ఫండ్ నియంత్రణ సాధించే అవకాశం ఉన్నట్లు బ్రిటన్ పత్రిక తెలిపింది. ఏవిధంగా చూసినా, దీనివల్ల యూఎస్‌కే ఎక్కువ మేలు చేకూరుతుందని వివరించింది.

# అన్ని దేశాలపైనా సుంకాల మోత

వాషింగ్టన్(జనంసాక్షి): భారత్, చైనాలపై ప్రతీకార సుంకాలను ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి తెస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన మరో కీలక ప్రకటన చేశారు. వాణిజ్య యుద్ధం కేవలం 10-15 దేశాలకు మాత్రమే పరిమితం కాబోదని.. ప్రపంచంలోని అన్ని దేశాలపైనా సుంకాలు విధిస్తామని అన్నారు. ఈ విషయంలో ఎటువంటి మార్పు ఉండదన్నారు. అగ్రరాజ్యం తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందాలంటే ఈ చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు."చాలా ఏళ్లుగా మేము ప్రపంచదేశాలతో ఉదారంగా వ్యవహరించాము. కానీ చరిత్రలో ఏ దేశాన్ని దోచుకోనివిధంగా అవి అమెరికాను దోచుకున్నాయి. వాణిజ్య పాలసీల విషయంలో కొన్ని సార్లు అమెరికా మిత్రదేశాలు శత్రువుల కంటే దారుణంగా ప్రవర్తించాయి. దశబ్దాలుగా వారు మనపై విధించిన, వివిధ పేర్లతో దోచుకున్న దానికంటే ప్రస్తుతం అగ్రరాజ్యం ఇతర దేశాలపై విధిస్తున్న సుంకాలు చాలా తక్కువ. కాబట్టి ప్రత్యక్షంగా, పరోక్షంగా మాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న ప్రపంచదేశాలన్నిటిపైనా మా వాణిజ్య టారిఫ్‌లు అమలవుతాయి" అని ట్రంప్ పేర్కొన్నారు.ఏప్రిల్ 2 నుంచి అమలయ్యే ప్రతీకార సుంకాలను తప్పించుకునేందుకు అమెరికా దిగుమతులపై టారిఫ్ కోతల వైపు భారత్ మొగ్గుచూపుతోంది. ఈక్రమంలో రెండు దేశాల మధ్య మొదలైన ట్రేడ్ అండ్ టారిఫ్ చర్చల్లో భారత్ ధృఢవైఖరిని ప్రదర్శిస్తోంది. కొన్ని వస్తువులపై టారిఫ్ కోతలకు అంగీకరించినప్పటికీ.. దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తోంది. "సుంకాలు తగ్గించినంత మాత్రాన అమెరికా ఒత్తిడికి లొంగిపోయినట్లు కాదు" అని ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారి పేర్కొన్నారు.మరోవైపు అమెరికా నుంచి మన దేశంలోకి వస్తున్న ఉత్పత్తులపై ఇక్కడ ఎంత సుంకం విధిస్తే, ఇక్కడినుంచి అమెరికాకు చేరుతున్న అదేతరహా ఉత్పత్తులపై సమాన సుంకాన్ని ఏప్రిల్ 2 నుంచి అమలుచేస్తామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రకారం.. భారత ఉత్పత్తులపై అమెరికా సగటున 2.2% సుంకం విధిస్తుండగా.. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకం సగటు 12 శాతంగా ఉంది.

# జుట్టుపట్టుకుని గొడ్డులాగా బాదుతారా?

- అప్పులు తెచ్చి, భూములమ్మితే తప్ప పాలించే పరిస్థితి లేదా?
- హెచ్‌సీయూ ఘటనపై తక్షణమే విచారణ జరపాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ సెంట్రల్ వర్శిటీ భూములను రక్షించేందుకు ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిప్పులు చెరిగారు. "ముఖ్యమంత్రికి కనీస మానవత్వం లేదా? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూముల రక్షణ కోసం విద్యార్థులు ఆందోళన చేస్తుంటే... వాళ్లను గొడ్డును బాదినట్లు బాదుతారా? అమ్మాయిలని చూడకుండా జుట్టుపట్టుకుని గుంజుకుపోయి చితకబాదుతారా? ఇదేం పద్ధతి? భూములు అమ్ముకుంటే రాష్ట్రాన్ని పాలించే పరిస్థితి లేదా? భూములన్ని వేల కోట్లు సంపాదించి దండుకోవడమే మీ పనా? రాబోయే తరాలకు గజం భూమి కూడా ఉంచకుండా చేస్తారా? ఇదేం పాలన? అంత మాత్రాన మీరెందుకు...కేఏ పాల్ కు అప్పగించినా అదే పని చేస్తారు కదా?"అంటూ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో పాల్గొనేందుకు కొద్దిసేపటి క్రితం పార్టీ రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసిన బండి సంజయ్ ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. హెచ్‌సీయూలో భూముల రక్షణ కోసం ఆందోళన చేస్తుంటే అమ్మాయిలని చూడకుండా జుట్టుపట్టుకుని గుంజుకెళ్లారని అన్నారు. ఏబీవీపీ విద్యార్థులు ఆందోళన చేస్తుంటే రూముల్లో దూరి కొట్టడం దుర్మార్గమన్నారు. లాఠీఛార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. మొత్తం ఘటనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**ప్రధాని ఫొటో ఏదీ?**

సన్నబియ్యం విషయంలో మొత్తం ఖర్చు ఎంత? అందులో కేంద్ర, రాష్ట్ర వాటా ఎంతో స్పష్టం చేయాలని బండి సంజయ్ అన్నారు. ఈ బియ్యం విషయంలో ఏటా నరేంద్రమోదీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లకుపైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాని ఫోటో పెట్టకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ ఒక్కటి కాబోతున్నయని జోస్యం చెప్పారు. గ్రూప్ 1 పరీక్షలంతా గందరగోళంగా ఉన్నాయని, మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# హెచ్‌సీయూలో విద్యార్థుల ఉద్యమం ఉధృతం

## బుల్డోజర్లు, సర్వేను ప్రశ్నిస్తున్నవారిపై దాడి • జాతీయ స్థాయిలో విద్యార్థుల ఉద్యమానికి పిలుపు, విపక్షాలకూ ఆహ్వానం

**శేరిలింగంపల్లి, మార్చి 31 (జనంసాక్షి)**

ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపైన, విశ్వవిద్యాలయాలపైనా కక్ష పూరిత ధోరణితో వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ మధ్యనే ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలను, నిరసనలను నిషేధించిన రాష్ట్ర ప్రభుత్వం విపక్షాల నుండి, ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థుల నుండి తీవ్ర నిరసనను ఎదుర్కోగా.. తాజాగా ఆసియా ఖండంలోనే ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాలలో ఒకటిగా బాసిల్లుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీపై రేవంత్ రెడ్డి సర్కారు మరో కోణంలో దాడికి దిగుతుండడం తీవ్ర దుమారానికి ఊతమిస్తోంది. ఈ మధ్యనే జరిగిన అసెంబ్లీ సమావేశాలలో పాఠశాల విద్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ఉపాధ్యాయులు పనిచేస్తున్న పద్ధతికి, తీసుకుంటున్న జీతానికి ఏ మాత్రం పొంతనలేదని, కరువు భత్యం(డి.ఏల) గురించి అడగవద్దని, మొదటి తారీకు జీతాలు ఇవ్వడమే ఎక్కువ అన్నట్టుగా పేర్కొనడం ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేయడంతోపాటు ప్రభుత్వంతో తమకున్న అనుబంధాన్ని పునరాలోచించుకోవాల్సి పరిస్థితికి తీసుకెళ్లిందని మీడియాలో అనేక చర్చలు కొనసాగుతున్న వేళ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విషయంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అత్యుత్సాహం తన దుందుడుకు వైఖరిని విస్పష్టం చేస్తుందని నగరవాసులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వానికి భూమి కావాలంటే అనేకచోట్ల అవకాశం ఉన్నప్పటికీ... హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనే భూమిని చేజిక్కించుకోవాలని చూస్తుండడం ఏరకంగా చూసినా... అంత మంచిది కాదని మేధావి వర్గం, రాజకీయ విశ్లేషకులు సైతం అంగీకరిస్తున్న విషయం.

**400 ఎకరాల భూమి స్వాధీనానికి యత్నం**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భారతదేశంలోనే కాక ఆసియా ఖండంలోనే అత్యుత్తమ యూనివర్సిటీల విభాగంలో ముందు వరుసలో ఉన్నది. ఇక్కడి నుండి జాతీయ అంతర్జాతీయ స్థాయి మేధావులు ప్రపంచ సమకాలీన స్థితిగతులపై తమ ప్రభావాన్ని చూపుతూనే ఉన్నారు. అలాంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఎన్నో విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మడం ద్వారా ఖజానా లోటును కొంత భర్తీ చేసుకోవాలని ప్రయత్నిస్తున్నామని చెబుతున్నప్పటికీ... దీని వెనక పెద్ద రాజకీయ కుట్ర కోణం దాగి ఉందని,




ప్రభుత్వ పెద్దల ప్రత్యేక దృష్టి విలువైన సెంట్రల్ యూనివర్సిటీ భూములపై పడినందునే దానిని హస్తగతం చేసుకోవాలని కుట్రలు పన్నుతోందని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. తెలుగువారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే ఉగాది మహా పర్వదినం రోజున దొంగలను, దోపిడీదారులను తలపించేలా వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసులను బలవంతంగా యూనివర్సిటీ ప్రాంగణానికి రప్పించి బుల్డోజర్లతో సదరు స్థలాన్ని చదలు చేయడం ఎంతవరకు సమంజసం అని, విద్యార్థుల అభిప్రాయం, మనోభావాలతో సంబంధం లేకుండా రాష్ట్ర



ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వారి ఒంటెద్దు పోకడకు, బరితెగింపు విధానానికి నిలువెత్తు నిదర్శనం అని యూనివర్సిటీ బీజేవైఎం నాయకులు ఆరోపిస్తున్నారు. విశ్వవిద్యాలయంలోని కొంతమంది విద్యార్థులు బుల్డోజర్లు నేలను చదును చేస్తున్న ప్రాంతానికి వెళ్లి వివరాలను తెలుసుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు దుడుకుమోతు తనంతో విద్యార్థులను అడ్డుకోవడంతోపాటు ఇష్టానుసారంగా లాగి పడేయడం, అదేమని ప్రశ్నించిన వారిని పోలీసు వాహనాలలో బలవంతంగా ఎక్కించి మాదాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు.

**హెచ్‌సియు సమస్యను జాతీయస్థాయిలో ఎండగడతాం..**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దొర వితత్తనానికి, నియంతృత్వ పోకడకు నిదర్శనంగా నిలుస్తుందని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమి సేకరణ విషయంలో ముందుకు సాగుతున్న తీరు ప్రభుత్వ పతనానికి పునాదిగా మారనుందని హెచ్సీయూ స్టూడెంట్ యూనియన్స్ పేర్కొన్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని టచ్ చేయడం అంటే రాష్ట్ర ప్రభుత్వం కొరివితో తలకోవడమేనని... తమ యూనివర్సిటీ సత్తా తెలియకనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎగిరెగిరి పడుతున్నాడని, తమ నిరసనను ఉద్యమ రూపంగా మార్చి జాతీయస్థాయిలో శిఖరాగ్రాన నిలబెడతామని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీలు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి మద్దతు తెలిపాలని, విద్యార్థి లోకం ఉప్పనై హైదరాబాద్ కు తరలిరావాలని, అహంకారంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు ఉంచాల్సిన అవసరం ఉందని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా విపక్షాలన్నీ ఏకమై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిరక్షణ కోసం కదం తొక్కాల్సిన అవసరం ఉందని, విద్యార్థులతో పెట్టుకున్న ఏ రాజకీయ వ్యవస్థ ప్రపంచంలో మనుగడ సాగించిన దాఖలాలు లేవన్న విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిచిపోయాడని, తాము తప్పకుండా తగిన గుణపాఠం నేర్పి తీరుతామని వారు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు.

# టీపీసీసీ చీఫ్‌కు కరాటే బ్లాక్ బెల్ట్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇప్పటి సమాజంలో తల్లిదండ్రులు పిల్లలను ఒక కంప్యూటర్ కిడ్స్ ల తయారు చేస్తూ మానసిక వత్తిడికి గురి చేస్తున్నారని.. క్రీడల పట్ల ఆసక్తి చూపించాలని శారీరక ఆరోగ్యానికి క్రీడలు, వ్యాయామం ఎంతో అవసరమని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తను ఎంత బిజీ ఉన్నా కరాటేకు తప్పకుండా సమయం కేటాయిస్తానని కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా, జాతీయ ఉపాధ్యక్షులుగా కరాటే పోటీల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నానని అన్నారు. వైఎంసీఏలో మూడు గంటల పాటు జరిగిన పరీక్షలో నెగ్గిన ఆయన.. ఒకినవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నుంచి సర్టిఫికేట్ పొందారు. ఆయన మాట్లాడుతూ.. కరాటే బ్లాక్ బెల్ట్ డాన్ 7 సర్టిఫికెట్ తీసుకోవడం తనకు గర్వంగా, సంతోషంగా ఉందని అన్నారు. తాను కరాటే పోటీలలో పలు దేశాలలో పర్యటించానని ఆస్ట్రేలియా, జపాన్, సింగపూర్ తదితర దేశాలలో ప్రతి ఇంటిలో ఒక క్రీడాకారుడు తప్పకుండా ఉంటారని అన్నారు. పిల్లలు క్రీడలలో రాణిస్తే అన్ని విధాలుగా మంచిదని అన్నారు. తల్లిదండ్రులు క్రీడల పట్ల ప్రోత్సహించాలని అన్నారు. అందుకే గత నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ జాతీయ కరాటే పోటీలను నిర్వహించామని అన్నారు. భవిష్యత్ లో 2027లో ఆసియా కరాటే పోటీలు కూడా ఇక్కడే చేస్తామని అన్నారు.



# వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుపై ముస్లింల నిరసన



**మహబూబాబాద్ ప్రతినిధి, మార్చి 31 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుపై గూడూరు మండలకేంద్రలో ముస్లింల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మహమ్మద్ ఖాసిం సలీం ఖాదర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటినుండి ముస్లింలను అణగదొక్కడానికి వివిధ రకాలుగా ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డుకు సంబంధించిన అన్ని రకాల హక్కులు ముస్లింలకు మాత్రమే చెందుతాయని వారు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా వక్ఫ్ బోర్డ్‌లో ఉన్నటువంటి భూములను బిజెపి ప్రభుత్వం లాగేసుకోవడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. ముస్లింలపై కక్షగట్టి కావాలనే సవరణ బిల్లుతో ముస్లింలకు సంబంధించిన వాటిని కాకుండా మిగతా కులాల వారిని కూడా బోర్డులో భాగస్వామ్యం చేయడానికి ప్రయత్నం చేస్తుందని, ఇది సరైనది కాదన్నారు. భారతదేశంలో వివిధ కులాలకు చెందిన బోర్డులు ఉన్నాయని, వాటిని వేరే కులాలకు సంబంధించిన వ్యక్తులను భాగస్వామ్యం చేయకుండా కావాలనే బిజెపి ప్రభుత్వం కేవలం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలను అణగదొక్క జూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టడానికి ముస్లింలు సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యాకూబ్, ఖలీల్, ఇబ్రహీం, హుస్సేన్, రెహమాన్, రహీం, కరీం, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.




# జోహన్నెస్‌బర్గ్‌లో ఘనంగా ఉగాది సంబరాలు

**జోహన్నెస్‌బర్గ్ (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సౌతాఫ్రికా (ఆశ) ఆధ్వర్యంలో జొహన్నెస్‌బర్గ్ నగరంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకకు భారత కాన్సులేట్ జనరల్ మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి, మన సంప్రదాయాలను ఆచరణలో ఉంచుతూ, సేవా కార్యక్రమాలకు అంకితమైన ఆశ బృందానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ సంస్థ అధ్యక్షుడు రాజు జయప్రకాశ్ బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంతో పాటు ఆశ ఆధ్వరంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. అనేక విపత్తుల సమయంలో బాధితులకు ఆశ నిచ్చిన ఈ ఆశ సంస్థ సేవల ద్వారా సభ్యులందరిలోనూ కొత్త ఉత్సాహం నింపేలా చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా మిస్ వరల్డ్ 2024గా ఎంపికైన దక్షిణాఫ్రికన్ అందాల తార జొలైజ్ జాన్సెన్ వాన్ రెన్స్‌బర్గ్ నిలిచారు. భారత దేశాన్ని దాటి దూర భూముల్లోనూ, స్వదేశపు మట్టిపట్ల మమకారం చెరపని ఆశ, ఎన్నో జీవితాల్లో ఆశ వెలిగించే ధ్యేయంతో ముందుకు సాగుతోందని పలువురు వక్తలు ప్రశంసించారు. చిన్నారుల పాటలు, మహిళల వినోద కార్యక్రమాలు వసంతాల వర్ణాన్ని తెచ్చినట్లు అనిపించాయి. యువత ప్రదర్శించిన నృత్యరూపకాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. ఆంధ్ర వంటకాలు వేడుకకు రుచికరతను మరింతగా చేర్చాయి.

## హెచ్‌సీయూ ముందు ధర్నాకు సీపీఐ(ఎం) పిలుపు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల మీద, యూనియన్ నాయకుల మీద పోలీసుల నిర్బంధాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. విద్యార్థి నాయకులు ఎర్రం నవీన్‌తో పాటు, మరో విద్యార్థి నాయకుడ్ని అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్ చేసారు. వీరిని తక్షణమే విడుదల చేయాలని, 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను విరమించాలని డిమాండ్ చేసింది. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం దగ్గర నేడు ఉదయం 11 గంటలకు ధర్నాకు పిలుపునిస్తున్నట్టు పేర్కొంది. ఈ ధర్నాలో పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు పాల్గొనాలని కోరింది. 400 ఎకరాల భూమి అమ్మకం ప్రయత్నాలను విరమించాలని, విద్యార్థుల మీద కేసులు ఉపసంహరించి తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పేర్కొంది.

## పెరిగిన ఓఆర్ఆర్ టోల్ చార్జీలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుపై (ఓఆర్ఆర్) టోల్ చార్జీలు మరోసారి పెరిగాయి. పెరిగిన చార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ వెల్లడించింది. హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) నిర్వహణలో ఉండే ఓఆర్ఆర్‌ను ఐఆర్‌బీ సంస్థ రెండేండ్ల క్రితం 30 ఏండ్ల కాలానికి లీజు తీసుకుంది. నిబంధనల ప్రకారం ఏటా 5 శాతం వరకు టోల్?ఛార్జీలను పెంచుకునే వెసులుబాటు సంస్థకు కల్పించింది. ఇందులో భాగంగా టోల్ ధరలను పెంచింది. దీని ప్రకారం కారు, జీపు, వ్యాన్, లైట్ వాహనాలకు కిలోమీటర్‌కు 10 పైసలు పెంచింది. దీంతో ప్రస్తుతం కిలోమీటర్‌కు రూ.2.34గా ఉన్న చార్జీలు రూ.2.44కు పెరిగాయి.

# రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను చక్క దిద్దుతున్నాం

- పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం..
- రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇది పేదప్రజల సంక్షేమ ప్రభుత్వమని, పేదప్రజలు కూడా సన్నబియ్యంతో భోజనం చేయాలనే సదుద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ చౌకధరల దుకాణంలో శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డిలతో కలిసి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు, లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను చక్క దిద్దుతూనే, పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబం కడుపు నిండా సన్న బియ్యంతో భోజనం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూనే గత ప్రభుత్వాలు చేయలేని ఒక చరిత్రాత్మకమైన పనిని కేవలం సంవత్సరంన్నర కాలంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేసి చూపెట్టారని స్పష్టం చేశారు. గతంలో రేషన్ బియ్యం పంపిణీలో మాఫియాలు ఉండేవని ఇప్పుడు వాటిని శాశ్వతంగా నిర్మూలించామని తెలిపారు. గత పది సంవత్సరాలలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సన్న బియ్యం పంపిణీ పథకం రాష్ట్ర ప్రజలకు కలిగించే ప్రయోజనాలను మంత్రి వివరించారు. పేద ప్రజలకు పోషకాలతో కూడిన నాణ్యమైన బియ్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ చారిత్రక పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. ఈ పథకం చారిత్రకమని, ఇది రాష్ట్రంలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తుందని తద్వారా పేదలకు సన్నబియ్యంతో కూడిన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేరుస్తూనే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకం అమలుతో నిరుపేదలకు సన్నబియ్యంతో కూడిన ఆహారం అందుతుందని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ అనేది నిరంతరాయంగా కొనసాగుతుందని అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం పంపిణీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ పథకం ద్వారా పేద కుటుంబాలకు భారం తగ్గుతుందని తెలిపారు. రేషన్ కార్డులు పంపిణీ చేపట్టి ప్రతి కుటుంబానికి సన్న బియ్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఎస్ఓ రాములు, ఆర్డిఓ రవి, తహసిల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.





## 'ప్రజలే కాంగ్రెస్‌కు ఉరేస్తారు'

**సూర్యాపేట (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లాలో జరిగిన ఒక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఘాటుగా స్పందించారు. జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. "రేవంత్ భాషలో ఎలాంటి మార్పు రాలేదు. సీఎం అనే సోయిలేకుండా దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆయన భాష తీరే ఆయనను బొందపెడుతుంది" అంటూ మండిపడ్డారు. "15 నెలలు గడిచినా కేసీఆర్ ప్రస్తావన లేకుండా సభలు సాగడం లేదు. కాంగ్రెస్ నేతలు ఎప్పుడూ కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారు," అని ఆయన వ్యాఖ్యానించారు.

**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది**

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయడమేమనగా నా క్లైంట్ ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లో లోన్ కొరకు అప్లికేషన్ చేయడం జరిగింది, శ్రీమతి చాకలి వెంకటమ్మ భర్త దుర్గప్ప గారికి సంబంధించిన ధన్వాడ గ్రామం మరియు మండలానికి సంబంధించిన నా సొంత ఫ్లాట్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 1805/2020 తేదీ. 25-11-2023 నాడు నా పని నిమిత్తం బ్యాంకులో పని ఉండి పోవు సమయంలో మరియు మార్గమధ్యంలో నా సొంత ప్లాట్ ఒరిజినల్ డాక్యుమెంటు పడిపోయినావి కావున సదరు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో తెచ్చి ఇవ్వగలరని మనవి. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఏడు రోజులలో తెలపగలరు. 30-08-2024 నాడు పోలీస్ కంప్లైంట్ ఇవ్వడం జరిగింది

**G.M. RAVI PRAKASH**
**ADVOCATE**
HNO. 1-4-33/L2
Radhakrishna Colony
2nd Railway Gate
GADWAL-509125
Jogulamba Gadwal District
gmraviprakash2@gmail.com
Cell. 9966182979

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
1 ఏప్రిల్ 2025
తెలంగాణ

# మిత్రపక్షాలతో మోడీ సర్కార్‌కు ముప్పు






ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సర్కార్‌కు మిత్రపక్షాలతో ఎప్పటికైనా ముప్పు ఏర్పడుతుందంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఆ ప్రభుత్వ విధానాలు అలా ఉన్నాయి. రెండుసార్లు 2014 నుంచి మంచి మెజారిటీతో దేశాన్ని తన చిత్తం వచ్చినట్లు బిజెపి పాలించింది అందులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏకపక్షంగా తన పాలనను కొనసాగించారు. 10 సంవత్సరాలలో మైనారిటీల అంటే గిట్టని ప్రభుత్వంగా దేశ విదేశాల్లోనూ మోడీ ప్రభుత్వం ప్రసిద్ధికెక్కింది. ఎన్నికల్లో గెలవడం కోసం తమ ప్రభుత్వాలను కొనసాగించడం కోసం హిందూ ,ముస్లిం రాజకీయాలను ఎక్కువగా భారత దేశంలో ప్రాచుర్యంలో పెట్టారు.

**ప్రతీ సందర్భంలోనూ ముస్లింల అవమానాలు.**

అత్యంత దారుణంగా ప్రతి సందర్భంలోనూ ముస్లింలను అవమానించడం ఓపెన్ గా వాళ్ళ బట్టల రంగులను సైతం పేర్కొంటూ మద్దతు ఇచ్చిన పార్టీలను దుర్భాషలాడుతూ కాంగ్రెస్, ఇండియా కూటమి అధికారంలోకి వస్తే మొత్తానికి మొత్తంగా మంగళ సూత్రాలను సైతం తీసుకెళ్లి అమ్మేస్తారని రెండు గేదలు ఉంటే ఒక గేదెను తీసుకెళ్తారని రకరకాలుగా ముస్లింలను చొరబాటుదారులుగా కూడా పేర్కొనడం జరిగింది. పట్టపగలు కారులో ఇద్దరు ముస్లిం యువకులను బంధించి హర్యానా, యూపీ బార్డర్లో కాల్చి (సజీవ దహనం) చంపడం జరిగింది. కాల్చ్ చంపడం జరిగింది ఇలాంటి ఎన్నో హత్యలు జరిగాయి. పట్టపగలు రాళ్లతో కొట్టి గొడ్డు మాంసం తిన్నాడని కలకత్తాకు చెందిన ఒక యువ ముస్లింను హర్యానాలో కొట్టి చంపేశారు.

**గో మాంసం పేరిట అరాచకం.**

ఇద్దరు ఆదివాసీలను ఛత్తీస్గఢ్లో గొడ్డు మాంసం తిన్నారని కొట్టి చంపారు. ఇలా చాలా చోట్ల గో మాంసం పేరు మీద విచ్చలవిడిగా హత్యలు చేశారు ప్రధానమంత్రి మొదలు హోం మంత్రి అమిత్ షా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అసోం ముఖ్యమంత్రి హేమంత్ ఇలా బిజెపి అధికారంలో ఉన్న చోటల్లా రాష్ట్రాల్లో ఒక రకంగా చెప్పాలంటే మైనార్టీల మీద అరాచకమే చోటు చేసుకున్నది. కొన్నిచోట్ల రోడ్లమీద నమాజ్ చేస్తున్నారని పోలీసులు పోలీసులు నమాజు చేస్తున్న వారిపై లాఠీచార్జి జరిపి గాయపరచడం లాంటి సంఘటనలు జరిగాయి. ప్రతి మసీదు కింద మందిర్ వెతకడం ప్రారంభించారు. వందల వేల సంవత్సరాల చరిత్ర గల మసీదుల కింద సైతం దేవుడి విగ్రహాలు ఉన్నాయని ఉన్నాయని వాదనలకు వాదనలకు దిగారు.

**మణిపూర్ చిచ్చు.**

ప్రశాంతమైన హిందూ, ముస్లిం, సిక్కు ,ఈ సాయి కలిసిమెలిసి ఉండే దేశంలో కలతలు సృష్టించారు. మనిపూర్ లాంటి రాష్ట్రంలో రెండు వర్గాల ప్రజల మధ్యన చిచ్చుపెట్టి వేలమంది ఎక్కడికక్కడ చిందర వందర అయి పోయే విధంగా చేశారు. వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. అయినా అక్కడికి మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెళ్ళలేదు. న్యాయం లేకుండా పోయింది. మంచి చెడుల గురించి ఆలోచించే వారే కేంద్ర ప్రభుత్వంలో కరువయ్యారా? అనే పరిస్థితి ఏర్పడింది ఎన్నికలలో ఎట్లా గెలవాలి. ఎంత డబ్బు ఖర్చు పెట్టాలి విపక్షాల ప్రభుత్వాలను ఎలా పడగొట్టా లి. రెండు ట్రైర్ల బిజెపి ప్రభుత్వం పేరిట రాజకీయాలను పూర్తిగా అమ్ముడు పోయే విధంగా చేసి పడేశారు. ఎక్కడ కూడా నీతి న్యాయం లేకుండా పోయింది. కేరళ, గోవా ఎన్నికలలో మంచి నాణ్యమైన గోమాంసం సరఫరా చేస్తామని బిజెపి నాయకులు ఎన్నికల ప్రచారంలో చెప్పుకుంటారు. ఇతర రాష్ట్రాలకు వచ్చేసరికి గో మాంసం తినేవారిని కొట్టి చంపుతారు.

**మోడీ ప్రభుత్వ ద్వంద నీతి.**

ఇది మోడీ ప్రభుత్వ నీతి అయిపోయింది. ఈ నేపథ్యంలో మూడోసారి బిజెపి మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, తెలుగుదేశం అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కేంద్రమంత్రి చిరాగ్ పాస్వాన్, జయంత్ చౌదరి తదితరుల తదితరుల కు వచ్చిన 35 ఎంపీ సీట్ల మద్దతుతో బిజెపి తనకు వచ్చిన 240 సీట్లతో కలిపి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 35 మంది నో అంటే మోడీ ప్రభుత్వం చిటికలో పడిపోతుంది. ప్రస్తుతానికి తమ రాష్ట్రాల కోసం బడ్జెట్లో ఎక్కువ కేటాయింపుల కోసం చంద్రబాబు నాయుడు నితీష్ కుమార్లు బిజెపికి మద్దతు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరే పిఎం నరేంద్ర మోడీ తన చిత్తం వచ్చినట్లు బిల్లులు తీసుకొస్తున్నారు.

**వక్ బోర్డు మీద బీజేపీ నజర్.**

ముస్లిం కుటుంబాలు, జీవితాలతో ముడిపడి ఉన్న వక్ బోర్డుపై దృష్టి పడింది. అందులో మార్పులు చేసి ఆ ఆస్తులను జప్తు చేసుకోవాలనే కుట్రకు బిజెపి తెర లేపింది. అయితే ముస్లింల మద్దతుతో విజయం సాధించిన వారి హక్కులకు ఏమాత్రం భంగం కలగకుండా కాపాడుతామని హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఇటు నితీష్ కుమార్, కేంద్రమంత్రి చిరాక్ పాస్ వన్ తదితరులు బిజెపి బిల్లుకు నో అనే పరిస్థితి వచ్చింది. రంజాన్ పర్వదినాన, అంతకు ముందు ఇఫ్తార్ విందు సందర్భంగా, ఈ మేరకు చంద్రబాబు నాయుడు అందరూ వక్ఫోర్డ్ పరిరక్షణకు హామీ ఇచ్చారు. ముస్లింల హక్కులు రిజర్వేషన్ల పట్ల మద్దతు ప్రకటించారు. బిజెపి ఇప్పుడు ఇరకాటంలో పడింది.

**నల్ల బ్యాడ్జీలతో నమాజుకు.**

ఏకపక్షంగా బిజెపి నిర్ణయం యం తీసుకోబోతుంది. అని ఒకవైపు ముస్లింలు ఆందోళన చెందుతున్నారు. దేశవ్యాప్తంగా రంజాన్ సందర్భంగా నల్ల బ్యాడ్జీలతో నమాజుకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ మైనార్టీ వ్యతిరేక విధానాలకు నిరసన తెలిపారు. మైనారిటీల పట్ల కక్ష సాధింపులను సహించే పరిస్థితి లేదు. నిజానికి ఇప్పుడు చంద్రబాబు నాయుడు లాంటివారు తలుచుకుంటే బిజెపి ప్రభుత్వం పడిపోవడం ఏమంత విషయం కాదు!

**బాబుకు భయపడాల్సింది లేదు**

చంద్రబాబు నాయుడుకు 16 నితీష్ కుమార్కు 12 ఎంపీ స్థానాలు ఉన్నాయి. చంద్రబాబు నాయుడు వాస్తవానికి అసలు పీఎం మోడీ కే భయపడాల్సిన అవసరం లేదు. బహుశా కేసుల భయం ఇంకా ఆయనను వెంటాడుతుందో ఏమో అని ఒక్కోసారి అనిపిస్తుంది. ఇక జనసేన నాయకుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విషయంలోనైతే పెద్దగా భయపడాల్సింది ఏమీ లేదు. అనుకున్నంత సీట్లు కూడా ఆయనకు లేవు. చూడాలి భవిష్యత్తులో ఏం జరగబోతుందో. ఏ మేరకు చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటారు వేచి చూడాల్సిందే.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# ప్రజాస్వామ్యానికి గ్యారెంటీ లేని కాంగ్రెస్ పాలన



మార్చి 13వ తేదిన ఉస్మానియా యూనివర్శిటీ రిజిస్ట్రార్ పేరుతో ఒక సర్క్యులర్ విడుదల అయ్యింది. ఈ సర్క్యులర్ సారంశం యూనివర్శిటీలో ఏలాంటి ఆందోళనలు, ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించకూడదని, ఆందోళనలు పేరుతో యూనివర్శిటీ నిర్వహణకు ఆటంకం కల్గిస్తున్నారని ఈ చర్యలను నిషేదిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. ఇందులో అనుమతి లేకుండా యూనివర్శిటీలోకి చొరబడటం, యూనివర్శిటీ అధికారులు, సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు ఇవ్వడం, ధర్నాలు, ప్రదర్శనలు,ఆందోళనలు చేయడం, నినాదాలు ఇవ్వడం చేయకూడదని ఈ చర్యలకు ఏవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారు లను సంప్రదించాలని, అ తర్వాతే రిజిస్ట్రార్, ఇతర అధికారుల దగ్గరకు రావాలని సర్క్యులర్ లో పొందుపర్చారు. ఇది పూర్తిగా అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్దమైనది. నియంతృత్వమైనది.

ఉస్మానియా యూనివర్శిటీ వందేళ్ల పైగా చరిత్ర కల్గినది. ఈ వందేళ్ల చరిత్రలో ఎన్నో ప్రజా, విద్యార్థి ఉద్యమాలకు, ప్రజా వ్యతిరేక పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించింది. 1938లో ఏర్పడిన స్టేట్ కాంగ్రెస్ వందేమాతరం గీతలాపన చేయాలని పిలుపు పాటించి, విద్యార్థులు గేయాలపన చేస్తే విద్యార్థులను సస్పెండ్ చేస్తే వారికి మద్దతుగా సమ్మె నిర్వహించిన చరిత్ర ఉస్మానియాది. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు ఉస్మానియా చైతన్యం ఎలాంటిదో. చరిత్రలో అనేక కీలకమైన పరిణామాలకు ఉస్మానియా విద్యార్థుల చైతన్యమే కారణం. నిజాం ప్రభుత్వం మొదలు నేటి పాలకుల వరకు పాలకులు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేకత విధానాలపై ఉస్మానియా నిరంతరం పోరాడుతున్నే ఉంది. అలాంటి యూనివర్శిటీలో రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తు యూనివర్శిటీ స్వతంత్ర దెబ్బతీసే విధంగా ఆంక్షలు విధిస్తూ ఈ సర్క్యులర్ విడుదల చేశారు.

గత బిఆర్ఎస్ పాలనలో నిర్బందాలు, నియంతృత్వం, పెరిగిందని, ప్రజాస్వామ్యం అపహాస్యం అయిందని గగ్గోలు పెట్టి, తన ఎన్నికల ప్రసంగా ల్లో, కార్యక్రమాలల్లో మేం ఆరు గ్యారంటీలను ఇచ్చాం ఏడవ గ్యారెంటీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని ప్రకటించారు. హక్కులను, రాజ్యాంగం కాపాడతామని చెప్పారు. కానీ పాలనలో వాటికి భిన్నంగా పరిపాలన చేస్తు న్నారు. ధర్నాలు, ఆందోళనలు, నినాదాలు నిషేదించడం అనేది రాజ్యాంగ వ్యతిరేకం తమ నిరసన ప్రకటించడానికి ప్రజలు, విద్యార్థులు, ధర్నాలు, ఆందోళనలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు జరుపుకునే హక్కులను రాజ్యాంగం ఆర్టికల్ 19(1) ద్వారా కల్పించింది. కానీ రాజ్యాంగ హక్కుకు భిన్నంగా ఉస్మానియా యూనివర్శిటీ. అధికారులు వ్యవరిస్తున్నారు. 1969 తొలి తెలంగాణ ఉద్యమం,2009లో మలి తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఇలాంటి సర్క్యులర్ విడుదల చేయలేదు. నాడు ముళ్ళకంచెలు, గేట్లు బంద్, భారీకేడ్లు పెట్టి ఆంక్షలను విధించారు తప్ప ఏనాడూ ప్రజాస్వామిక హక్కులను కాలరాసింది లేదు.ఇన్ని ఆంక్షలు పెట్టిన అధికారులు ఈ ప్రభుత్వానికి తెలియకుండా ఇచ్చిం దా? అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులు అడిగితే కూడా కనీసం స్పందించ లేదు. రాజ్యాంగ హక్కులు హరించే కాంగ్రెస్ ప్రభుత్వంకు రాజ్యాంగ హక్కు తెలియదా? తమ అధి నాయకుడు రాహూల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని మరి రాజ్యాంగం కాపాడాలని అడుగుతుంటే ఇక్కడ మాత్రం హక్కులను అడగొద్దంటూ ఆంక్షలు విధిస్తున్నారు.

ఈ మద్య ఒక పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రాజకీయాలు గురించి, విద్యార్థి ఉద్యమాలు, విద్యార్థులు పాత్ర గురించి మాట్లడుతూ విద్యార్థులు విద్యార్థి సంఘాలలో పని చేయాలని రాజకీయాలు గురించి ఆలిచించాలని అప్పుడే మంచి రాజకీయాలు ఉంటాయని ప్రకటించారు. అన్ని భావాలపై చర్చలు ఉండాలని యూనివర్శిటీలలో ఈ రకమైన చర్చలు అవసరం అని చెప్పారు. కానీ ఆయన ప్రకటనకు విరుద్ధంగా యూనివర్శిటీల స్వతంత్ర దెబ్బతిసే చర్యలకు తెరలేపారు.

సెంట్రల్ యూనివర్శిటీలలో కనీసం విద్యార్థి సమస్యలు పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు గుర్తింపు ఎన్నికలు ఉంటాయి. మరి రాష్ట్ర యూనివర్శిటీ లలో ఇలాంటి ఎన్నికలు లేవు. సమస్యలు పరిష్కారం కోసం ఎవరిని అడగాలి, ఎవరు ఆందోళన చేయకుండా ఎవరు స్పందించి పరిష్కారం చేస్తారు ఇవి ప్రభుత్వానికి, అధికారులకు తెలియదా, ఇప్పుడిప్పుడే ఉన్నత విద్యలోకి అణగారిన వర్గాలు ప్రధానంగా ఎస్.సి,బి.సి , ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు వస్తున్నారు. ఈ విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఈ విద్యార్థులు అభివృద్ధి కోసం బడ్జెట్లో ఎంత నిధులు ఇస్తున్నారు. ఈ వర్గాల విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు ఏమిటి? నిధులు ఇవ్వకుండా, సరైన సౌకర్యాలు కల్పించకుండా, లైబ్రరీ సౌకర్యాలు ఇవ్వకుండా,మెస్ ఆధునికీకరణ చేయకుండా, నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. ప్రైవేటు విద్యాసంస్థల మాదిరిగా రెగ్యూలర్ కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో భారీగా ఫీజులు పెంచి, కోర్సులు ఏత్తివేశారు, అనేక సంవత్సరాలు నుండి అధ్యాపకులను నియమించకుండా ,నాన్ టీచింగ్ స్టాఫ్ నియమిం చకుండా చదువులు నష్టం చేశారు.ఈ చర్యలు ద్వారా క్రింది వర్గాలకు ఉన్నత విద్య అందకుండా చేసి ఆంక్షలు పేర దూరం చేసే కుట్రలు చేస్తున్నారు.

చదువుకునే పరిస్థితి లేకుండా చేస్తే ప్రశ్నించకుండా,పోరాడకుండా ఎలా ఉంటారు? హాస్టల్స్ లో త్రాగునీరు లేదు, నాణ్యమైన భోజనం లేదు అనేక సందర్భాల్లో అమ్మాయిలే రాస్తారోకో చేశారు. మరి పరిష్కారం చేశారా? హాస్టల్స్ లో పెచ్చులు ఉడి విద్యార్థులు గాయాలు పాలైతే యే అధికారి పట్టించుకున్నారు. యూనివర్శిటీలో ఉన్న ఈ కాలంలో ఎన్ని సమస్యలు పరిష్కారం చేశారు. మరి పేద వర్గాల నుండి వచ్చిన విద్యార్థులు సక్రమంగా చదువుకోకుండా ఉన్న ఆటంకాలు గురించి ప్రశ్నించవద్దా? అడగవద్దా? అడిగితే యూనివర్శిటీ నిర్వహణకు ఆటంకం కల్గించినట్లా? మరి వీటిని అడిగేది విద్యార్థులే కదా !

నాటి ప్రతిపక్ష నాయకుడిగా యూనివర్శిటీకి వచ్చిన రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు ఈ సమస్యలను పరిష్కారంచేయడానికి ఎందుకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు ఇవ్వటం లేదు? ఎందుకు ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయటం లేదు. ఎందుకు స్కాలర్షిప్స్ ఇవ్వటం లేదు? వీటికి సమాధానం చెప్పకుండా ఆంక్షలు విధించి విద్యార్థి హక్కులకోసం నిరసన తెలిపే హక్కు కాలరాసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. యూనివర్శిటీలో సర్క్యులర్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులతో నిర్బందాన్ని ప్రయోగించి, బలప్రయోగం ద్వారా అక్రమ అరెస్టులు చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అసలు లక్ష్యం ప్రభుత్వ ఉన్నత విద్యను ప్రైవేట్ పరం చేయడం అందుకే ఆ విధానాలను అవలంభిస్తుంది. ఉస్మానియానే కాదు ఈకాలంలో నిజామాబాద్ తెలంగాణ యూనివర్శిటీ పేరు మార్చాలని ప్రతిపాదన తీసుకుని వచ్చారు. కార్పొరేట్ శక్తుల నుండి నిధులను తీసుకొని మార్కెట్ అవసరాల కోసం స్కిల్ యూనివర్సిటీ తీసుకువచ్చారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చెందిన భూములను 400 ఎకరాలు కార్పొరేట్ శక్తులకు విక్రయించాలని నిర్ణయాలు చేశారు. ఇప్పటికైనా ఉస్మానియా ఇచ్చిన సర్క్యులర్‌ని వెనక్కి తీసుకొని కాంగ్రెస్ ఇచ్చిన ప్రజాస్వామ్య పునరుదద్ధరణ హామీని నిలబెట్టుకోవాలి.లేకుంటే ప్రతిఘటన తప్పదు.



టి.నాగరాజు
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి
ఫోన్: 9490098292

# అమ్ములపొదిలో ఒక్కొక్కటి.. అందరూ మెచ్చీనచ్చడంలో మేటి!



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పైకి ఉద్వేగాలు, కోపతాపాలతో కనిపిస్తున్నా.. చాలా లోతుగా, వ్యవహార దక్షతకు ప్రతీకగా తన విధాన నిర్ణయాలు గంభీరంగా ఉంటున్నాయి. పరిశీల కులు, పరిశోధకులు, విశ్లేషకులు, తటస్థులను ఇంకా చెప్పాలంటే సీఎంను రాజకీయాల పరంగా వ్యతిరేకించే వారిని సహితం ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక్క వాక్యంలో పేర్కొనాలంటే ఓవరాల్‌గా తెలంగాణ సమాజం మెచ్చీ నచ్చే రీతిలో తన అమ్ముల పొదిలోంచి ఒక్కొక్కటిగానే యూనివర్సల్ డెసిషన్స్‌ను అమల్లో ఉంచుతున్నారు. ఇంకా సింప్లిఫై చేయాలంటే.. రేవంత్ రెడ్డి తప్పుడు నిర్ణయాలు ఇంతకీ ఏముంటున్నాయన్న ప్రశ్నకు ప్రశ్నే జవాబు అవుతోంది.

**రేవంత్‌కు కావాల్సిందివాళ్ళు, వీళ్ళని కాదు, సమాజ హితకారులే**

గత ప్రభుత్వం తీరును, ముఖ్యమంత్రిగా కేసీఆర్ వైఖరిని సందర్భం వచ్చినప్పుడల్లా నిదానమైన స్వరంతోనైనా నిర్మొహమాటంగా నిలేసిన సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి పోయిన సంవత్సరంలోనే మీడియా అకాడెమీ చైర్మన్‌గా నియమించారు. సహజంగానే ఎవరి దృష్టి కోణం వారిదిగా ఆ ఎంపికపై చర్చ, ఎనలైజ్ జరిగింది. ఇప్పుడు తాజాగా తెలియవస్తున్న సమాచారం ప్రకారం మీడియా ఐండ్ కమ్యూనికేషన్స్ అడ్వయిజర్‌గా సీనియర్ ఎడిటర్ అల్లం నారాయణను నియామకం చేస్తున్నట్టు వినికిడి. ఇది గనక నిజమైతే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మరో సంచలనాత్మక నిర్ణయమే అవుతుంది. అంతేకాదు, అల్లం సార్ కు కేబినెట్ హోదా ఇస్తారనీ అంటున్నారు. ఇప్పటివరకూ నిజానికి ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావుకు మాత్రమే కేబినెట్ హోదా అమలవుతోంది. ఎందరో గౌరవంగా, ఆప్యాయంగా, ఆత్మీయంగా అల్లమన్న అని అల్లుకుపోయే నారాయణ సార్ తెలంగాణ ప్రెస్/మీడియా అకాడెమీ తొలి చైర్మన్‌గా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ళలోనే నియమించారు. నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్‌గా చేస్తున్నప్పుడే తనను ఆ పదవి వరించింది. ఆ ప్రకారం చూసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీళ్ళు, వాళ్ళని, వారి మనుషులు, వీరి మనుషులని కాదు..అంతిమంగా తెలంగాణ సమాజ హితకారులే తనకు కావాల్సినవారని ఆచరణలో విదితం చేస్తున్నారు. ఆకునూరి మురళి సార్, ఘంటా చక్రపాణి సార్, కోదండరామ్ సార్, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ గారు వంటి పర్సనాలిటీస్‌ను గౌరవించిన ప్రస్తావన ఇక్కడ సందర్భోచితం.

**కొందరి పైత్యం తొలగించే "అల్లం"!**

ప్రచార ప్రసార మాధ్యమాలు, సాధనాల్లో అపచారం ఉనికి మీద భిన్నాభిప్రాయాలు ప్రవహిస్తున్నాయి. 2000 సంవత్సరానికి ముందూ తర్వాతలా మీడియా రంగంలో మార్పులను చూస్తున్నాం. విశ్వసనీయత, గౌరవం ప్రశ్నార్థకమైంది. న్యూస్, వ్యూస్ రేఖలను పనిగట్టుకుని చెరిపేస్తున్నారు. కమిటెడ్, న్యూట్రల్, ప్రొఫెషనల్ జర్నలిస్టులు జర్నలిస్టులమని చెప్పుకోడానికే జంకాల్సిన దుస్థితి. పాలక, ప్రతిపక్షాల మధ్య రకరకాల మీడియాలు పావులు అవుతున్నాయనే అపప్రద నెలకొంది. ఇలాంటి పూర్వరంగం మేరకు సరికొత్త కబురు ఆసక్తి రేపుతోంది. వాస్తవానికి అల్లమన్నకు ఇస్తారనే ఆ పోస్టు కూడా మనకు బహుశా కొత్తగా పరిచయంలోకి వచ్చేదే!

కడపటి అసెంబ్లీ బడ్జెట్ సెషన్స్ లో వివిధ రకాల మీడియాల గురించి, వ్యక్తుల గురించి ఆవేశం, కోపం, బాధతో భీకర శపథం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ఇంతటి కూల్ నిర్ణయం తీసుకోవడం సంభ్రమాశ్చర్యాలు కలుగజేస్తుంది. ఏదో గ్యాప్ పొంచి ఉన్న నేపథ్యంలో అల్లం సార్, శ్రీనివాస్ రెడ్డి సార్ సేవలు అల్లకల్లోలంగా పరిణమిస్తున్న సమాచార సాగరంలో తరుణోపా యమే. ఈ తెలంగాణ దిగ్గజ సంపాదక ద్వయం ఉభయతారక మార్గం వేయాల్సిన బాధ్యత సమర్థంగా తలపెట్టాలనే ఆశలు, ఆకాంక్షలు బోలెడు!

ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు
హైదరాబాద్, 9440850384

# పతనం అంచున అమెరికా

## ప్రపంచ ఆధిపత్యం ఇకపై సాగదు!




ప్రపంచ రాజకీయాల్లో, ఆధిపత్య పోరాటాల్లో జియో పాలిటిక్స్ ను కలిపి చరిత్ర కాలంగా తిని సరైన విధంగా అర్థం చేసుకోకపోతే ప్రస్తుతం జరుగుతున్న అంతర్జాతీయ పరిణామాలు అంతుపట్టని గందరగోళంగా కనిపించవచ్చు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసినప్పుడు బ్రిటన్ గెలిచినా, ఆర్థికంగా పతనం చెందింది. అది గ్లోబల్ సూపర్ పవర్ హోదాను కోల్పోయింది. అదే సమయంలో, వేగంగా అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ స్థానాన్ని ఆక్రమించి, ప్రపంచంలో ప్రధాన శక్తిగా (సూపర్ పవర్ గా)ఎదిగింది.

ఈ మార్పుల నేపథ్యంలో , సోవియట్ యూనియన్ మరో అగ్రరాజ్యంగా అవతరించింది. అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసే శక్తిగా ధీటుగా ఎదిగింది. 1949లో అమెరికా తన మిత్ర దేశాలతో నాటో సైనిక కూటమిని ఏర్పాటు చేయగా, 1955లో సోవియట్ యూనియన్ వార్సా పాక్ట్‌తో ప్రత్యామ్నాయ సైనిక కూటమిని ఏర్పాటు చేసింది. దీంతో, ప్రపంచ రాజకీయాలు రెండు కూటముల మధ్య 'కోల్డ్ వార్' దశలోకి ప్రవేశించాయి. కోల్డ్‌వార్ పేరుతో, అమెరికా తన మిత్రదేశాలకు భారీగా ఆర్థిక సహాయాలు అందించింది, సైనికంగా బలోపేతం చేసింది. తన అధికారం పెంపొందించుకోవడానికి ప్రాపంచికంగా అనేక యుద్ధాల్లో నేరుగా లేదా పరోక్షంగా పాల్గొంది. సోవియట్ యూనియన్ తన కూటమితో పోటీ పడటంతో, ప్రపంచం క్రమంగా రెండు శిబిరాలుగా విడిపోయింది. కానీ, 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో, వార్సా పాక్ట్ కూడా రద్దయింది. ఈ పరిణామాలతో, అమెరికా అంతర్జాతీయ రాజకీయాల్లో తిరుగులేని ఆధిపత్య శక్తిగా (సూపర్ పవర్‌గా) మారింది. అయితే, నాటో కూటమిని కొనసాగించాలా, లేదా? అనే ప్రశ్న అప్పటికి వచ్చింది. సోవియట్ యూనియన్ కూలిపోవడంతో, నాటో అవసరం లేదన్న వాదనలు వచ్చాయి. కానీ, అమెరికా తన స్వప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నాటోను కాపాడుకుంది. పైగా, దానిని రష్యా సరిహద్దుల వరకు విస్తరించింది. ఇది రష్యాతో సంబంధాలు మరింత విషమించేందుకు దారితీసింది.

1990ల నుండి ప్రపంచంలో నూతన మార్పులు చోటు చేసుకున్నాయి. లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్ గ్లోబలైజేషన్ (ఎల్ పీజీ) పేరుతో, ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక పోటీ తీవ్రమైంది. వాణిజ్య సంబంధాల్లో కొత్త ఒప్పందాలు, మార్పులు చోటు చేసుకున్నాయి. అమెరికా గత మూడు దశాబ్దాల్లో పలు కీలక రాజకీయ, ఆర్థిక తప్పిదాలు చేసింది. ముఖ్యంగా, మిడిల్ ఈస్ట్ యుద్ధాలలో నష్టపోయింది. ఇరాక్, అఫ్ఘానిస్తాన్ లలో సాగించిన యుద్ధాలు అమెరికాకు భారీ వ్యయ భారం అయ్యాయి. ప్రపంచ రాజకీయాల్లో ఆ దేశ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో, అమెరికా 2025 నాటికి తన సూపర్ పవర్ హోదాను కోల్పోయే ప్రమాదం నెలకొంది. చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన శక్తిగా ఎదుగుతోంది. చైనా తన వాణిజ్య వ్యూహాలతో, 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్' (బీఆర్ ఐ) ద్వారా ప్రపంచ మార్కెట్‌పై తన ఆధిపత్యాన్ని పెంచుకుంటోంది. రష్యా తన శక్తిని పునర్నిర్మించుకుంటోంది. అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా మిత్రదేశాలు (పాత నాటో దేశాలు) క్రమంగా అమెరికాకు దూరమవుతున్నాయి.తన మిత్ర దేశాలను అమెరికా నూతన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండో సారి అధికారంలోకి రాగానే అమెరికా స్వదేశీ, విదేశీ విధానాలలో తీవ్ర మార్పులు ట్రంప్ తీసుకొచ్చాడు. ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘమవుతూ, నాటో లక్ష్యాలు నెరవేరకపోవడంతో, అమెరికా మరింత నిస్సహాయంగా మారుతోంది.

ఇది చూసిన అమెరికా తన వ్యూహాలను మార్చుకోవాలని భావిస్తోంది. ట్రంప్ ప్రభుత్వం నుంచి బైడెన్ ప్రభుత్వం వరకు, 'అమెరికా ఫస్ట్' అనే విధానాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. వలసదారుల నియంత్రణ, విదేశీ దిగుమతులపై భారీ (టారిఫ్ లు) పన్నులు విధించాడు . ఈ విషయం భారత్‌తో సహా పాత నాటో కూటమి నుంచి కూడా బాధించింది. అమెరికాను నమ్మే స్థితిలో నాటో దేశాలు లేవు. అందుకే అమెరికా నాటో నుండి బయటపడే సూచనలు కనపడుతున్నాయి. అమెరికా తనకు తానే క్రమంగా ప్రపంచ దేశాలకు దూరంగా జరుగుతుంది.

అమెరికా నూతన వ్యూహంలో భాగంగా, చైనాను ప్రధాన ప్రత్యర్థిగా లక్ష్యంగా పెట్టుకుంది. రష్యా వంటి దేశాలతో అసలు పోటీని తగ్గించి, చైనాను అణచివేసే దిశగా దూసుకుపోతుంది. దీనికి గల కారణం, వాణిజ్య పోరాటం. గత రెండు దశాబ్దాల్లో చైనా అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ, ప్రపంచ మార్కెట్‌ను ప్రభావితం చేస్తోంది. బ్రిక్స్ వంటి సంస్థల ద్వారా, అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయ వ్యవస్థను రూపొందిస్తోంది. ఇది అమెరికా ఆర్థిక ప్రభావాన్ని క్షీణింపజేస్తోంది.

ప్రస్తుత ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు, తైవాన్ విషయంలో అమెరికా మిశ్రమ వ్యూహాన్ని అవలంబిస్తోంది. కానీ, దీని ఫలితాలు ఏమిటనే ప్రశ్నకు ఇప్పట్లో సమాధానం దొరకదు. ఒకవైపు, మిత్ర దేశాలను సంపాదించుకోవాలని చూస్తున్న అమెరికా, మరోవైపు, తన ఆధిపత్య పోరాటం కోసం పాత మిత్రులను కూడా కోల్పోయే ప్రమాదంలో ఉంది.

మొత్తానికి, అమెరికా కొత్త ప్రపంచ వ్యూహాన్ని అమలు పరచడం తప్పనిసరి. కానీ, అది విజయం సాధిస్తుందా? లేక, ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో మరింత లోతుగా దిగజారుతుందా? రాబోయే కాలంలో ఇది స్పష్టమవుతుంది. కానీ, ఒక విషయం మాత్రం ఖాయం - ప్రపంచ రాజకీయాల్లో అమెరికా యొక్క ఆధిపత్యం ఇకపై యథాతథంగా కొనసాగే పరిస్థితులు కన్పించటం లేదు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



## మధుమాసం

మావికొమ్మ పూచిందీ.....
మల్లె గాలి వీచిందీ....
మధుమాసం వచ్చిందని...
కోయిలమ్మ కూసిందీ....!

కొత్త చిగురుల అందాలు
కోటి కాంతుల మిలమిలలు
తెలుగు ధనము పంచుకుంది
తీపిరుచుల మధురిమలు....!

ఆరు ఋతువుల ఆమని
అందమైన పూబోణి
విశ్వావసుతోని కలిసి
వచ్చి విందు జేయునని..!

చెరుకు తీపి పులుపులతో
చేదువగరు కారముతో
ఆరు రుచులు నింపుకుని
సాగుమనెను విలువలతో....!

విశ్వావసు వత్సరము
ఆనందపు కచ్చురము
విశ్వసించి సాగినచో
చేర్చేను సుఖతీరము!

విశ్వానికి మైత్రి ఇది
విజయాలకు సూచికిది
సంశయముకు తావులేదు
సౌఖ్యము నందిచునది!

విశ్వాసమే విశ్వావసు
పెంచునులే నీ యశస్సు
సంకల్పపు బలముతోని
జీవిత మందున 'ఉషస్సు' !

వంగరి వెంకటేశం

## లక్ష్మీనగర్ కాలనీలో దొంగతనం



- ఇద్దరు నిందితుల అరెస్ట్

**అల్వాల్, మార్చి 31 (జనంసాక్షి) :** అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. నిందితులు మైలారం కౌశిక్ 19 హరిజన బస్తి హస్మత్ పెట్, బండారి రవి తేజ 20, ఎల్బీ నగర్ లకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి సుమారు 9లక్షల విలువగల 12.3 తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం, ఒక సుత్తె స్వాధీనం చేసుకున్నట్లు పేట్ బషీర్‌బాద్ ఏసీపీ రాములు తెలిపారు. నిందితులు కౌశిక్, రవి తేజ ఇద్దరూ తొమ్మిదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. అయితే, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో చదువును మానేసి ఒకరు బట్టల షాపులో సేల్స్‌మెన్‌గా, మరొకరు స్వీపర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 27వ తేదీ నిందితులు ఓ ఫంక్షన్‌లో కేటరింగ్ పనికి వెళ్లారు. పని ముగిసిన తర్వాత మద్యం సేవించి, త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనానికి ప్రణాళిక రూపొందించారు. ద్విచక్ర వాహనంపై తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించారు. ఆ తర్వాత లక్ష్మీ నగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంటిని టార్గెట్ చేసి, తాళాలను పగులగొట్టి, అల్మారాలో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, సుమారు 100 సీసీ కెమెరాలను పరిశీలించి, నిందితుల కదలికలను గమనించారు. చివరకు కానాజీగూడ ప్రాంతంలో కౌశిక్, రవి తేజలను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు చేయాలని భావించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేట్ బషీర్‌బాద్ ఏసీపీ రాములు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును ఛేదించడంలో అల్వాల్ ఎస్‌హెచ్‌ఓ రాహుల్ దేవ్ నేతృత్వంలో, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ తిమ్మప్ప, క్రైమ్ సిబ్బంది డాలి నాయుడు, జీవన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మోహన్ నాయక్, సుధాకర్, రమాకాంత్, గౌస్, విద్యాకర్ కీలక పాత్ర పోషించారు. నేరస్థులను చాకచక్యంగా పట్టుకున్నందున, వారి పనితీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన రివార్డులు అందజేయబడుతాయని ఏసీపీ రాములు తెలిపారు.

## అత్యాచారయత్నం కేసులో అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

- బాధితురాలి తరపున వాదించనున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్
- ఎయిడ్ ఎన్జీవో డైరెక్టర్ పిఎస్ఎస్ హరి ప్రసాదరావు

**పెన్‌పహాడ్, మార్చి 31 (జనం సాక్షి) :** 11 ఏళ్ల బాలిక వక్షోజాలను పట్టుకోవడం ఆమె పైజామా దారాన్ని విరగొట్టడం, ఆమెను కల్వర్టు కిందకు లాగడం అత్యాచార ప్రయత్నం కాదని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పుపై భారత సుప్రీంకోర్టు బుధవారం స్టే విధించింది ఈ నిర్ణయం పిల్లల హక్కుల పరిరక్షణకు ఒక ముఖ్యమైన అడుగని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ డైరెక్టర్ పి ఎస్ ఎస్ హరిప్రసాదరావు అన్నారు సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ఆలయన్స్ దాఖలు చేసిన ప్రత్యేక లీవ్ పిటిషన్ను సుప్రీంకోర్టు అంగీకరించిందని బాధితురాలికి ప్రాతినిధ్యం వహించడానికి అనుమతి ఇచ్చిందని తెలిపారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ పిల్లల రక్షణ, హక్కుల కోసం 416 జిల్లాల్లో 250 కి పైగా ఎన్జీవోల నెట్వర్క్ తో కలిసి పోరాడుతోందని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తుందని దేశంలో ఒక్క ఆడబిడ్డ కూడా అన్యాయానికి గురి కాకూడదని అలాంటి వారికి ఈ అలయన్స్ అండగా నిలుస్తుందని తెలిపారు పిల్లల హక్కుల పట్ల సర్వోన్నత న్యాయస్థానం ఎంత సున్నితంగా వ్యవహరిస్తుందో ఈ కేసు విషయంలో జోక్యం చేసుకోవడం ద్వారా మనకు అర్థమవుతుందని అలయన్స్ పిల్లల కోసం న్యాయపరమైన హక్కుల కోసం పోరాడుతుందని బాల్యవివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు,బాల కార్మిక వ్యవస్థ వంటి నేరాలను నిర్మూలించడానికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అలహాబాద్ హైకోర్టు నిర్ణయం పై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు



వారు ఈ తీర్పు షాకింగ్, అసమర్థమైనదని తీవ్రంగా వ్యాఖ్యానించిందని తెలిపారు. ఈ కేసులో ముఖ్య విషయాలను ఆయన తెలియజేస్తూ ఈ తీర్పులో చేసిన కొన్ని పరిశీలనలు ముఖ్యంగా 21,24, 26 పేరాలలో తీర్పు పూర్తిగా సున్నితత్వం లేకపోవడాన్ని గుర్తించారని దాదాపు నాలుగు నెలల చర్చల తర్వాత ఇచ్చిన ఈ తీర్పు చట్ట విరుద్ధంగా అమానవీయంగా ఉందని ధర్మాసనం పేర్కొందని తెలిపారు మూడున్నర సంవత్సరాలకు పైగా ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయబడలేదని, అధికారిక దర్యాప్తు ప్రారంభించకుండా మూడు సంవత్సరాలకు పైగా కాలయాపన జరిగిందని పేర్కొన్నారు పేద, దుర్బలమైన బాల బాధితురాలికి ఈ సుదీర్ఘ నిష్క్రియాత్మకమైన,తీవ్రమైన అన్యాయం జరిగిందని న్యాయస్థానం గుర్తించిందని తెలిపారు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ ఈ నేరాన్ని అత్యాచార ప్రయత్నంగా పరిగణించి నిందితులకు ఫోక్సో చట్టంలోని సెక్షన్ 376 తో కలిపి సెక్షన్ 18 కింద విచారణ కొరకు కోర్టు సమన్లు జారీ చేసిందని అయితే బాలిక తాకరానిచోట పట్టుకొని, బలవంతంగా కల్వర్టు కిందకు లాగడం, దారిన వెళ్లేవారు వచ్చినప్పుడు, పారిపోవడం సెక్షన్ 376/51 ఐపిసి కింద అత్యాచారం చేయడానికి ప్రయత్నించడం లేదా ఫోక్సో చట్టంలోని సెక్షన్ 376 ఐపిసి కింద అత్యాచారం సెక్షన్ 18 తో కలిపి నేరంగా నిర్ధారించడం సరిపోదని అలహాబాద్ హైకోర్టు అభిప్రాయపడింది. తత్ఫలితంగా ఈ అభియోగాన్ని పోకుసో చట్టంలోని సెక్షన్ 351 (బి) ఐపిసి సెక్షన్ 9/10 తో కలిపి సవరించారు గౌరవనీయులైన సుప్రీంకోర్టు భారతీయ యూనియన్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం, కేసులో పాల్గొన్న అన్ని పార్టీలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ బాధితురాలి గౌరవం, హక్కులు కాపాడబడతాయని సుప్రీంకోర్టుపై తమకు న్యాయం ఉందని చట్టపరమైన చర్యలకు ఇప్పుడు నాయకత్వం వహిస్తుందని పిఎస్ఎస్ హరి ప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ ఎన్జీవో కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ వి. సోమన్న,తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో లోటు బడ్జెట్..



**ఓయూ, మార్చి 31 (జనంసాక్షి) :** ఓయూ బడ్జెట్లో పరిశోధనలకు ప్రాధాన్యం ఉంటుందని వి సీ కుమార్ తెలిపారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 43.1 కోట్ల లోటుతో బడ్జెటు ప్రవేశపెట్టింది. రూ. 750.8 కోట్ల ఆదాయ అంచనాతో, ఖర్చులు రూ. 815.6 కోట్లుగా యంత్రాంగం వెల్లడించింది. పరిశోధనలు, ఐటీకీ ప్రాముఖ్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

## నెమలి మృతి



**శివ్వంపేట, మార్చి 31 (జనంసాక్షి) :** అనుమానాస్పద స్థితిలో జాతీయ పక్షి నెమలి మృతి చెందిన ఘటన శివ్వంపేట మండలంలోని గంగయిపల్లి పోతారం రోడ్డు మార్గంలో సోమవారం జరిగింది. సంఘటన స్థలానికి అటవీ శాఖ బీట్ అధికారి కుమార్ వెళ్లి పశు వైద్యులతో పంచనామా నిర్వహించి, నెమలి నీ పూడ్చి వేశారు. ఇదిలా ఉండగా నెమలి మృతిపై ఫారెస్ట్ అధికారులు అన్ని కోణాలలో పరిశీలన చేస్తున్నారు.

## సర్వ మతాల సారాంశం ఒక్కటే..!

- షాద్‌నగర్ ఎమ్మెల్యే “వీర్లపల్లి శంకర్



**షాద్‌నగర్, మార్చి 31 (జనంసాక్షి) :** ఈ ప్రపంచంలో సర్వ మతాల సారాంశం ఒక్కటేనని, సర్వ ధర్మాలు జీవకోటి పరిరక్షణ కోసం తోడ్పాటును అందిస్తాయని షాద్ నగర్ ఎమ్మెల్యే “వీర్లపల్లి శంకర్” అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్, ఫరూక్ నగర్ లో రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం పెద్ద ఎత్తున ఈద్గా వద్ద ప్రార్థనలు జరిగాయి. దీనికి ముస్లింలు పెద్ద ఎత్తున ఈద్గా వద్దకు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర కాంగ్రెస్ శ్రేణులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ అలైబలై చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద సోమవారం పెద్ద ఎత్తున ఈదుల్ ఫితర్ నమాజ్ వేడుకలు జరిగాయి.

## శేష జీవితాన్ని కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలి

- ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 31 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ ఈ రోజు పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజును ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు .ముందుగా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఎస్సై పనిచేస్తూ ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన సూరిశెట్టి శ్రీనివాసరావు గారిని ఎస్పీ గారు ఘనంగా సత్కరించడం జరిగింది. పోలీస్ శాఖలో నిత్యం విధుల నిర్వహణలో ఉండే అధికారులు మరియు సిబ్బందికి ఎలాంటి సమస్యలు తలెత్తినా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా వాటిని పరిష్కరించే విధంగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన శ్రీనివాసరావు సేవలు మరువలేనివని అన్నారు. అనంతరం అశ్వరావుపేటలో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన రెహమాన్‌ని మరియు అనారోగ్య సమస్యలతో వాలంటరీ రిటైర్మెంట్ పొందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వజ్జ రామయ్యని పూలమాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన అధికారులు




మరియు సిబ్బంది తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని అన్నారు. గత 40 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తూ తాము సాధించిన అనుభవాన్ని ఈ రోజు పదవీ విరమణ పొందిన అధికారులు ఎస్పీకి వివరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు,ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు మరియు పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టాలి



**తాండూరు, మార్చి 31 (జనంసాక్షి) :** ఏప్రిల్ 2న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే బీసీల పోరు గర్జనకు చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలుదేరినట్లు బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో మరియు విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన చట్టాన్ని యధావిధిగా పార్లమెంట్లో చట్టం చేయాలని 2025 లో జరిగే జనగణలో కులగన్న నిర్వహించాలని 50శాతం పైగా ఉన్న ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో మొదటి నుంచి అన్యాయం జరుగుతునే ఉందని అన్నారు. ఒక బీసీ ప్రధానిగా ఉన్న బీసీలకు న్యాయం జరగట్లేదని విచారం వ్యక్తం చేశారు. ఢిల్లీకి విక్రమ్ నరేష్ నరసింహ మల్లికార్జున్ పానగంటి విజయ్ వీరితోపాటు పెద్ద ఎత్తున బీసీ విద్యార్థి యువజన సంక్షేమ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు బయలుదేరడం జరిగింది.

## ఉప్పల్ సిటి న్యూరో హస్పిటల్‌లో దారుణం

**ఉప్పల్, మార్చి 31 (జనం సాక్షి) :** ఉప్పల్ లోని సిటి న్యూరో సీఎస్సీ హాస్పటల్ లో దారుణం చోటుచేసుకుంది. వైద్యం వికటించి వ్యక్తి మృతి కుటుంబ సభ్యులు ఆరోపణ. మేడ్చల్ జిల్లా ఔషపూర్ గ్రామానికి చెందిన సందీప్ గౌడ్ (36) అనే వ్యక్తి కి కడుపు నొప్పితో హాస్పటల్ లో జాయిన్ అయ్యాడు. పరీక్షలు చేసిన హాస్పటల్ సిబ్బంది సందీప్ గౌడ్ బాగానే ఉన్నాడు అని జీర్ణాశయ కి సంబంధించిన సమస్య ఉంది అని చెప్పిన డాక్టర్లు ఈ చికిత్స కోసం ఒక లక్షనలభై వెయ్యలా రూపాయలు వరకు అవుతుంది అని చెప్పి తీరా డబ్బులు కట్టించుకొని తను చనిపోయాడు అని అంబులెన్స్ మాట్లాడి ఇక్కడికి నుండి తీసుకువెళ్లాలి అని చెప్పిన హాస్పటల్ సిబ్బంది. డెడ్ బాడీ నీ తీసుకొని హాస్పటల్ ముందు సందీప్ గౌడ్ కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. హాస్పటల్ మెండి వేఖరి నశించాలి అంటూ నినాదాలు చేశారు. సిటి న్యూరో యాజమాన్యం డౌన్ డౌన్ అంటూ



నినాదాలు చేశారు. సందీప్ గౌడ్ తల్లి మాట్లాడుతూ నా కొడుకు ఎలాంటి రోగం లేకున్నా వైద్యం వికటించిది అనే అనుమానం ఉంది అని సందీప్ తల్లి వాపోయింది. హాస్పటల్ పైన కటిన చర్యలు తీసుకోవాలని కోరింది.

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నూతన బీఆర్ఎస్ అధ్యక్షునిగా వెంకటేష్



**రాజేంద్రనగర్, మార్చి 31 (జనంసాక్షి) :** మైలార్దేవ్పల్లి డివిజన్ నూతన బీఆర్ఎస్ అధ్యక్షునిగా మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్‌ను మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి నియమించారు. సోమవారం ఆమె నివాసంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డిలతో కలిసి ఆమె నూతన బిఆర్ఎస్ అధ్యక్షునిగా ఎస్. వెంకటేష్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి స్వర్గీయ ఇంద్రారెడ్డి , మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాజేంద్రనగర్ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు కార్తీక్ రెడ్డి సేవలు అత్యవసరమైనవని, రానున్న ఎలాంటి ఎన్నికలు అయిన కార్తిక్ రెడ్డిని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిపించుకొని తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొలన్ సుభాష్ రెడ్డి రమేష్ ముదిరాజ్, నోముల రాము యాదవ్, పొయిల జీవన్ దాస్, ఎడ్లకారి సూర్యం, మంచర్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## బోనం ఎత్తిన మంత్రి కొండా సురేఖ

- ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర

**వరంగల్ ఎంజీఎం, మార్చి 31 (జనంసాక్షి) :** ఉగాది పండుగ సందర్భంగా నగరంలోని 37వ డివిజన్ ఖిలావరంగల్ తూర్పు కోటలో గల పెద్దమ్మ తల్లి గుడి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన బోనాల జాతరలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మంత్రి సురేఖ ఎడ్ల బండి పై గుడి చుట్టు ప్రదర్శనలు చేశారు. అనంతరం పెద్దమ్మ తల్లి బోనం ఎత్తుకొని ఆ తల్లికి మొక్కులు సమర్పించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో భక్తులను ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. ప్రకృతి పట్ల తెలంగాణ ప్రాంతానికున్న ఆరాధనకు, తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక తత్వానికి ఉగాది పండగ రోజున జరిగే పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు నిదర్శనంగా నిలుస్తాయని తెలిపారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ



సంతోషాలతో సిరి సంపదలతో సుభిక్షంగా వర్ధిల్లాలని మంత్రి సురేఖ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండి జనార్దన్, డైరెక్టర్ గజ్జెల శ్యామ్, మాజీ కార్పొరేటర్ దామోదర్ యాదవ్, చాంబర్ ఆఫ్ కామర్స్ జాయింట్ సెక్రటరీ సాగర్ల శ్రీనివాస్, సంగరబోయిన చందర్, డివిజన్ అధ్యక్షులు దూడయ్య, కాంగ్రెస్ నాయకులు బెడద వీరన్న, రాంబాబు, శ్రీనివాస్, అల్లం కేశవులు, కర్ణాకర్, కుమార్, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## త్యాగం, దయ విలువల సారాంశమే రంజాన్

**శేరిలింగంపల్లి, మార్చి 31 (జనంసాక్షి) :** త్యాగం, దయ అనే మహోన్నత విలువల సారాంశాన్ని ప్రతిబింబించేదే ప్రపంచ మహా పర్వదినం రంజాన్ అని రాష్ట్ర ప్రజాపద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) మహా పర్వదినాన్ని పురస్కరించుకొని హఫీజ్పేట్ డివిజన్ సీనియర్ నాయకులు అక్తర్ నేతృత్వంలో సోమవారం



ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు కార్యక్రమానికి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఉప్పలపాటి శ్రీకాంత్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి పీఏసీ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ముస్లిం సోదరులతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు వారు రంజాన్ మహా పర్వదిన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసాన్ని, పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు తాము హార్దిక శుభాకాంక్షలు అని తెలియజేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు రాగం, ఉప్పలపాటి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు జమీర్, హమీద్, నాయకులు గణేష్ ముదిరాజ్, మారబోయిన రాజు యాదవ్, బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, నాగరాజు, వెంకటేష్, నరేందర్ బల్ల, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ సర్కార్ బంజారాలకు మంత్రి పదవి కేటాయించాలి

**ఖైరతాబాద్, మార్చి 31 (జనం సాక్షి) :** బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి గిరిజన సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. బంజారాలకు రాష్ట్రంలో మంత్రి పదవి ఇవ్వకుంటే కాంగ్రెస్ పార్టీకి కలిగే నష్టం ఢిల్లీ పెద్దలను కలిసిన వివరాలను గిరిజన శక్తి-గిరిజన జేఏసీ నాయకులు వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమా వేశంలో గిరిజన శక్తి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ.. తెలంగా ణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడడంలో తెలంగాణ రాష్ట్రంలోని 30లక్షల జనాభా కలిగిన బంజారాల పాత్ర ఎంతో కీలకమైనదని, పదేళ్ల బీ ఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రభు త్వంతోనే మాకు న్యాయం జరుగుతుందని భావించి కాంగ్రెస్ పార్టీకి వెన్నుంటూ నిలిచిన సామాజిక వర్గం లంబాడ సామాజిక వర్గమని అన్నారు. ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీని, పార్టీ ప్రధాన కార్యదర్శి కే.సి.వేణుగోపాల్, పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజ్, పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డీకే శివకుమార్, పవన్ కేరా లతో పాటు అనేక పెద్దలను కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు అశోక్ రాథోడ్, గిరిజన జేఏసీ ఛైర్మెన్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని ఇప్పటివరకు వినతి పత్రాలు మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటినుండి నిరసన కార్యక్రమాలు కూడా చేపడతామన్నారు. ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ అధ్యక్షులు సురేష్ నాయక్ మాట్లాడుతూ బంజారా జాతికి మంత్రి పదవి ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీకి చాలా నష్టం జరుగుతుందని గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల్లో ఎవరికైనా పార్టీ విధేయతగా ఉన్నవారికి సీనియర్‌గా ఉన్నవారికి అవకాశం ఇస్తే బంజారా జాతి ఎప్పటికీ కాంగ్రెస్ తోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్కపతి




నాయక్, బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్, మద్దతుగా ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఐతరాజు అంబెందర్, మాదిగ యూత్ ఫోర్స్ అధ్యక్షులు కొండ్రపల్లి రమేష్, రాజు నాయక్, లచ్చు సాదు, నరేష్, శివ చౌహాన్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయానికి వచ్చిన మహిళపై సామూహిక అత్యాచారం

- నిందితులను అరెస్టు చేసి విచారిస్తున్నాం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్

**ఉర్కొండ, మార్చి 31 (జనం సాక్షి) :** శ్రీ ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చిన మహిళపై సామూహిక అత్యాచారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో జరిగిన సామూహిక అత్యాచార ఘటన స్థలాన్ని నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ సోమవారం రోజు పరిశీలించడం జరిగింది. సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ మాట్లాడుతూ మహిళా ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని, అత్యాచార ఘటనలో పాల్గొన్నా ఏడుగురి నిందితులని అరెస్టు చేసి విచారిస్తున్నామని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేశారు. ఈ కేసు మాటింతో విచారణ జరుగుతుందని అన్ని ఆధారాలు పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని మీడియా ముఖంగా తెలియజేయడం జరిగింది. ఈ సంఘటనలో ఇంకా ఎవరైనా పాల్గొన్నారా? వారికి ఇంతకుముందు ఏమైనా నేర చరిత్ర కలిగి ఉన్నదా అనే కోణంలో విచారణ చేస్తున్నామని ఈ సందర్భంగా పత్రికా ముఖంగా




ఎస్పీ వైభవ్ గైక్వాడ్ తెలియజేశారు. ఇంతకుముందు ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో కానీ మిగతా సమయంలో గానీ ఇలాంటి సంఘటనలు జరగలేదని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, సీఐ నాగార్జున పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి

**తూప్రాన్, మార్చి 31 (జనం సాక్షి) :** నేరాలను నియంత్రించడంలో నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని తూప్రాన్ డిఎస్పి వెంకటరెడ్డి తెలిపారు. మనోహరాబాద్ పోలీసు స్టేషన్ పరిదిలోని దండుపల్లి చౌరాస్తా వద్ద ఐటిసి కంపని వారు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఐదు బార్కెట్లను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు . 2,40,000/- రూపాయలతో జాతీయ రహదారిపై ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ గుర్తింపు ద్వారా ఇక్కడ ఎలాంటి ప్రమాదాలు జరిగినా వాహనాల నంబర్లను రికార్డు చేసే కెమెరా అత్యాదునిక సీసీటీవీ కెమెరాలతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు 5 బారికేడ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు కెమెరాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఈ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి బాదితులకు న్యాయం చేసే వీలు ఉంటుందని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరం అని నేరాలను నియంత్రించడంలో, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం అని ఇకపై ప్రతి వాహన



దారులు కూడా స్వతహాగా రోడ్డు భద్రత నియమ నిబంధనలను పాటిస్తూ అదేవిధముగా పరిమితి వేగమును మించకుండా ప్రయాణం చేస్తూ సురక్షితముగ గమ్యములకు చేరే విదముగా ప్రయాణించగలరు. ఇలా చేసినచో తనతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా చేసినవరము అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి తోపాటు, తూప్రాన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రంగ కృష్ణ, మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్ ఐటీసీ కంపెనీ హెచ్ఆర్ సూర్య భగవాన్, మనోహరాబాద్ పోలిస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనంతసాగర్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన



**కొండాపూర్, మార్చి 31 (జనం సాక్షి) :** వక్ఫ్ ఏమైన్‌మెంట్ బిల్లు పేరుతో కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా అన్యాయంగా పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు తీసుకువచ్చి జెపిసి కమిటీ పేరుతో డ్రామాలాడుతోందని ముస్లిం మత పెద్దలు ఆరోపించారు. సోమవారం రంజాన్ పండగ సందర్భంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ పిలుపు మేరకు కొండాపూర్ మండలంలోని అనంతసాగర్‌లోని సెంటర్‌లో ఈద్గాలో ప్రార్థనల అనంతరం నల్ల రిబ్బన్‌లు ధరించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు పేరుతో వక్ఫ్ ఆస్తులను కాజేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఇది హేయమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజి జడ్ పి కో ఆప్షన్ సభ్యుడు అమీనొద్దీన్, ముస్లిం పెద్దలు వహీద్, జలీల్, అజీమ్ పాష, మోహీన్, మహ మూద్, చాంద్ పాషా, ఆయాజ్ లున్నారు.

# అత్యాచార ఘటన దురదృష్టకరం

- విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలి
- మండల బిజెపి అధ్యక్షులు రాజేందర్ గౌడ్

**ఉర్కొండ, మార్చి 31 (జనం సాక్షి) :** మండలంలోని ఊరుకొండ పేట దేవాలయ దర్శనానికి వచ్చినటువంటి యువతిపై అఘాయిత్యం దురదృష్టకరమని ఈ విషయాన్ని బిజెపి పార్టీ పూర్తిగా ఖండిస్తుందని భారతీయ జనతా పార్టీ మండల పార్టీ అధ్యక్షులు రాజేందర్ గౌడ్ విచారణ వ్యక్తం చేశారు. ఈ అమానవీయ సంఘటనకు బాధ్యులను గుర్తించి నిష్పక్షపాతంగా ఎంతటి వారినైనా విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ బందోబస్తును ఏర్పాటు చేసి నిగాను కఠిన తరం చేయాల్సిందిగా భారతీయ లిజనతా పార్టీ కోరుచున్నదని ,ఆలయ పవిత్రతను కాపాడాలని ఆలయకమిటీ మౌలిక వసతులను కల్పించాలని వచ్చే



భక్తులకు తగిన రక్షణ ,సదుపాయాలను కల్పించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని, బాధితురాలికితగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పరశురాం, బ్రహ్మాచారి, ఉపాధ్యక్షులు శివ, కొమ్ము శ్రీను,లక్ష్మణ్ గౌడ్, మల్లేష్, గోపీ,కిట్టు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూలీ పనికి వెళ్లిన బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు



**బెజ్జంకి, మార్చి 31 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని లక్ష్మీపూర్ గ్రామంలో రైతు ముక్కిస విజయ బాలరెడ్డికి చెందిన మొక్కజొన్న కంకులు ఏరడానికి మండల మహిళా నాయకులు,కార్యకర్తలు ముఖమ్మడిగా స్వచ్ఛంద కూలీ పనికి వెళ్లారు. కూలి పని చేసి వచ్చిన డబ్బులతోనే ఏప్రిల్ 27న వరంగల్ లో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకి వెళ్తామని అన్నారు. కూలి పనికి వెళ్లిన ఆడబిడ్డలకు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండల బీఆర్ఎస్ మహిళా నాయకులు మరియు మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గద్వాల రాజుల కాలం నాటి కొత్త బావిని పునరుద్ధించాలి

- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేసిన
- మాజీ జెడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య

**గద్వాల్ రూరల్, మార్చి 31 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని పూర్వకాలం రాజుల కాలానికి చెందిన గద్వాల ఘన చరిత్రను తెలియజేసే నేటికి సజీవసాక్ష్యాలు అయిన మెట్ల బావులలో ఒకటి అయిన కొత్త బావి. బావుల యొక్క చరిత్రను ప్రత్యేక ప్రాధాన్యతను మన పూర్వీకులు ఇచ్చారు. అలాంటి అనావాలును చెరిపేసి వాటిని ఆక్రమించుకొని వాటి స్థానంలో గద్వాల పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించే ఉద్దేశ్యంతో తాత్కాలిక షెడ్లతో షాపులు ఏర్పాటుచేశారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన ఆదేశిక సూత్రలవరంగా ఆర్టికల్ 42 ప్రకారం జాతీయ ప్రాధాన్యత కలిగిన చారిత్ర కట్టడాలను రాజ్యం పరిరక్షించలని తాత్కాలిక షెడ్లను నిర్మించిన వాటినీ



తొలగించి కొత్త బావినీ పునరుదించాలని జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందచేసిన గద్వాల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య,మాజీ మున్సిపల్ చైర్మన్ బి ఎస్.కేశవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సంతో గాయపడ్డ రాములు

- చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 31 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలోని కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన నెల్లి రాములు (59) ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. 15 రోజుల క్రితం గాలివాన బీభత్సవానికి కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తా టీ జంక్షన్ (ఏడుపాయల రోడ్డుకు) సమీపంలో హర్షిత రెస్టారెంట్, ఆర్ఆర్ రెస్టారెంట్ తో పాటు చిరు వ్యాపారులకు చెందిన ఎన్నో రేకు డబ్బాలు విరిగిపోయి భారీ నష్టం వాటిల్లింది. పలువురు చిన్న వ్యాపారులు ఉపాధి కోల్పోయారు. అదేరోజు కొల్చారం మండలంలో 119 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పలు ట్రాన్స్ఫార్మర్లు కుప్పకూలిపోయాయి. ఇదే దుర్ఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపడి వెంకటాపూర్ గ్రామానికి చెందిన నెల్లి రాములు ఒక షాపు దగ్గర పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు స్తంభం కాళ్లపై పడింది. ఒక కాలు తీసివేయగా, ఇంకొక కాలుకు ఆపరేషన్ జరిగింది. అయినా తన విధిరాత బాగా సోమవారం చికిత్స పొందుతూ సుధీశ్వాస విడిచాడు. మృతుడికి భార్య ఇద్దరు కొడుకులు ఒక కూతురు ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన నెల్లి రాములు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ తాజా మాజీ సర్పంచ్ నెల్లికిష్టయ్య విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వపరంగా నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

# జిల్లాలో నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

- జిల్లా యస్పి పరితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 31 (జనం సాక్షి) :** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (ఏప్రిల్ 1వ తేది నుండి 30 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్పి పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కల్గించిన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి పనులు

**బెజ్జంకి, మార్చి 31 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు,జై భీమ్,జై సంవిధన్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా కరీంనగర్,మానకొండూర్ నియోజకవర్గల కో ఆర్డినేటర్ మాజీ పీసీసీ జనరల్ సెక్రటరీ నమిండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుండి ప్రతిరోజు మూడు గ్రామాలు పాదయాత్ర నిర్వహించాలని కార్యకర్తలు,నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి గ్రామంలో,ప్రతి ఇంటిలో తెలియజేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ



కార్యక్రమంలో బెజ్జంకి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,బెజ్జంకి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, సందీప్ కుమార్,చెప్యాల శ్రీనివాస్,లింగాల శ్రీనివాస్,శంకర్,శ్రీకాంత్, రాములు, మల్లేశం,పార్టీ నాయకులు గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిందితులు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదు

- బాధిత యువతికి న్యాయం చేస్తాం
- రాత్రిపూట బస చేసే భక్తులకు రక్షణ కల్పిస్తాం
- అత్యాచార ఘటనపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ

**ఉర్కొండ, మార్చి 31 (జనం సాక్షి) :** ఊర్కొండ మండలంలోని పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో జరిగిన సామూహిక అత్యాచార సంఘటనలో నిందితులు ఎవరైనా వదిలేది లేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారు ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ వారిని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీని కోరానని వెల్లడించారు. ఊర్కొండలోని ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో ఏడుగురు యువకులు ఒక వివాహిత పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటన పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌తో ఫోన్‌లో అనిరుద్ రెడ్డి మాట్లాడారని, పవిత్ర ప్రదేశంలో ఈ దురాగతానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అత్యాచారానికి పాల్పడిన వారు బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారని తన దృష్టికి వచ్చిందని అయితే ఈ సంఘటనకు పాల్పడింది ఎవరైనాప్పటికీ తాను రాజకీయాలు చేయదలుచుకోలేదని బాధిత యువతికి న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. ఈ



సంఘటనలో బాధిత యువతికి అండగా ఉంటానని అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సంఘటన నేపథ్యంలోని ఊర్కొండ పోలీసులతో కూడా మాట్లాడి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చి రాత్రి పూట బస చేసే భక్తులకు రక్షణ కల్పించాలని కోరారు. గ్రామంలోనీ యువతులు కూడా జరిగిన సంఘటన పట్ల భయాందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కూడా అనిరుధ్ రెడ్డి ఆదేశించారు.

# అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులు రిమాండ్

- స్కూటీ, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించినజిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 31 (జనం సాక్షి) :** అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. బాదితురాలు ఈ నెల 24న సొంత పనిమీద సంగారెడ్డి పట్టణానికి వెల్లి తిరిగి 25న ఆటోలో ఇంటికి వెళ్లుతుండగా సమయం అందాజ 01:00 గంటల సమయంలో సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గల కంది మండలం మామిడిపల్లి చౌరస్తా వద్ద ఫిర్యాది భర్త మూత్ర విసర్జనకై ఆటోను ఆపగా, అదే సమయంలో తెలుపు రంగు గల స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు, ఫిర్యాది భర్తను కొట్టి, బాదితురాలిని స్కూటీపై నాందేడ్ హైవే పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు గుండా నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకొని వెళ్లినట్లు తెలిపారు. అనంతరం ఇద్దరు వ్యక్తులు ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశారని, సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. దారుణానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను 31 సోమవారం ఉదయం 7 గంటలకు వారి ఇంటివద్ద




అదుపులోనికి తీసుకోవడం జరిగిందన్నారు. నేరానికి వినియోగించిన స్కూటీ, 2-సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని, రిమాండుకు తరలించడం జరుగుతుందని ఎస్పీ వివరించారు. సంగారెడ్డి జిల్లా ప్రజలకు విజ్ఞప్తి మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో మీ చుట్టూ ఎవరైయన అనుమానస్పదంగా కనిపించిన వెంటనే 100 డైల్ చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# చిరు వ్యాపారులకు అనువుగా ఉండేలా నిర్మాణాలు

**రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు టెండర్ పూర్తి**

**ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 31 (జనంసాక్షి)**

ప్రజలు,చిరు వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా వేములవాడలో వీధి విక్రయ మార్కెట్ జోన్ నిర్మాణాలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడలో రూ 80 లక్షలతో నిర్మించనున్న వీధి విక్రయ మార్కెట్ జోన్ పనులకు, రూ 56 లక్షల 50 వేలతో 11,12 వార్డుల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు,సీసీ డ్రైనేజీలు నిర్మాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్,



కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ వేములవాడలో ప్రజలకు అందుబాటులోకి రెండవ బైపాస్ రోడ్డులో కూరగాయల మార్కెట్లో రూ 80 లక్షలతో 68 కూరగాయల స్టాల్స్ నిర్మిస్తున్నామన్నారు. కలెక్టర్ చొరవతో ప్రజలు, మార్కెట్లో కూరగాయలు విక్రయిస్తున్న వారి కోరిక మేరకు నూతన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఎండాకాలం, వర్షాకాలం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హైదరాబాద్ లాంటి పట్టణాల్లో ఉన్న విధంగా స్టాల్స్ నిర్మిస్తున్నామని విప్ తెలిపారు. వేములవాడలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాన్ని తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ప్రజల అవసరాలకు అనుగుణంగా దుకాణాల సముదాయాలు, మార్కెట్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతు ందన్నారు. రూ. 56 లక్షలతో సీసీ రోడ్లు సైడ్ డ్రైన్ ల నిర్మాణం చేపట్టామన్నారు. వేములవాడలో ఉన్న 28 వార్డుల్లో ప్రతి వార్డులో రూ 10 లక్షలతో కనీస అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనులను చేపడతామన్నారు. భూసేకరణకు రూ6 కోట్ల నిధులు వేములవాడ పట్టణ ప్రజలతోపాటు రాజన్న భక్తులు సుదీర్ఘంగా ఎదురుచూస్తున్న మూడో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.



**రూ 47 కోట్లతో రోడ్డు వెడల్పు**

చేయబోతున్నామన్నారు. రూ 76 కోట్లతో రాజన్న ఆలయ విస్తీర్ణకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది.. త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని,రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. వేములవాడలో నూతన ఆధ్యాత్మిక శోభను తీసుకురావడానికి కృషి చేస్తున్నానని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రులు పోన్నం ప్రభాకర్ శ్రీధర్ బాబు, అలాగే జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో మన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. నిర్వాసితులకు ఏలాంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వేములవాడలో జంక్షన్ అభివృద్ధికి కృషి చేస్తానని,అంబేద్కర్ చౌరస్తా వద్ద కొత్త శోభ సంతరించుకునేలా నూతన పార్క్ నిర్మాణం చేపట్టామన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని త్వరలోనే ఆవిష్కరించబోతు న్నామన్నారు. ఈ కార్యక్రమలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, పట్టణ సేస్ డైరెక్టర్ నామాల ఉమ లక్ష్మిరాజాం, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్,స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.



## కరీంనగర్ రంజాన్ వేడుకల్లో మంత్రి పొన్నం

**కరీంనగర్ బ్యూరో, మార్చి 31 (జనంసాక్షి)**

రంజాన్ పండగ సందర్భంగా కరీంనగర్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. కరీంనగర్ లో వారి స్నేహితులు సయ్యద్ షా ఖాజా మొహినుద్దీన్ ఖాద్రి , షాస మొల్ల నివాసానికి వెళ్ళి ఉత్సాహంగా గడిపారు. వారికి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ అహ్మద్ అలీ ఇంటికి వెళ్లి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ ఏ మోసిన్ నివాసానికి వెళ్ళారు. వారి కుటుంబ సభ్యులకు స్వీట్స్ తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## కరీంనగర్ నగర ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చండి ఎమ్మెల్యే గంగుల



**కరీంనగర్ బ్యూరో, మార్చి 31 (జనంసాక్షి)**

రాబోవు 3 నెలల్లో కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉన్నందున పరిష్కారం చూపాలని సోమవారం రోజు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలసి లోయర్ మానేరు డ్యామ్ ను సందర్శించిన మాజీ మంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్. ఈ సందర్భంగా డ్యామ్ కు చేరుకున్న ఎమ్మెల్యే మొదటగా డ్యామ్ లోని నీటిమట్టాన్ని పరిశీలించి, అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. సోమవారం రోజు బిఆర్ఎస్ పార్టీ పక్షాన కరీంనగర్ నగరానికి తాగునీటిని సరఫరా చేసే ఎల్ ఎండిని సందర్శించడం జరిగిందని, ఈ ఎల్ ఎండి ద్వారా కరీంనగర్ నగరానికి త్రాగునీటి సరఫరాతో పాటు, దిగువ ప్రాంతమైన సూర్యాపేట వరకు తాగునీరు, సాగునీరు అందిస్తుందన్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ త్రాగునీరుపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్ రావు, వాల రమణారావు, మేచినేని అశోక్ రావు, బోనాల శ్రీకాంత్, ఐలేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దారి వదలకుంటే ఊరుకునేది లేదు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 31 (జనం సాక్షి)**



కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు రామేశ్వరపల్లి గ్రామ శివారు సర్వేనెంబర్ 85లో నిర్మల సొసైటీ ఆఫ్ ది ఫ్రాన్స్ సిస్టర్ జీవధాన్ కాన్వెంట్ వారు నిర్మిస్తున్న భూమిలో ప్రహరీ గోడ విషయంలో రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన రైతులు,రామేశ్వర పల్లి తాండ రైతులు పంట పొలాలకు వెళ్లే దారిలో ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని అడ్డుకుంటున్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా 15 పిట్ల రోడ్డు ఉందని, మేము పంట పొలాలకు వెళ్లాలంటే ప్రహరీ గోడ నిర్మించి మా పంట పొలాల వద్దకు వెళ్ళనివ్వకుండా ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని రామేశ్వరపల్లి తండా ప్రజలు, రామేశ్వర్ పల్లి గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. పంట పొలాలకు రైతులు వెళ్లే రోడ్డుపైన ప్రహరి గోడ నిర్మిస్తున్నారని రామేశ్వరపల్లి, తండా ప్రజలు జెసిబితో రోడ్డుపై ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని, తొలగించే ప్రయత్నం చేశారు, అట్టి విషయం దేవునిపల్లి పోలీసులకు తెలియడంతో వెంటనే దేవుని పల్లి పోలీసులు వచ్చి రైతులకు సర్ది చెప్పి ఏదైనా ఉంటే ఇరువర్గాల వారిని పిలిపించి మాట్లాడించేంతవరకు ప్రహరీ గోడ నిర్మించనీయ కుండా బాధ్యత తీసుకుంటామని చెప్పడంతో రైతులు అక్కడనుండి వెళ్లిపోయారు, రైతులకు అన్యాయం జరుగుతే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదని , నిర్మల సొసైటీ ఆఫ్ ది ఫ్రాన్స్ సిస్టర్స్ జీవదన్ కాన్వెంట్ వారు ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని రామేశ్వరపల్లి, తండా ప్రజలు 15 పీట్ల రోడ్డు చూపించిన తర్వాతే పనులు చేయాలని అప్పటివరకు ప్రహరీ గోడ నిర్మించవద్దని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇట్టి విషయం పైన జిల్లా అధికారులు పోలీసులు కూడా రైతులకు అండగా ఉండాలని కోరారు.



# నాణ్యమైన నర్సింగ్ విద్య అందించటమే లక్ష్యం



**నూతన నర్సింగ్ కళాశాల బిల్డింగ్ ను ప్రారంభించిన సింగరేణి సిఎండి ఎన్. బలరామ్, ఐఆర్ఎస్**

**( ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)**

సింగరేణి మెయిన్ హాస్పిటల్ నందు నూతనముగా నిర్మించిన సింగరేణి నర్సింగ్ కళాశాల భవనాన్ని సోమవారం సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ఎన్. బలరామ్, ఐఆర్ఎస్ పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. సిఎంఓ పి.సుజాత అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ఎన్. బలరామ్, ఐఆర్ఎస్ అని, విశిష్ట అతిధులుగా డైరక్టర్(ఈ,ఎం) డి.సత్యనారాయణ రావు, డైరక్టర్(పి,పి), పా కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, గుర్తింపు సంఘం(ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్, కార్పొరేట్ సిఎంఓ ఏఐ ప్రెసిడెంట్ సిహెచ్. వెంకటాచారి లు హాజరైనారు. ఎన్. బలరామ్ మాట్లాడుతూ సింగరేణి మెయిన్ హాస్పిటల్ నందు నూతనముగా 3.46 కోట్ల వ్యయంతో అత్యదునికముగా నిర్మించిన సింగరేణి నర్సింగ్ కళాశాల బిల్డింగ్ ను ప్రారంభించుకోవటం చాలా సంతోషకరం అని తెలిపారు. ప్రస్తుతం ఉన్న జిఎన్ఎం నర్సింగ్ కోర్సు తో పాటు బిఎస్సి నర్సింగ్ కోర్సు ను కూడా ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తామని, సింగరేణి ఉద్యోగుల పిల్లలతో పాటు ఇతర ఏరియాల పిల్లలకు కూడా నాణ్యమైన నర్సింగ్ విద్యను అందించటమే మన లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ పి.సుజాత, జిఎం(పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్పిఎం కవితా నాయుడు, జిఎం(సివిల్) టి.సూర్యనారాయణ, జిఎం(సెంట్రల్ వర్క్ షాప్) ఎన్.దామోదర రావు, జిఎం(సేఫ్టీ) సిహెచ్.శ్రీనివాస్, జిఎం(సెక్యూరిటీ) సిహెచ్. లక్ష్మీనారాయణ, ఏసిఎంఓ ఎం.ఉష, ఏజిఎం (ఈ,ఎం) మెయిన్ వర్క్ షాప్
పి.రాజీవ్ కుమార్, డివై.సిఎంఓ జి.సునీల, డిజిఎం(సివిల్) పి.రాజశేఖర్, డాక్టర్ మాలతి, నర్సింగ్ సూపరింటెండ్ మేట్రన్ మిస్ శాలి, నర్సింగ్ కాలేజీ సిబ్బంది రేణుక తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ మాసంలాగానే ఏడాది మొత్తం నిష్టగా ఉండాలి

**జామియా నిజామీయా ఆలిమ్ హాఫీజ్ షాకీర్ సిద్దిఖీ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, మార్చి 31(జనంసాక్షి):**

పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంత నిష్టగా ఉన్నారో మిగతా 11 మాసాలు కూడా అంతే నిష్టగా మెలగాలని జామియా నిజామీయా ఆలిమ్ హాఫీజ్ షాకీర్ సిద్దిఖీ అన్నారు. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డు నగల ఈద్గాలో ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా షాకీర్ సిద్ధికి మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు నిష్టతో రోజా ఉండడమే కాకుండా తమ ఆస్తిలో ఉన్న దాని విలువ ఆధారంగా జకాత్ ద్వారా పేదలకు దానం చేయడం వంటి పనులను నిష్టతో చేశారన్నారు. అబద్ధాలు ఆడకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మస్జిద్లలో ప్రత్యేక నమాజులను చదువుతూ నిష్టగా మెలగడం జరిగిందన్నారు. హాఫీజ్ మహబూబ్ అలీ మాట్లాడుతూ ముస్లింలు నిష్టగా ఉంటూ ఇస్లాం ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక నమాజును జామా మస్జీద్ షాహి ఇమామ్ అబ్దుల్ హక్ తనయుడు హాఫీస్ మొహమ్మద్ అన్వారుల్ హక్ చదివించారు. వక్ఫ్ కాంప్లెక్స్ కమిటీ







కార్యదర్శి అబ్దుల్లాఖాన్ ఈద్గా వద్ద ఏర్పాట్లు చేసిన మునిసిపాలిటీ అధికారులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శశిధర్ రెడ్డి, బీఎస్పీ నాయకులు కొత్తపల్లి కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ కూచకుల దామోదర్ రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ నాగం జనార్ధన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డిలకు కూడా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీపురం రోడ్డున గల ఈద్గాలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులకు, ముస్లిం సంఘాలు మస్జిద్ కమిటీలు కృతజ్ఞతలు తెలిపాయి. నాగర్ కర్నూల్ లోని ఈద్గా వద్ద ముస్లింలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్ల రాజేష్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్తపల్లి కుమార్ ఆధ్వర్యంలో పండగ శుభాకాంక్షలు తెలిపారు. డి.ఎస్.పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నాగోల్ నుంచి మెట్రో కొత్త టైమింగ్స్

**ఉప్పల్ మార్చి 31 ( జనం సాక్షి):**



నాగోల్ నుంచి రాయదుర్గం గ్రీన్ లైన్ వైపు వెళ్లే మెట్రో రైలు సమయ పాలనలో ఏప్రిల్ ఒకటి నుంచి మార్పులు ఉంటాయని మెట్రో బృందం తెలిపింది. నాగోల్ టెర్మినల్ నుంచి ప్రతి సోమవారం నుంచి శనివారం వరకు మొదటి సర్వీస్ ఉదయం 6 గంటలకు, ఆదివారం 7 గంటలకు ఉంటుందని తెలిపారు. లాస్ట్ సర్వీస్ సోమవారం నుంచి శుక్రవారం వరకు రాత్రి 11:45, శని ఆదివారాల్లో రాత్రి 11 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు.

## నేషనల్ హైవేపై చిరుధాన్యాల వాహనం బోల్తా

**శంషాబాద్, మార్చి 31 (జనంసాక్షి )**



చిరుధాన్యాల లోడుతో శంషాబాద్ హైవే నుంచి సోమవారం బేగంబజార్ వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనన్ని డ్రైవర్ రాఘవేందర్ నిర్లక్ష్యం అతివేగంతో నడిపిస్తు గగన్ పహడ్ దగ్గర అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. రోడ్డుకు అడ్డంగా చిరుధాన్యాలు పల్లీలు పుట్నాలు బఠానీలు పడిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. లోడింగ్ చేసుకొని శంషాబాద్ నుంచి నుంచి బేగం బజార్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలోన గగన్ పహడ్ లో రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో కిలోమీటర్ పొడువునా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్ సిఐ రాజు తమ సిబ్బందితో ట్రాఫిక్ ని క్లియర్ చేయడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
01 ఏప్రిల్ 2025

# పరువు కాదు..కుట్రపూరిత హత్య

- సాయి కుమార్ హంతకులను కఠినంగా శిక్షించాలి
- కేసు విచారణకి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి
- మృతుని కుటుంబానికి రూ. కోటి ఎక్స్ గ్రేషియో చెల్లించాలి
- పౌరహక్కుల ప్రజా సంఘాల డిమాండ్



**పెద్దపల్లి మార్చి 31 (జనం సాక్షి) :** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో మార్చి 27 న ప్రేమ పేరుతో హత్య కాబడ్డ పూరెళ్ళ సాయి కుమార్ ది పరువు హత్య కాదని, కుట్రపూరితంగా చేసిన హత్యేనని పౌరహక్కుల, విప్లవ రచయితల సంఘం, తెలంగాణ ప్రజా ఫ్రంట్, దళిత లిబరేషన్ ఫ్రంట్ నాయకులు అన్నారు. హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించిన అనంతరం మృతుని కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించారు. అనంతరం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ ముప్పిరితోట గౌడ కులంకు చెందిన పూరెళ్ల పరుశరాములు-జ్యోత్స్నల కొడుకు సాయి కుమార్ పదవ తరగతి పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, అదే గ్రామం ముదిరాజ్ కులానికి చెందిన ముత్యం సమత-సదయ్యల కూతురు గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారని నిజనిర్ధారణ తేలిందని వివరించారు. ఈ ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాల సభ్యులకు, గ్రామస్తులకు ముందే తెలుసున్నారు. అమ్మాయి చదువు పూర్తయిన తర్వాత పెళ్లిచేసుకుందాం అని అనుకుంటున్న క్రమంలో ప్రేమ వ్యవహారం, పెళ్లి ఇష్టం లేని అమ్మాయి తల్లిదండ్రులు ముత్యం సదయ్య, సమత, రంగాపూర్ గ్రామానికి చెందిన అమ్మాయి మేన మామ సిద్ద సారయ్య, అదే గ్రామానికి చెందిన చీకటి మల్లయ్య అతని కొడుకు చీకటి హరీష్ ల ప్రోద్భలంతో హత్యకు కుట్రాపన్నారని పేర్కొన్నారు. స్నేహితులతో కలిసి తన పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న సాయి కుమార్ ను విచక్షణ రహితంగా గొడ్డలితో నరికి చంపారని తమ విచారణలో తేలిందన్నారు. గతంలో రెండుసార్లు సాయికుమార్ పై దాడి జరిగినా పోలీసులు స్పందించలేదని, హరీష్ కు తన కూతరును ఇచ్చి పెళ్లి జరిపించాలని కుట్రతో సాయి కుమార్ ను చంపారని ఇది ముమ్మాటికీ పరువు హత్య కాదన్నారు. ప్రేమ పేరుతో జరిగిన ఈ హత్యను పౌరహక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘం, తెలంగాణ ప్రజా ఫ్రంట్, దళిత లిబరేషన్ ఫ్రంట్ లుగా ప్రజా సంఘాలుగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అమ్మాయి తల్లిదండ్రులు ముత్యం సదయ్య - సమత, మేనమామ సిద్ద సారయ్య, చీకటి మల్లయ్య, హరీష్ లలో ముగ్గురిని మాత్రమే అరెస్ట్ చేసారని కీలక వ్యక్తులు చీకటి మల్లయ్య, హరీష్ లను ఇంత వరకు అరెస్ట్ చేయలేదని వారు ఆరోపించారు. సమాజంలో ప్రేమ, కులం, మతం పేరుతో జరిగే పరువు హత్యలు, దాడుల నివారణకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు, యువత, విద్యార్థులలో మార్పు తీసుకురావడం కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయి వరకు ప్రజలు, ఉన్నతాధికారులు పోలీసులు, ప్రజాసంఘాలతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ఈ సమస్యలపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికార, ప్రతి పక్ష పార్టీలు ఈ ఘటనలకు భాద్యత వహించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముప్పిరితోట ఘటనపై సమగ్ర విచారణ జరిపించి హంతకులను కఠినంగా శిక్షించాలని, మిగితా ఇద్దరినీ వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కేసు విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేయాలని, సాయి కుమార్ కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీపతి రాజగోపాల్, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, పౌరహక్కుల సంఘం నాయకులు బొంకూరి లక్ష్మణ్, ఎన్. సత్యనారాయణ, పుట్ట రాజన్న, రెడ్డిరాజుల సంపత్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారం అందుకున్న పుల్లూరి నాగేశ్వర్



**కాటారం మార్చి 31 (జనం సాక్షి) :** సంగీత సాహిత్య ఆధ్యాత్మిక రంగంలో పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న పుల్లూరు నాగేశ్వర్ రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. కాటారం వాసి కవి, రచయిత గాయకులు కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఇంస్ట్రక్టర్ (శిక్షకులు )గా పనిచేస్తున్న పుల్లూరి నాగేశ్వర్ శ్రీ విశ్వావస నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని భూపాలపల్లికి చెందిన వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని పుష్ప గ్రాండ్ లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు గాను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఉగాది పురస్కారం -2025 ఈ సత్ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఆర్ విద్యాసంస్థలు అధినేత నాయినేని సంపత్ రావు, చలనచిత్ర హాస్య నటుడు ఆర్ ఎస్ నందా వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ కవి రచయిత తెలుగు అధ్యాపకులు కొలుగూరి సంజీవరావు లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని పురస్కారం అందించిన నిర్వాహకులకు నాగేశ్వర్ హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

## మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసీ అందజేత



**శ్రీరంగాపూర్, మార్చి 31 (జనం సాక్షి) :** శ్రీరంగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కే రంగస్వామి అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. అతని కి మెరుగైన వైద్యం కోసం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రెండు లక్షల ఎల్ఓసి కాంగ్రెస్ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్, గ్రామ వైస్ ప్రెసిడెంట్ రామరాజు, మాజీ వార్డ్ మెంబర్ మద్దిలేటి కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ , వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుల ఆదాయ దృపత్రాలు వెంటనే మంజూరు చేయాలి

- దరఖాస్తు ఫారాలు ప్రజా పాలన కేంద్రాలలో సమర్పించాలి
- జిల్లా అధికారులతో కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్ష



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 31 (జనం సాక్షి) :** రాజీవ్ యువ వికాసానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తు చేసుకునే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. రాజీవ్ వికాసం పథకంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ ఇతర వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో అత్యధిక సంఖ్యలో నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకునేలా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కుల ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే రెవెన్యూ అధికారులు కుల ఆదాయ ధ్రువపత్రాలు మంజూరు చేయాలన్నారు. రూ 50 వేల లోపు రుణం తీసుకున్న వారికి 100 శాంతం రాయితీ , రూ లక్ష లోపు రుణం తీసుకున్న వారికి 90 శాతం రాయితీ, రెండు లక్షల వరకు రుణం తీసుకున్న వారికి 80శాంతం రాయితీ 2 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు రుణం తీసుకున్న వారికి 70శాంతం రాయితీ లభిస్తుందని ఈ విషయంపై దరఖాస్తుదారులకు మండల స్థాయి అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ పథకం ఒక కుటుంబంలో ఒక వ్యక్తికి మాత్రమే వర్తిస్తుంది అన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ పథకం రూ.రెండు లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారందరూ అర్హులన్నారు. రేషన్ కార్డు ఆధార్ కార్డు కుల ఆదాయ ధ్రువపత్రాలతో దరఖాస్తుదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని మండల పరిషత్ కార్యాలయాల లో, మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ప్రజాపాలన కేంద్రాలలో తమ దరఖాస్తుల సంబంధిత పత్రాల కాపీలను అందజేయాలని కలెక్టర్ సూచించారులి రెవెన్యూ అధికారుల వద్ద పెండింగ్ ఉన్న కుల ,ఆదాయ ధ్రువపత్రాలను వెంటనే అందజేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి,జిల్లా ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సమర్థవంతంగా రాజీవ్ యువ వికాసం అమలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 31 (జనం సాక్షి) :** యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆర్థికసాయం అందించడానికి ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసే దిశగా ముందుకు పోతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జిల్లాలోని హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలోని మీసేవ సెంటర్లో రాజీవ్ యువ వికాసం పోర్టల్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సోమవారం పరిశీలించారు. స్వయంగా దరఖాస్తులు ఆన్లైన్లో నమోదు చేసుకునే విధానాన్ని నిర్వాహకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీలు యువతి, యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పథకానికి సంబంధించి ఇప్పటివరకు హవేలీ ఘనపూర్ మండలంలో 68 దరఖాస్తు స్వీకరించడం జరిగిందని ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కింద సొంత వ్యాపారాల స్థాపనకు ప్రభుత్వం రాయితీ అందించనుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించి వ్యాపారాల్లో రాణించేందుకు రాయితీని పొందవచ్చుని తెలిపారు. రాజీవ్ యువ వికాస పథకంలో సుమారు 75 రకాల యూనిట్ల ఏర్పాట్లుకు పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా డిఆర్డీవో ఉంటారని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన యువతి యువకులు వెబ్సైట్ అధికారిక https://tgobmms.gg.gov.in ఆన్లైన్ దరఖాస్తు చేయాలని, ప్రింట్ తీసిన దరఖాస్తును ఎంపిడిఓ, మున్సిపల్ పరిధిలో. మున్సిపల్ కమిషనర్ కు అందచేయాలని తెలిపారు. జిల్లాకు చెంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారై, పరిమిత ఆదాయ వనరుల గల బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ యువత రేషన్, పాన్ కార్డు ఫోన్ నెంబర్, ఫొటో, ఆధార్ కార్డ్, కుల, ఆదాయ, ధ్రువీ కరణ పత్రాలను దరఖాస్తులో నమోదు చేయాలన్నారు. దరఖాస్తులు స్వీకరణకు ఆఖరు తేదీ 5.04.2025 వరకు ఉందని అన్నారు. కలెక్టర్ మీసేవ సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకునూరులో రుద్ర సహిత శత చండీ యాగం



**చేర్యాల, మార్చి 31 (జనంసాక్షి) :** చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని భవానీ రుద్రేశ్వర ఆలయంలో లోక కల్యాణం కోసం రుద్ర సహిత శత చండీ యాగం, మహా శత చండీయాగం కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో జాక్ చైర్మన్ చక్రదారి మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో సస్యశ్యామలం కావాలని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలనే మంచి ఉద్దేశంతో ఈ యాగం ప్రారంభించారు. ఏప్రిల్ 26 నుంచి 30 వరకు యాగం నిర్వహించలని వేద పండితులు నిర్ణయం తీసుకున్నారని ఆయన చెప్పారు. ఈ యాగం భైరవబట్ల కుటుంబ సభ్యులు, నాగిళ్ల శ్రీరామ శర్మ హరికృష్ణ కుటుంబ సభ్యులు భైరవభట్ల చక్రధరి ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ సుంకరి, ఏక నంద%శీ%, వెలుగల రఘువీర్,పాల బాలరాజు, బోయిని రాజు, పల్లె కనకయ్య, పోరండ్ల వెంకటేష్, అందే నాని బాబు, తాటికొండ యాదయ్య, తోకల ఉమారాణి, తాటికొండ రాములు, మంతపురి నరసయ్య, శిగుళ్ల బాలరాజు, మెంటే ఉపేందర్, పల్లె కృష్ణ, భూమని బాలరాజు, హౌసుల శేఖర్, బీర రాములు, సందెబోయిన వెంకటేష్, గ్రామ ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజుకు టీడబ్ల్యూజేఎఫ్ సన్మానం

- రాజ్యసభలో జర్నలిస్టుల రైల్వేపాస్‌లపై స్పందించినందుకు కృతజ్ఞతలు



**ఖమ్మం, మార్చి 31 (జనంసాక్షి) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిని పార్లమెంటులో ప్రస్తావించినందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఖమ్మంలోని ఎంపీ స్వగృహంలో సోమవారం ఆయన్ను కలిసి కృతజ్ఞత పూర్వకంగా శాలువా కప్పి సన్మానించారు. రాజ్యసభలో ప్రస్తావించడంతో పాటు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం అందజేయటంపై ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల విషయంలో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. తన విజ్ఞప్తి పై రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇప్పటికే రైల్వే టికెట్లలో ప్రజలందరికీ భారీ రాయితీలు ఉన్నాయని రైల్వే మంత్రి ప్రస్తావించినట్లు చెప్పారు. అయినా ఆ ఉన్న టికెట్లపై జర్నలిస్టులకు ఇచ్చిన రాయితీని పునరుద్ధరించాల్సిందేనని తాను కోరినట్లు ఎంపీ తెలిపారు. అవసరమైతే ఈ విషయంలో మిగతా ఎంపీలతో కలసి సమస్య పరిష్కారం అయ్యేవరకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా 25 వేల మందికి పైగా జర్నలిస్టులు, దేశవ్యాప్తంగా లక్షల్లో ఉన్న జర్నలిస్టులు ఈ రైల్వే రాయితీని కోవిడ్ అప్పటి నుంచి కోల్పోతున్నారని తాను రాజ్యసభలో టీడబ్ల్యూజేఎఫ్ ఇచ్చిన వినతినే ప్రస్తావించానని, రైల్వే పాస్ లను పునరుద్ధరించాల్సిందేనని కోరినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చినందుకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీని ఎంపీ అభినందించారు. ఎంపీని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, వెగినాటి మాధవరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దుబ్బాకుల శ్రీను, కానంగి భిక్షం తదితరులు ఉన్నారు.

## విపత్తు ప్రతిస్పందనను బలోపేతం చేయడంలో ఆపదమిత్ర దోహదం

- అదనపు కలెక్టర్ నగేష్




**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 31 (జనం సాక్షి) :** యువ ఆపదమిత్ర పథకం రాష్ట్రంలో విపత్తు ప్రతిస్పందనను బలోపేతం చేయడంలో దోహదపడుతుందని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలో టీఎన్జీవో కార్యాలయంలో200) మంది వాలంటీర్లకు 20-03-2025 నుండి 31-03-2025 వరకు 12 రోజుల పాటు శిక్షణ ముగింపు సమావేశానికి సోమవారం అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ ముగింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఆధ్వర్యంలోజిల్లా కలెక్టర్ గారి ఆదేశానుసారం కేంద్ర ప్రభుత్వ పథకం అయినటువంటి ఆపద మిత్ర పథకంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణలో భాగంగా ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు అనగా వరదలు, భూకంపాలు, సునామీలు మరియు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎలా ఎదురుకోవాలి మరియు వాటి నుండి ప్రజల ప్రాణాలను మరియు వారి యొక్క ఆస్తులను ఎలా కాపాడాలి అనే వాటి పైన పూర్తిగా అవగాహన పొందారన్నారు. ఈ శిక్షణ కోసం 200 మంది వాలంటీర్లను రెండు బ్యాచ్ లుగా ఏర్పాటు చేసి టీఎన్జీవో భవన్, ప్రభుత్వ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో గల సెమినార్ హాల్లో శిక్షణను ఇవ్వడం జరిగింది. శిక్షణ సమయంలో వాలంటీర్లకు ఉచితంగా బోజన సదుపాయం, వసతి సదుపాయం ఏర్పాటు చేయడమైనది అని తెలిపారు. ఈ శిక్షణలో అగ్నిమాపక శాఖ, పోలీస్ శాఖ, మత్స్య శాఖ, ఇరిగేషన్, మెప్మా శాఖలకు చెందిన ఉద్యోగులు, ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు, మహిళా సంఘాల వారు మరియు యువతీ యువకులు ఈ శిక్షణలో వాలంటీర్లుగా శిక్షణ పొందాలని వివరించారు. శిక్షణ పూర్తి చేసిన ఆపద మిత్ర వాలంటీర్లకు అదనపు కలెక్టర్ నగేష్ సర్టిఫికేట్ అందించినారు. ఈ కార్యక్రమమలో ఆపద మిత్ర రాష్ట్ర నోడల్ అధికారి గౌతం, జిల్లా యువజన మరిఒయు క్రీడల అధికారి దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లా మతసామరస్యానికి పెట్టింది పేరు

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ బ్యూరో, మార్చి 31 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మతసామరస్యానికి పెట్టింది పేరని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.రంజాన్ పండుగ సందర్భంగా ఆయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని మునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గాలో పవిత్ర రంజాన్ సందర్భంగా ప్రార్థనలు జరిపిన ముస్లింలతో కిలిసిన అనంతరం జిల్లాలోని ముస్లిం ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో ముస్లింల పాత్ర మరువలేనిదనిఅన్నారు.దేశాభివృద్ధికి ఎంతోమంది ముస్లింలు కృషి చేశారని,అందులో అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా,సైంటిస్ట్ గా చేసిన సేవలు మరువలేనివని అన్నారు.నల్గొండ జిల్లా మతసామరస్యానికి పేరని, హిందూ ముస్లింలు అందరూ కలిసి నల్గొండ పట్టణాన్ని అభివృద్ధి చేసుకొనేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. నల్గొండలో శాంతిభద్రతలు బాగుండాలని, హిందూ, ముస్లింలు అందరూ కలిసిమెలిసి ఉండాలని అన్నారు.నల్గొండ పట్టణంలోని దర్గాలు ఈద్గాల అభివృద్ధికి తాను గత 25 సంవత్సరాల నుండి కృషి చేస్తున్నానని తెలిపారు.ఇక్కడి ఈద్గా తెలంగాణలోనే అతిపెద్ద ఈద్గా అన్నారు.ఇటీవల నల్గొండలో నిర్వహించిన ఇస్తేమాలో సుమారు 40,50 వేల మంది పాల్గొన్నా ఎలాంటి సమస్య లేకుండా తాగునీరు,అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.ముఖ్యంగా లతీఫ్ సాబ్ దర్గాకు ప్రతి సంవత్సరం నిర్వహించే ఉర్సు,ఇతర ఉత్సవాల సందర్భంగా లక్షల మంది వస్తారని, పెద్దవారు,ముసలివారు గుట్ట ఎక్కలేరని,దీన్ని దృష్టిలో ఉంచుకొని లతీఫ్ సాబ్ దర్గాకు100 కోట్ల రూపాయలతో ఘాట్ రోడ్ నిర్మిస్తున్నామని,టెండర్లు పూర్తయ్యాయని,త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.లతీఫ్ షాప్ గుట్ట నుండి బ్రహ్మంగారి గుట్ట వరకు రోప్ వే నిర్మిస్తున్నామని,బ్రహ్మంగారి గుట్టకు కూడా వేరే ఘాట్ రోడ్ వేయిస్తున్నామని, 500 కోట్లతో కొత్త బైపాస్ రోడ్ టెండర్లు వేయడం జరిగిందని, వారం రోజుల్లో పనులు మొదలవుతున్నాయన్నారు. నల్గొండలో ముస్లింల సంక్షేమం, అభివృద్ధిలో భాగంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, కలెక్టరేట్ తదితర ప్రభుత్వ సంస్థలలో ఔట్సోర్సింగ్,కాంటాక్ట్ పద్ధతిపై అర్హులైన ముస్లిం అభ్యర్థులను నింపేందుకు10 శాతం రిజర్వేషన్ కల్పించేలా జిల్లా కలెక్టర్ కు ఇదివరకే ఆదేశించడం జరిగిందని ఆయన వెల్లడించారు. దీంతోపాటు పేద ముస్లింలకు ఇండ్లు కట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామని,నల్గొండ పట్టణం సమీపంలో పేదవారికి ఇండ్ల నిర్మాణానికి భూమిని గుర్తించడం జరిగిందని,ప్లాట్లు లేని వారికి ప్లాట్లు ఇచ్చి ఐదు లక్షల రూపాయలతో ఇల్లు కట్టిస్తామని, ప్లాట్లు ఉంటే నేరుగా ఇల్లు కట్టించడం జరుగుతుందని ఆయన చెప్పారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ జిల్లాలో హిందూ,ముస్లింలందరూ సోదర భావం తో ఉండాలని కోరుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,గుమ్ముల మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.




# వడివడిగా దూసుకెళ్తున్న బంగారం..

## మళ్లీ భారీగా.. కొత్త మార్క్‌కు..

**జనంసాక్షి:**దేశంలో బంగారం ధరలు ఆగకుండా దూసుకెళ్తున్నాయి. గత ఐదు రోజులుగా వరుసగా పెరుగుతూ పోతున్న పసిడి ధరలు నేడు మళ్లీ భారీగా ఎగిసి కొత్త మార్క్‌ను తాకాయి.దీంతో కొనుగోలుదారులకు మరింత నిరుత్సాహం తప్పలేదు. బంగారం ధరలు ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, నగల మార్కెట్‌లతో సహా అనేక అంతర్జాతీయ కారకాలపై ఆధారపడి ఉంటాయి. నేటి బంగారం ధరలు ఏయే ప్రాంతాల్లో ఎలా ఉన్నాయనేది ఈ కథనంలో తెలుసుకుందాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 84,250 వద్ద, 24 క్యారెట్ల పసిడి రేటు రూ. 91,910 వద్ద ఉన్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు ఏకంగా రూ.650, రూ.710 చొప్పున ఎగిశాయి.దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.92,060 వద్ద, 22 క్యారెట్ల పసిడి ధర రూ.84,400 వద్ద ఉన్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.710, రూ.650 చొప్పున పెరిగాయి.చెన్నైలో బంగారం ధరల విషయానికి వస్తే.. ఇక్కడ 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 84,250 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 91,910 వద్దకు చేరాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.650, రూ.710 చొప్పున పెరిగాయి. బెంగళూరు, ముంబై ప్రాంతాల్లోనూ ఇవే ధరలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా వెండి ధరల్లో నేడు ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ రూ.1,13,000 వద్ద, ఢిల్లీలో రూ. 1,04,000 వద్ద కొనసాగుతోంది. పైన పేర్కొన్న బంగారం ధరలు సూచనపూర్వకమైనవి మాత్రమే. వీటిపై జీఎస్టీ, టీసీఎస్, ఇతర పన్నులు, సుంకాలు అదనంగా ఉండవచ్చు. ఖచ్చితమైన ధరల కోసం మీ స్థానిక నగల దుకాణంలో సంప్రదించండి



# రుణదాతలకూ సవాళ్లే..

- కొత్త లోన్ రూల్ నేటి నుంచే

**జనంసాక్షి:**ఎడాపెడా అప్పులు చేసే ధోరణిని కట్టడి చేసే కొత్త నిబంధన ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తోంది. దేశ రుణ వితరణ వ్యవస్థను మార్చే ఈ నియమం మూడు కంటే ఎక్కువ రుణదాతల (బ్యాంకులు లేదా ఫైనాన్స్ సంస్థలు) నుండి రుణాలు తీసుకోకుండా రుణగ్రహీ తలను కట్టడి చేస్తుంది.అధిక వినియోగాన్ని అరికట్టడం, బాధ్యతాయుతమైన రుణాలను ప్రోత్సహిం చడమే ఈ నిబంధన లక్ష్యం.మైక్రోఫైనాన్స్ రంగం అణగారిన వర్గాల సాధికారతలో కీలక పాత్ర పోషించి నప్పటికీ, రుణగ్రహీతలు బహుళ వనరుల నుండి రుణాలు పొందడం చూసింది. ఇది నిర్వహణకు సాధ్యంకాని రుణానికి దారితీస్తుంది. ఈ మితిమీరిన వినియోగం, కొన్ని సంస్థల దూకుడు రుణ విధానాలు వ్యవస్థలో బలహీనతలను సృష్టించాయి. రుణగ్రహీ తలను మూడు రుణదాతలకు పరిమితం చేయడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించాలని, డిఫాల్టర్ల ప్రమాదాన్ని తగ్గించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం మూడు కంటే ఎక్కువ సంస్థల్లో రుణాలు తీసుకుంటున్న 45 లక్షల మంది రుణగ్రహీతలకు, ఈ నియమం సవాలుగా మారుతుంది. వీరు తరచుగా వర్కింగ్ క్యాపిటల్, అత్యవసర అవసరాలు లేదా రోజువారీ మనుగడ కోసం అతివ్యాప్త రుణాలపై ఆధారపడతారు. మూడు బ్యాంకుల పరిమితితో, రుణగ్రహీతలు లిక్విడిటీ కొరతను ఎదుర్కోవచ్చు. ఇది వారి ఆర్థిక వ్యూహాలను పునఃసమీక్షిం చుకునేలా, ఖర్చులను తగ్గించుకునేలా చేస్తుంది. అంతేకాదు క్రెడిట్ మదింపులు కఠినంగా మారతాయి. ముఖ్యంగా అధిక–రిస్క్ గా భావించే రుణగ్రహీతలకు రుణ తిరస్కరణలు పెరగవచ్చు. ఇది కొంతమందిని అధిక వడ్డీలు ఉండే అనధికారిక రుణ మార్గాలవైపు నెట్టవచ్చు. కొత్త రూల్ రుణదాతలకూ అనేక సవాళ్లను కలిగిస్తుం ది. మైక్రోఫైనాన్స్ సంస్థలు తమ పోర్ట్ఫోలి యో వ్యూహాలను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. దీంతో స్వల్పకా లంలో వారి కస్టమర్ బేస్ ఎంతో కొంత కోల్పోయే అవకాశం ఉంది.అంతేకాక, సంస్థలు రుణ వితరణ విషయంలో మరింత క్షణ్ణమైన ప్రక్రియలను పెంపొందించుకోవాలి. రుణగ్రహీతలు మూడు–రుణదాతల పరిమితిని మించకుండా చూసుకోవాలి. ఇందుకోసం బలమైన వ్యవస్థలు, సమన్వయం అవస రమవు తాయి. వాస్తవానికి ఈ నిబంధన జనవరి 1 నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా, సజావుగా జరిగేందుకు ఏప్రిల్ 1కి వాయిదా పడింది. ఈ జాప్యం వాటాదారు లకు సన్నద్ధం కావడానికి సమయం అందించినప్పటికీ, రుణగ్రహీతలు, రుణదాతలు ఈ ముఖ్యమైన మార్పుకు ఎలా అలవాటు పడతారనేదే అసలైన పరీక్ష.

### కొత్త విధానంలో పీపీఎఫ్‌పై ట్యాక్స్ కట్టాల్సిందేనా?

ఒక ఇన్వెస్టర్ ఒక పథకంలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌ను నిలిపివేసి, ఆ పెట్టుబడులను కొనసాగించినట్టయితే.. ఎక్స్‌పెన్స్ రేషియోని ఆ పెట్టుబడుల నుంచి వసూలు చేస్తూనే ఉంటారా? మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను కొనసాగించినం త కాలం వాటి విలువపై ఎక్స్‌పెన్స్ రేషియోని అమ లు చేస్తుంటారు. ఎక్స్‌పెన్స్ రేషియో అన్నది మ్యూ చువల్ ఫండ్ సంస్థ వసూలు చేసే వార్షిక చార్జీ. పెట్టుబడుల నిర్వహణ కోసం అయ్యే వ్యయాలు, ఇతర నిర్వహణ వ్యయాలను చార్జీల రూపంలో వసూలు చేసుకుంటాయి. వార్షిక చార్జీ అయినప్ప టికీ.. దీన్ని ఏరోజుకారోజు పెట్టుబడుల విలువ నుంచి మినహాయించుకుంటాయి. మనకు రోజువారీగా మార్పునకు గురయ్యే ఫండ్ యూనిట్ల ఎన్ఏవీ తెలుసుకదా.చార్జీలను మినహాయిం చుకున్న తర్వాతే ఈ ఎన్ఏవీ ఖరారవుతుంది. సిప్ నిలిపివేశారంటే అప్పటి నుంచి ఆయా పథకంలో మీరు తాజా పెట్టుబడులు పెట్టరనే అర్థం. కానీ, అప్పటికే చేసిన పెట్టుబడులను ఆ ఫండ్ సంస్థ నిర్వహించాలి కదా. అందుకని తమ నిర్వహణలోని మొత్తం ఆస్తులపై (ఏయూఎం) ఎక్స్‌పెన్స్ రేషియోని వసూలు చేసుకుంటాయి. కాకపోతే తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియో ఉన్న పథకాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా దీర్ఘకాలంలో రాబడులను మరింత వృద్ధి చేసుకోవచ్చు. నేను పన్ను ఆదా కోసం ప్రజా భవిష్యనిధి పథకంలో (పీపీఎఫ్) క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఆదాయపన్నులో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంలోనూ నేను పీపీఎఫ్ పెట్టుబడులపై పన్ను ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చా? ఈ ప్రయోజనం గరిష్టంగా ఎంత వరకు ఉంటుంది? ఆదాయపన్ను పాత విధానంలో పీపీఎఫ్‌లో ఒక ఆర్థిక సంవత్సరంలో చేసే పెట్టుబడి గరిష్ఠంగా రూ.1.5 లక్షలపై సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాన్ని క్లెయిమ్



చేసుకోవచ్చు. దీనికి అదనంగా వడ్డీ ఆదాయం, గడువు తీరిన తర్వాత చేతికి వచ్చే మొత్తంపైనా పన్ను లేదు. ఒకవేళ కొత్త పన్ను విధానాన్ని మీరు ఎంపిక చేసుకున్నట్టయితే.. సెక్షన్ 80సీ కింద పీపీఎఫ్‌లో చేసే పెట్టుబడులపై పన్ను ప్రయోజనాన్ని కోల్పోవాల్సి వస్తుంది. ఎందుకంటే కొత్త ఆదాయపన్ను విధానం తక్కువ పన్ను రేట్లతో ఉంటుంది. ఇందులో చాలా వరకు పన్ను మినహాయింపులను తొలగించేశారు.పీపీఎఫ్‌లో పెట్టుబడులపై పన్ను ఆదా ప్రయోజనం కూడా కొత్త విధానంలో లేదు. అయితే, కొత్త పన్ను విధానాన్ని ఎంపిక చేసుకోవాలా లేక పాత విధానమా? అన్నది మీ ఆదాయం, మినహాయింపులను ఎంత మేర క్లెయిమ్ చేసుకోగలరన్న పరిస్థితులపైనే ఆధారపడి ఉంటుంది. పాత పన్ను విధానంలో పీపీఎఫ్, ఇన్సూరెన్స్, గృహ రుణం చెల్లింపులు.. ఇలా అన్ని రకాల మినహాయింపులను క్లెయిమ్ చేసుకునేట్టు అయితే అదే ఎక్కువ ప్రయోజనాన్ని ఇస్తుంది. కొత్త విధానం సులభతరంగా, తక్కువ పన్ను రేట్లతో ఉంటుంది.




## ఐటీ నోటీసు వస్తే 'రాజీయే రాజామార్గం

ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు వస్తే, వెంటనే వారితో 'సంధి' లేదా రాజీ చేసుకోవచ్చు. దీనికి ఎవరి రా యబారమూ అక్కర్లేదు. మీరే స్వయంగా ఒప్పందంలాంటిది చేసుకోవచ్చు.2025 మార్చి 17న ఓ సర్క్యులర్ ద్వారా డిపార్టుమెంటు వారు సులువుగా రాజీ చేసుకోమని మార్గదర్శకాలు ఇచ్చారు. దీన్నే ఇంగ్లీషులో అంటారు. ఎన్నో సందర్భాల్లో డిపార్టుమెంటు వారు నోటీసులు ఇస్తారు. వాటికి బదులివ్వకపోతే వారు కోర్టుకు వెళ్తారు. కొన్ని సీరియస్ కేసుల్లో జైలుకి పంపిస్తారు. అంతవరకు వెళ్లడం అవసరమా! పరువు గంగపాలై, బతుకు హాస్పిటల్ పాలై, కృష్ణ జన్మస్థానంలో గడపడమెందుకు?
ఈ పథకం .. లేదా ఒప్పందం.. లేదా రాజీ మార్గం ప్రకా రం..1 కోర్టుకు వెళ్లక్కర్లేదు. లీగల్ ప్రాసిక్యూషన్, ఉండదు 2. టైం కలిసి వస్తుంది 3. మానసిక ఒత్తిడి ఉండదు 4. ఆర్థిక ప్రమాదం ఉండదు 5. బ్యాంకు అకౌంటు అటా చ్‌మెంట్ ఉండదు 6. వ్యాపారం సజావుగా చేసుకోవచ్చు 7. నలుగురికీ తెలియకుండా గొడవ సమసిపోతుంది

# స్టాక్ మార్కెట్ సెలవులు..

**జనంసాక్షి:**ఇటీవలి రోజుల్లో స్టాక్ మార్కెట్లపై జనంలో ఆసక్తి పెరిగింది. చాలా మంది మార్కెట్ పెట్టుబడుల వైపు వస్తున్నారు. దీంతో రోజువారీ ట్రేడింగ్‌ను గమనించేవారి సంఖ్య పెరిగింది.ఈ నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఏయే రోజులు పనిచేస్తాయి.. సెలవులు ఎప్పుడెప్పుడు ఉంటాయన్నది ఈ కథనంలో తెలుసుకుందాం.. ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) సందర్భంగా ఈరోజు (2025 మార్చి 31 సోమవారం) భారత స్టాక్ మార్కెట్‌కు సెలవు. మూడు



రోజుల వారాంతం తర్వాత 2025 ఏప్రిల్ 1 మంగళవారం ట్రేడింగ్ పునఃప్రారంభమవుతుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ), బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) రెండూ ఈరోజు స్టాక్స్, డెరివేటివ్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ లోన్ (ఎస్ఎల్బీ) విభాగాల్లో ట్రేడింగ్, సెటిల్మెంట్‌కు తెరిచి ఉండవు.అయితే 2025 మార్చి 31న మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) మాత్రం పాక్షికంగా తెరిచి ఉంటుంది. సాయంత్రం సెషన్ సాయంత్రం 5 గంటల నుండి 11:30 / 11:55 గంటల వరకు నడుస్తుంది. దీనికి విరుద్ధంగా, భారతదేశపు అతిపెద్ద వ్యవసాయ కమోడిటీ ఎక్స్ఛేంజ్ అయిన నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌సీడీఈఎక్స్) ఈరోజు పూర్తిగా మూసి ఉంటుంది. పండుగలు, విశేష దినోత్సవాలు, వారాంతపు సెలవులతో కలుపుకొని ఏప్రిల్ నెలలో స్టాక్ మార్కెట్లు మొత్తంగా 11 రోజులు మూసిఉంటాయి. ఆయా రోజుల్లో స్టాక్ ఎక్స్ఛేంజీలు ట్రేడింగ్‌కు అందుబాటులో ఉండవు. సెలవు రోజులు ఇవే..
అదనపు సెలవులు:ఏప్రిల్ 10 – మహావీర్ జయంతి, ఏప్రిల్ – 14 – డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి. ఏప్రిల్ 18 – గుడ్ ఫ్రైడే

# భూకంప శిథిలాల నుంచి కీలక పత్రాల చోరీ?





**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ భూకంప సహాయక చర్యల్లో.. కొత్త కోణం వెలుగు చూసింది. రాజధాని బ్యాంకాక్ లోని 33 అంతస్థుల భవనం కుప్పకూలిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రమాద స్థలి నుంచి కొన్ని పత్రాలను గుట్టుచప్పుడు కాకుండా తరలించేందుకు కొంద రు ప్రయత్నించగా.. సహాయక బృందాలు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వాళ్లను అరెస్ట్ చేయగలిగారు. అయితే ఆ ఐదుగురు చైనాకు చెందిన వాళ్లు కావడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది.చైనాకు చెందిన రైల్వే నంబర్ 10 కంపెనీ 2018లో థాయ్‌లాండ్‌లో తన కార్యకలాపాలు ప్రారంభించింది. హౌజింగ్ సొసైటీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, ఇతర బడా కాంట్రాక్టులను ఈ కంపెనీ స్థానిక కంపెనీలతో జాయింట్ వెంచర్‌గా నిర్వహిస్తూ వస్తోంది. ఈ క్రమంలో థాయ్‌లాండ్ స్టేట్ ఆడిట్ ఆఫీస్ ప్రధాన కార్యాలయం కోసం సుమారు 58 బిలియన్ డాలర్లతో మూడేళ్ల కిందట పనులు చేపట్టారు.తాజా భూకంపం ధాటికి నిర్మాణంలో ఉన్న ఆ భవనం కుప్పకూ లిపోగా.. శిథిలాల నుంచి ఎనిమిది మంది మృతదేహాలను బయటకు తీశారు. అయితే, ఆశ్చర్యకరంగా ఇంతకంటే ఎక్కువ ఎత్తులో భవనాలకు ఏం కాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. డిజైనింగ్‌లో లోపాలు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ అనుమానాల నడుమే.. థాయ్‌లాండ్ ఉప ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్ సైతం ప్రమాద స్థలిని సందర్శించి దర్యాప్తునకు ఆదేశించారు. ఈలోపు..ఈ భవనం నిర్మాణానికి సంబంధించిన పత్రాలను దొంగిలించేందుకు యత్నాలు జరగడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. భవన శిథిలాల వద్దకు ఆదివారం ఐదుగురు వ్యక్తులు అనుమతి లేకుండా లోనికి ప్రవేశించారు. శిథిలాల నుంచి కొన్ని పత్రాలను తీసుకెళ్లేందుకు యత్నిస్తుండగా రెస్క్యూ టీంలు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పజెప్పాయి. వారిని ప్రశ్నించగా.. చైనా దేశస్థులని తెలిసింది. అయితే.. అందులో ఒకరు తాను ప్రాజెక్ట్ మేనేజర్ అని, బీమా క్లెయిమ్ చేసుకోవడం కోసం సంబంధిత పత్రాలు తీసుకెళ్లేందుకు వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.గతంలో ఈ కంపెనీ 'నాసిరక నిర్మాణాల'తో వార్తల్లోకి ఎక్కింది. అయితే ఆయా ఘటనలతో ప్రమాదవశాత్తూ ప్రాణాలు మాత్రం పోలేదు. అయినప్పటికీ ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణాలను ఈ చైనా కంపెనీకి అప్పగించడంపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి.ఇక శుక్రవారం మధ్యాహ్నం మయన్మార్‌లో సంభవించిన భారీ భూకంపం ధాటికి.. పొరుగున ఉన్న థాయ్‌లాండ్‌లోనూ భారీగా భూమి కంపించింది. రాజధాని బ్యాంకాక్‌లో పలు భవనాలు కుప్పకూలిపోవడంతో.. ఇప్పటిదాకా 18 మంది మృతదేహాలను వెలికి తీశారు. మరో 83 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు.

# నేటికీ న్యూటన్ మరణం ఇప్పటికీ మిస్టరియే..



**జనంసాక్షి:**సర్ ఐజాక్ న్యూటన్ ప్రపంచంలోని ప్రముఖ శాస్త్రవేత్తలలో ఒకనిగా గుర్తింపు పొందారు. ఆయన రూపొందించిన సూత్రాలు నేటికీ గణితం, విజ్ఞాన శాస్త్రంలో ఉపయుక్తమవుతు న్నాయి. ఆయన జీవితం ఎన్నో రహస్యాల తో కూడి ఉందంటారు. ప్రపంచవ్యాప్తం గా ఎంతో ఘనత సాధించిన న్యూటన్ అనుమానాస్పద స్థితిలో మరణించడంపై నేటికీ చర్చలు కొనసాగుతుంటాయి. ఐజాక్ న్యూటన్ 1727, మార్చి 31న బ్రిటన్‌లోని మిడిల్‌సెక్స్‌లోని కెన్సింగ్టన్‌లో కన్నుమూశారు. నేడు ఆయన వర్థంతి ఈ సందర్భంగా పలుచోట్ల ఆయనను గుర్తు చేసుకుంటూ, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుం టారు. న్యూటన్ గణిత శాస్త్రవేత్తగా, భౌతిక శాస్త్రవేత్తగా, ఖగోళ శాస్త్రవేత్తగా, రచయితగా, గొప్ప ఆధ్యాత్మికవేత్తగా గుర్తింపు పొందారు. న్యూటన్ కనుగొన్న కలన గణిత సిద్ధాంతం గణిత శాస్త్రానికి కొత్త ఆధారాన్ని అందించింది. అదేవిధంగా న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని అందించి, శాస్త్రీయ భౌతిక శాస్త్ర సిద్ధాంతానికి పునాది వేశారు. ఖగోళ శాస్త్రంలో విశేష కృషి చేసిన ఆయన గ్రహాల కదలికల గురించి వివరించారు. తొలి ఇమేజ్ ఆధారిత టెలిస్కోప్‌ను తయారు చేశారు. ప్రిజం ద్వారా ఆప్టికల్ రంగులపై అధ్యయనం చేశారు. ధ్వని వేగాన్ని లెక్కించడం, శీతలీకరణ నియమం మొదలైనవి న్యూట న్‌కు ఎనలేని గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఆయనకు వేదాంతశాస్త్రంలో కూడా ఆసక్తి ఉంది. న్యూటన్ బైబిల్‌ను అధ్యయనం చేశారని చెబుతారు న్యూటన్ మరణంలోనూ రెండు వాదనలు వినిపిస్తాయి. న్యూటన్ నిద్రలో మరణిం చారని, అనంతరం అతని శరీరంలో పాదరసం కనిపించిందని చెబు తారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు రసవాదంతోనూ సంబంధం ఉందని అంటారు. న్యూటన్ తన చివరి రోజులను ఎంతో రహస్యంగా గడిపారు. ఆ సమ యంలో ఆయన మానసిక అనారోగ్యంతో ఇబ్బంది పడ్డారని, సమాజానికి దూరంగా మెలిగారని చెబుతారు. న్యూటన్ తన మరణానికి ముందు తన ఆవిష్కరణలకు సంబంధించిన కొన్ని పత్రాలను తగులబెట్టారని కొందరు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అవి రసవాదానికి సంబంధించినవని భావిస్తారు.







# అక్కడ నిప్పుల వర్షమే..

## వేసవిలో అక్కడకు వెళితే మాడి మసైపోతారు

శ్రీగంగానగర్ (రాజస్థాన్): వేసవికాలం రాకముందే దేశంలోని పలు ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. కొన్నిచోట్ల వడగాడ్పులకు జనం విలవిలలాడిపోతున్నారు.వేసవి ప్రవేశించకముందే ఇలా ఉంటే, ఇక ముందు ఎలా ఉంటుందోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. అయితే మనదేశంలోని ఒక జిల్లాలో వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఆ సమయంలో అక్కడికి ఎవరైనా వెళితే మాడిమసైపోవాల్సిందే..రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లాలో వేసవిలో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవు తుంటాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతం భారత్‌లో అత్యంత వేడిగా ఉండే ప్రదేశంగా గుర్తించారు. భారత్–పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఈ జిల్లాలో వేసవికాలం దడ పుట్టిస్తుంది. గతంలో ఈ జిల్లా బికనీర్‌లో భాగంగా ఉండేది. ఆ తరువాత దీనిని మరో జిల్లాగా మార్చారు. శ్రీగంగానగర్ జిల్లాకు దక్షిణాన బికనీర్, పశ్చిమాన పాకిస్తానీ పంజాబ్, ఉత్తరాన భారత పంజాబ్ ప్రాంతంలోని ఫాజిల్కా జిల్లాలు ఉన్నాయి.వేసవి కాలంలో శ్రీగంగానగర్ జిల్లాలో సగటు ఉష్ణోగ్రత 45 డిగ్రీలకుపైగా ఉంటుంది. ఫలితంగా జిల్లాలో మధ్యాహ్నం సమయంలో రోడ్లపై ఒక్కరు కూడా కనిపించరు. రాజస్థాన్ లోని ఈ జిల్లా గోధుమ, ఆవాలు, పత్తి పంటలకు ప్రసిద్ధి చెందింది. రాజస్థాన్‌లో అత్యధిక సంఖ్యలో పంజాబీ ప్రజలు ఈ జిల్లాలో నివసిస్తున్నారు. ఇక్కడి మహిళలు ఎంబ్రాయిడరీ చేసిన స్కార్ఫ్‌లను ధరిస్తుంటారు. శ్రీ గంగానగర్ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలకు ఒక కారణం ఉంది. పాకిస్తాన్ నుంచి వచ్చే వేడిగాలులు కారణంగా ఇక్కడ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. వేసవిలో ఇక్కడ ఉష్ణోగ్రతలు ఒక్కోసారి 50 డిగ్రీలు కూడా దాటుతుంటాయి. శ్రీగంగానగర్‌లో సగటు ఉష్ణోగ్రత 45 డిగ్రీలకు అటుఇటుగా నమోదవుతుంటుంది.

## దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఈద్ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ:** నేడు ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఈద్ వేడుకలను అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. వివిధ మసీదులలో సందడి వాతావరణం నెలకొంది.ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ, వేడుకలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.ప్రధాని మోదీ తన 'ఎక్స్' పోస్ట్‌లో ఈద్–ఉల్–ఫితర్ శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఈ పండుగ మన సమాజంలో ఆశ, సామరస్యం, దయ మొదలైన గుణాల స్ఫూర్తిని పెంపొందించాలి. మీరు చేసే అన్ని మంచి ప్రయత్నాలలో విజయం దక్కాలని కోరుకుంటున్నాను. ఈద్ ముబారక్' అని రాశారు. పవిత్ర రంజాన్ మాసం ముగిసిన అనంతరం ముస్లింలు ఈద్–ఉల్–ఫితర్ జరుపుకుంటారు.

# ఈద్ వేళ సీఎం మమత సంచలన ఆరోపణలు

కోల్‌కతా: సోమవారం దేశంలో ఈద్ వేడుకలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. పలు పార్టీల నేతలు ముస్లిం సోదరులను కలుసుకుని, వారికి ఈద్ శుభాకాంక్షలు చెబుతున్నారు.ఇంతలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. కోల్‌కతాలో జరుగుతున్న ఈద్ ప్రార్థనల సందర్భంగా సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ 'బెంగాల్‌లో అల్లర్లను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి ఉచ్చులో పడకండి. బెంగాల్ ప్రభుత్వం మైనారిటీలకు అండగా నిలుస్తుంది. రాష్ట్రంలో ఎవరూ ఉద్రిక్తతలను రెచ్చగొట్టలేరు' అని వ్యాఖ్యానించారు. కోల్‌కతాలోని ఈద్గాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం మమతా బెనర్జీ(%జవీ మీుఎ్ఘు దీుఅవతీయవవ%) మాట్లాడుతూ 'మేము లౌకికవాదులం. ఒకవైపు నవరాత్రులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగానూ శుభాకాంక్షలు చెబుతున్నాం. ఇటువంటి సమయంలో ఎవరూ అరాచకాన్ని వ్యాప్తి చేయకూడదని కోరుకుంటున్నాం. సామాన్యులెవరూ అరాచకాన్ని వ్యాప్తి చేయరు. రాజకీయ పార్టీలు అలాంటి చర్యలకు పాల్పడతాయి. ఇది సిగ్గు చేటు. అన్ని మతాలను పరిరక్షించేందుకు ప్రాణాలను త్యాగం చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. మైనారిటీలను రక్షించడం మెజారిటీల కర్తవ్యం. మైనారిటీల కర్తవ్యం మెజారిటీల మధ్య జీవించడం' అని పేర్కొన్నారు.

# కట్రా- శ్రీనగర్ 'వందేభారత్' రయ్.. రయ్..

## ఏప్రిల్ 19 నుంచి సర్వీసులు ప్రారంభం

శ్రీనగర్: అందాల కశ్మీర్ ఇప్పుడు దేశంలోని ఇతర ప్రాంతాలతో రైలు మార్గం ద్వారా అనుసంధానం కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ 19న కట్రా నుండి శ్రీనగర్‌కు నడిచే తొలి వందే భారత్ రైలును ప్రారంభించనున్నారు.ఈ విషయాన్ని తెలియజేసిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'కశ్మీర్ వందేభారత్ రైలు ప్రారంభమయ్యే చారిత్రాత్మక క్షణం కశ్మీర్‌కు కొత్త అధ్యాయం అవుతుందని' అన్నారు.272 కిలోమీటర్ల పొడవైన ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్ట్ పూర్తికావడంతో కశ్మీర్‌కు కొత్త రైలు మార్గం ఏర్పడింది. ఈ ప్రాజెక్ట్ గత నెలలోనే పూర్తం యింది. అలాగే కట్రా–బారాముల్లా మార్గంలో రైలు రాకపోకల ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ ఏడాది జనవరిలో కట్రా– కశ్మీర్ మధ్య రైలు సర్వీసుకు రైల్వే భద్రతా కమిషనర్ ఆమోదం తెలిపారు.రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం తో జమ్ము.. శ్రీనగర్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. అలాగే ప్రయాణీకులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణం



అందుబాటులోకి రానుంది. కశ్మీర్‌కు నేరుగా రైలు సర్వీసు ఏర్పాటు చేయా లనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. నూతన వందేభారత్ రైలు సర్వీసుతో అది నెరవేరనుంది. కశ్మీర్‌లో పరుగులు తీయబోయే వందే భారత్ ఎక్స్‌ప్రె స్ ఇతర రైళ్లకు భిన్నంగా ఉండనుంది. దీనిని మైనస్ –20 డిగ్రీల సెల్సియ స్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలో కూడా సజావుగా నడిచేలా తీర్చిదిద్దారు. ఈ మార్గంలో నిరంతరాయంగా రైలు సేవలను కొనసాగించేందుకు, పట్టాలపై ఉన్న మంచును తొలగించేందుకు ముందుగా ప్రత్యేక మంచు క్లియరెన్స్ రైళ్లను నడుపుతారు. ఫలితంగా ఈ రైల్వే లైన్ ఏడాది పొడవునా అందుబా టులో ఉంటుంది.

### ఈద్గా నిర్మాణానికి 10 గుంటల
## భూమి విరాళం



భూ విరాళ దాత జనార్దన్ రెడ్డిని సన్మానించిన ముస్లిం మత పెద్దలు

**పెద్దెముల్ మార్చ్ 31(జనం సాక్షి)**

ఈద్గా నిర్మాణానికి 10 గుంటల భూమి విరాళగా అందజేసిన ఆడిచర్ల మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి ని,ఆడిచర్ల గ్రామ జామియా మజీద్ కమిటీ అధ్యక్షుడు జలీల్ ఖురేషి, ఉపాధ్యక్షుడు ఇజాజ్. జనరల్ సెక్రెటరీ మైబూబ్. ఆధ్వర్యంలో జనార్దన్ రెడ్డిని ఘనంగా పూలమాల శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆడిచర్ల గ్రామంలో ముస్లిం మైనార్టీ సోదరులకు ఈద్గా స్థలం చిన్నగా ఉండడం వల్ల ప్రార్థనలు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉందని గ్రామ మైనార్టీ సోదరులు నా దృష్టికి తీసుకువచ్చారు. ఈద్గాగాకు ఆనుకొని ఉన్న మా సొంత పొలంలోనుండి 10 గుంటల భూమిని రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాకు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే గ్రామ ముస్లిం పెద్దలు మాట్లాడుతూ మా గ్రామంలో ఈద్గాకు ఆనుకొని ఉన్న మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి సొంత పట్ట భూమిలో నుండి 10 గుంటల భూమిని ఇవ్వడం పట్ల మేము చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. ఈ రంజాన్ పర్వదినం రోజున ఇవ్వడం ఒక శు భ పరిణామం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పెద్దేముల్ మండల ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.డి ఆఫ్రోజ్ ఖాన్, జంబ్రు పటేల్, నసిర్ పటేల్, హెూటల్ ఇబ్రహీం, బండి ఇబ్రహీం, మాజీ ఉప సర్పంచ్ ఫక్రుద్దీన్, మైబుబ్, ఖదీర్ పటేల్, జైనోదిన్, తదితరులు పాల్గొన్నారు

## తాటి చెట్టు పైనుండి జారిపడి గీత కార్మికుడు మృతి



**ఇబ్రహీంపట్నం, మార్చి 31 (జనంసాక్షి)**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుండి జారిపడి గీత కార్మికుడు పాశం బుచ్చయ్య గౌడ్ (70) మృతిచెందాడు. బుచ్చయ్య గౌడ్ కు ఇద్దరు కొడుకులు. ఇద్దరు కూతుళ్లు.బుచ్చయ్య గౌడ్ మరణవార్త విన్న మంచాల మండలం వ్యవసాయ సహకార బ్యాంక్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకు ని కుటుంబ సభ్యులను ఓదార్చాడు. ప్రభుత్వ నుండి వచ్చే బీమా ఇంకా ఎలాంటి బెనిఫిట్స్ వచ్చేది ఉన్నా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిహారం తొందరగా అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి, ఆరుట్ల గౌడ సంఘం అధ్యక్షుడు తంగడి పల్లి నరేందర్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు, బుచ్చయ్య గౌడ్ మృతదేహానికి నివాళులు అర్పించారు.

# ఖచ్చితంగా మద్దతు ధరల అమలు

### మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతం రైతులను ఆదుకునేలా సహకార వ్యవస్థ




**హైదరాబాద్, మార్చి31 (జనంసాక్షి)**

: సహకార వ్యవస్థ రానురాను పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. ఎపిలో సహకార బ్యాంకులను గత ప్రభుత్వం దివాళా తీయించింది. అక్రమంగా డబ్బులను కొల్లగొట్టారు. ఇందులో దగుల్బాజీలు చేరడం వల్ల అది నిర్వీర్యం అవుతోంది. రైతులను ఆదుకుని వారికి అండగా నిలవాల్సిన సహకారరంగం పూర్తిగా కట్టుతప్పింది. సహకార బ్యాంకులు తమ విధానాలను పూర్తిగా తుంగలో తొక్కాయి. నిజానికి గ్రామస్థాయిలో సహకార రంగం బలంగా ఉంటే.. రైతులు బలపడతారు. సహకారంగంతో పాటు మార్కెట్ వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. తెలంగాణలో రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేసినా అవి కేవలం ఓ రాజకీయ కమిటీలుగా పనిచేసాయి. పదవుల కోసం సృష్టించిన కమిటీలుగా దిష్టిబొమ్మలుగా నిలిచాయి. సహకారరంగంపై నేతలు ఎన్నో ఆదర్శాలు ప్రకటించారు.తెలంగాణలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా రైతు సమన్వయ సమితులు ఎక్కడా ఒక్క రైతు సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. మార్కెట్లో రైతులు పడిగాపలు కాసినా, ధరలు రాక అవస్థలు పడ్డా,,ధాన్యం తడిసి నెత్తీనోరు మొత్తుకున్నా సహకారపదవులు అనుభవించిన నేతలు ఎక్కడా కానరాలేదు. నిజానికి రైతులకు అండగా ఉండాల్సిన సహకార సంఘాలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. రైతువిధానాలు రూపొందించడంలో ఇది పూర్తిగా విఫలం అయ్యింది. రైతులు తమ బాధులు పడలేక అందరి లాగే తానూ ఏదో పట్నం వెళ్లి పనిచేసుకుంటూ పొట్ట పోసుకుంటానని నిర్ణయించు కుంటే..ప్రజల గతేం కానుందో ఊహించుకోవాలి. వ్యవసాయం పడావు పడితే ప్రజలకు అన్నపానీయాలు దొరకవు...ఆధునిక యువతకు వ్యవసాయంపై బొత్తిగా అవగాహన లేకపోవడం కూడా మనకు ప్రమాదమే... అందుకే వ్యవసాయాన్ని ప్రాథమిక స్థాయి నుంచి విద్యలో పాఠ్యాంశంగా చేర్చాలి. అప్పుడే ప్రజలకు అవగాహన పెరుగుతుంది. రైతులకు కావాల్సింది సకాలంలో నీరు రావడం.. నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉండడం.. పెట్టుబడి కోసం బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వడం..ఇవన్నీ సక్రమంగా జరిగిన తరవాత పంటలను ఎలాంటి పేచీలు లేకుండా కొనుగోలు చేయడం.. ఇలా చేస్తే మన పొలాల్లో వారు బంగారాన్నే పండిస్తారు. అందుకు అవసరమైన వాతావరణం సృష్టించాలి. రైతులకు అలక రాకుండా.. వారు నైరాశ్యం చెందకుండా వెన్నుతట్టి ప్రోత్సహించాలి. రైతుబంధు పేరుతో దుబారాగ చేయడం కూడా సరికాదు. వ్యవసాయాన్ని పండగ చేయాలన్న ఆలోచనతో కార్యాచరణకు దిగాలి. వ్యవసాయం దండుగ అన్న నానుడి నుంచి వ్యవసాయం పండుగ అనేలా చేయాలి. రైతులు నిశ్చింతంగా వ్యవసాయం చేయొచ్చు అన్న భరోసా కలిగించాలి. పంటల కొనుగోళ్ల సమయంలో రైతులకు ఆందోళన లేకుండా పంటలను అమ్ముకోవడం లేదు. నిశ్చింతంగా మార్కెట్‌కు వచ్చి పంటలను చక్కగా అమ్ముకోగలిగేలా మార్కెట్ విధానాలు అవలంబించాలి. అప్పుడే సంపూర్ణ ప్రోత్సాహం దక్క గలదు. అయితే మార్కెటింగ్ వ్యవస్థ ఒక్కటే సక్రమంగా లేకపోవడంతో ఏటా రైతులు పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ము కోలేక పోతున్నారు. ఆర్థికంగా అండగా నిలవాలన్న విధంగా కార్యక్రమాలు చేయాలి. అప్పుడే దేశం కూడా ఆర్థికంగా పుంజుకుంటుంది. ప్రజలకు తక్కువ ధరలో ఆహారధాన్యాలు అందుతాయి. ఎగుమతుల ద్వారా విదేశీమారకం సంపాదించుకోగలుగుతాం. ఆలా చేయనంత కాలం భారత అన్నదాతల తలరాత మారదు. కేవలం రైతుభరోసా, ఉచిత విద్యుత్ సరఫరాతో సత్ఫలితాలు రావని గుర్తించడం లేదు. రైతుబంధులోనూ వ్యవసాయం చేయని వారి ఖాతాల్లో నగదు పడిపోతోంది. దీనిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఏ భూముల్లో ఏ పంటలు పండుతున్నాయో గుర్తించాలి. ఇలాంటి భూములకు ఉచిత విద్యుత్ ఇస్తూ గృహవినియోగదారులపై ఛార్జీల భారం మోపడం సరికాదు. నీటిసౌకర్యం పెరగడంతో తెలంగాణలో ధాన్యం దిగుబడులు కూడా పెరిగాయి. అయితే ఈ మేరకు కొనుగోళ్లు మాత్రం సాగడం లేదు. రైతును రాజు చేసేందుకు, వ్యవసాయాన్ని పండగ చేసేందుకు తీసుకొచ్చిన పథకాలు సత్ఫలితాలు ఇవ్వాలి.

# సీసీకెమెరాలతో నేరాల గుట్టురట్టు

### కాలనీల్లో ఏర్పాటుకు ప్రోత్సాహం



**హైదరాబాద్,మార్చి31 (జనంసాక్షి) :**

శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. దీంతో పోలీసులు వీటిని ఏర్పాటు చేసేందుకు ఎక్కడిక్కడ ప్రోత్సహిస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు సంఘాలను పిలిచి మాట్లాడుతున్నారు. ఓ మోస్తరు పట్టణంలో ఇప్పుడు వీటి ఏర్పాటు సాగుతోంది. ఇటీవల అనేక నేరాల చిట్టాలను గుర్తించడంలో సిసి కెమెరాలు బాగు ఉపయోగ పడ్డాయి. అనేక క్రిమినల్ కేసులు సిసి కెమరాల దృశ్యాల ఆధారంగా ఛేదించారు. అందుకే జిల్లాల కేంద్రాలతో పాటు చోటమోటా పట్టణాల్లో కూడా వీటి ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులను ఇతరలను పిలిచి మాట్లాడుతున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళు తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమేరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయి. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని

అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్టాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్‌శాఖ విశేషంగా కృషి చేస్తున్నది. దానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నది. దేశంలోనే తెలంగాణ పోలీసింగ్‌కు మంచి గుర్తింపు కూడా వచ్చింది. దానిని కాపాడుకుంటూ మరింత పేరుపొందేలా, ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



### జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

**నిజామాబాద్,మార్చి31 (జనసాక్షి) :**

రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి.అన్ని జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి, 4 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ఏడాది పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు చేరుకొనే అవకాశం ఉంటుందని తెలిపింది. ఎండవేడిమికి మధ్యాహ్నం ఇండ్ల నుంచి బయటకు వెళ్లేందుకు జనాలు జంకుతున్నారు. ఉదయం 7గంటల నుంచే ఎండ చురుకుమంటోంది. 11 గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు వెళ్లే పరిస్థితిలేదు. మధ్యాహ్నం మూడు గంటలవరకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇంట్లో ఉన్నా తీవ్ర ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. పగటి ఉష్ణోగ్రత పదిరోజులు గా 39నుంచి 40డిగ్రీలమధ్య నమోదుకావడంతో నిప్పుల కొలిమిగా మారింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానియాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో శీతలపానియాల విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఆదిలాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన రంజన్లను విక్రయిస్తుండడంతో ప్రజలు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కూలర్లకు గిరాకీ పెరిగింది. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పగటిపూట అవసరమైతే తప్ప బయట తిరగొద్దు. శారీరక శ్రమతో కూడిన పనులు చేయవద్దు. డీహైడ్రేషన్‌కు గురవకుండా మంచినీటిని అధికంగా తీసుకోవాలన్నారు. కాటన్ దుస్తులనే ధరించాలి. ఎండలో ప్రయాణించాల్సి వస్తే ముఖానికి రుమాలు కట్టుకోవాలి, టోపీలు, చలువ అద్దాలు, గొడుగు, హెల్మెట్ ధరించాలి. పంచదార, మజ్జిగ, నిమ్మరసం, ఉప్పుకలిపిన నీటిని తరుచూ తాగాలి. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

## ఎల్ఆర్ఎస్ ద్వారా ఇప్పటివరకు రూ. 94 కోట్ల ఆదాయం

### 14 వేల ప్లాట్ల క్రమబద్ధీకరణ పట్టణ ప్రణాళిక అధికారులను అభినందించిన మేయర్



**వరంగల్ ఎంజీఎం, మార్చి 31(జనంసాక్షి)**

25 శాతం రిబేట్ తో ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ స్కిం ద్వారా సమారు 14 వేల పాట్లను క్రమబద్ధీకరించి ఇప్పటివరకు బల్దియా దాదాపు రూ.94 కోట్ల ఆదాయం సేకరించిందని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల నివృత్తి కౌంటర్ ను నగర మేయర్ గుండు సుధారాణి సోమవారం ఆకస్మికంగా సందర్శించి ఎల్ఆర్ఎస్ కు సంబంధించి ప్రజల సందేహాలను పరిష్కరిస్తున్న తీరును పరిశీలించి,నేరుగా ప్రజలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పట్టణ ప్రణాళికా అధికారులు సిబ్బంది సమష్టిగా సెలవు రోజుల్లోనూ కృషి చేసి ఈ లక్ష్యాన్ని సాధించడం పట్ల మేయర్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సోమవారం 25% రిబేట్ తో అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు సోమవారం చివరి రోజు అయినందున రంజాన్ పండుగ సెలవు ఉన్నప్పటికీ బల్దియా వ్యాప్తంగా పది కౌంటర్లను నిర్వహిస్తూ ప్రజల సందేహాలు నివృత్తి చేయడం వల్ల 93 కోట్ల రూపాయలు సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ రోజున పట్నం సుడిగాలి పర్యటన.

ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ప్రభుత్వ విప్.

**తాండూరు మార్చి 31(జనంసాక్షి)**



పట్టణంలో రంజాన్ పండుగ సందర్భంగా మాజీ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి సుడిగాలి పర్యటన నిర్వహించారు. రంజాన్ మాసం పునస్కరించు కొని ముస్లిం సోదరుల ప్రార్థనలలో పాల్గొని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అభిమాని పట్టణ ప్రముఖ కూరగాయల వ్యాపారి సుల్తాన్ నివాసంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సోదర భావంతో శాంతియుత వాతావరణంలో కలిసిమెలిసి పండుగలు జరుపుకోవాలని అన్నారు.

## కాంగ్రెస్‌తో అభివృద్ధి సాధ్యం

**షాబాద్, మార్చి 31(జనం సాక్షి)**



: తెలంగాణ రాష్ట్రం లోని గ్రామాలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అంచ లంచలుగా అభివృద్ధి చెందుతున్నాయని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామ 15 మంది బీజేపీ నాయకులకు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ తో కలిసి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామా లు అంచలంచెలుగా అభివృద్ధి చెందుతున్నాయని, సంక్షేమ పథకాలు అమలు పరుస్తూ ప్రజల్లో విశ్వాసం పొందిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పార్టీలో పనిచేస్తున్న ప్రతి నాయకున్ని గౌరవించి కాపాడుకునే పార్టీ ఏ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. రాబోయే స్థానిక పంచాయతీ ఎన్నికల్లో ప్రతి పంచాయితీని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, దమర్లపల్లి మాజీ సర్పంచ్ లింగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



# 'బంగారు' గ్రీష్మ...

**మూడు బంగారు పతకాలు యువ స్కేటర్**

విశాఖ నగరానికి చెందిన ఆర్టిస్టిక్ స్కేటర్ దొంతారా గ్రీష్మ తైవాన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో మూడు బంగారు పతకాలు సాధించింది. ఈనెల 25 నుంచి 30 వరకు తైవాన్‌లో జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్లో పాల్గొన్న గ్రీష్మ.. పెయిర్, పెయిర్ డ్యాన్స్, క్వార్టెట్లో పోటీ పడి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. అంతేకాదు.. మరో రెండు ఈవెంట్లలోనూ నాలుగో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం 16 ఏళ్ల ఆర్టిస్టిక్ స్కేటర్.. విశాఖ వ్యాలీ స్కూల్లో ప్లస్ టు చదువుతోంది




## తొలి మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఎంతో మంది యువ ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకొస్తోంది. తాజాగా ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ మరో యంగ్ ట్యాలెంట్‌కు గుర్తింపు తీసుకొచ్చింది. కెరీర్‌లో తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న ముంబై బౌలర్ అశ్వనీ కుమార్ ఆకట్టుకున్నాడు. వేసిన తొలి బంతికే వికెట్ తీశాడు. మొత్తం 3 ఓవర్లు వేసి 24 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. దీంతో ఎవరీ అశ్వనీ కుమార్ అనే ఆసక్తి చాలా మందిలో మొదలైంది.

23 ఏళ్ల ఈ అశ్వనీ కుమార్ పంజాబ్‌లోని మొహాలీకి చెందిన వాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో పంజాబ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించాడు. 2022లో పంజాబ్ తరఫున సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీ ఆడాడు. ముఖ్యంగా షేర్-ఎ-పంజాబ్ టీ20 క్రికెట్ లీగ్‌లో సత్తా చాటి అందరి దృష్టిలో పడ్డాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో అతడి బౌలింగ్ చాలా మందిని ఆకట్టుకుంది. పంజాబ్ టీమ్ 2024లో అశ్వనీ కుమార్‌ను వేలంలో దక్కించుకుంది. అయితే అప్పుడు అశ్వనీకి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు.

# ముంబైని ముద్దాడిన గెలుపు

## అర్ధ శతకంతో విజృంభించిన రికెల్టన్

- ఎట్టకేలకు బోణీ కొట్టిన మాజీ ఛాంపియన్
- కోల్‌కతాపై సునాయాస ముంబై తొలి విజయం

వరుస పరాజయాలతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ స్వంత మైదానంలో జూలు విదిల్చింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ జట్టు ఘన విజయం సాధించింది. 8 వికెట్ల తేడాతో కోల్‌కతాను చిత్తు చేసింది. తొలి మ్యాచ్ ఆడుతున్న బౌలర్ అశ్వని కుమార్ 4 వికెట్లతో చెలరేగడంతో కోల్‌కతా స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. స్వల్ప స్కోరును ముంబై బ్యాటర్లు సునాయాసంగా ఛేజింగ్ చేశారు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన హార్దిక్ పాండ్యా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో కోల్‌కతా టీమ్ బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ హార్దిక్ నమ్మకాన్ని నిలబెట్టిన ముంబై బౌలర్లు కోల్‌కతాను ఆదిలోనే దెబ్బతీశారు. 116 పరుగులకే ఆలౌట్ చేశారు. తొలి మ్యాచ్ ఆడుతున్న ముంబై బౌలర్ అశ్వని కుమార్ 4 వికెట్లు తీసి కోల్‌కతా పతనాన్ని శాసించాడు. రఘువంశీ (26), రమణ్‌దీప్ (22) మాత్రం 20కి పైన పరుగులు చేశారు. నరైన్ (0), డికాక్ (1), రహానే (11), వెంకటేష్ అయ్యర్ (3), రింకూ సింగ్ (17), మనీష్ పాండే (19), రస్సెల్ (5) విఫలమయ్యారు. ముంబై బౌలర్లలో తొలి మ్యాచ్ ఆడుతున్న అశ్వని కుమార్ 4 వికెట్లు పడగొట్టాడు. దీపక్ చాహర్ రెండు వికెట్లు తీశాడు. బౌల్ట్, హార్దిక్, విఘ్నేష్ పుత్తూర్, శాంట్నర్ ఒక్కో వికెట్ తీసుకున్నారు.

అనంతరం ఛేజింగ్‌కు దిగిన ముంబై సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. రోహిత్ శర్మ (13) త్వరగానే ఔటైనా, మరో ఓపెనర్ రికెల్టన్ (62) అద్భుతమైన హాఫ్ సెంచరీతో చెలరేగి ముంబై విజయాన్ని సునాయాసంగా మార్చేశాడు. విల్ జాక్స్ (16) రెండో వికెట్‌గా వెనుదిరి గాడు. సూర్యకుమార్ (27) లాంఛనాన్ని పూర్తి చేశాడు.

దీంతో కోల్‌కతా నిర్దేశించిన 117 పరుగుల లక్ష్యాన్ని ముంబై 12.5 ఓవర్లలోనే ఛేదించింది. ఆండ్రూ రస్సెల్ రెండు వికెట్లు దక్కించుకున్నాడు. కాగా, ఈ సీజన్‌లో ముంబైకి ఇది తొలి విజయం కాగా, కోల్‌కతాకు ఈ సీజన్‌లో రెండో ఓటమి.



ముంబై బౌలర్ ట్రెంట్ బౌల్ట్ తొలి ఓవర్లోనే సునీల్ నరైన్ (0)ను అద్భుతమైన యార్కర్‌తో అవుట్ చేశాడు. ఐపీఎల్‌లో తొలి ఓవర్లోనే వికెట్ తీయడం బౌల్ట్‌కు ఇది 30వ సారి. ఆ తర్వాత రెండో ఓవర్లో కోల్‌కతాకు గట్టి షాక్ తగిలింది. గత మ్యాచ్‌లో 97 పరుగులు చేసి జట్టును గెలిపించిన డికాక్ (1)ను దీపక్ చాహర్ అవుట్ చేశాడు. ఇక, ఒక సిక్స్, ఒక ఫోర్ కొట్టి జోరుమీదున్న కెప్టెన్ రహానేను కొత్త బౌలర్ అశ్విని కుమార్ అవుట్ చేశాడు. ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న అశ్విని తొలి బంతికే రహానేను అవుట్ చేశాడు. ఆ తర్వాత దీపక్ చాహర్ మరో బ్రేక్ ఇచ్చాడు. వెంకటేష్ అయ్యర్ (3)ను అవుట్ చేశాడు. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి కోల్‌కతా 41 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ప్రస్తుతం రఘువంశీ (25), రింకూ సింగ్ క్రీజులో ఉన్నారు. ముంబై బౌలర్లలో దీపక్ చాహర్ రెండు వికెట్లు తీశాడు. బౌల్ట్, అశ్విని ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. కాగా, ముంబై ఫీల్డర్లు ఇప్పటికే రెండు క్యాచ్‌లు వదిలేశారు.

# సీఎస్కే... అనుభజ్ఞులే కానీ

## ఐదేళ్లలో ఒక్కసారీ 180 టార్గెట్‌ను ఛేదించలేదు: సెహ్వాగ్



ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ లక్ష్య ఛేదనలో తడబాటుకు గురవుతోంది. తొలి మ్యాచ్లో 160 పరుగుల్లోపే టార్గెట్‌ను చివరి ఓవర్ వరకూ తీసుకెళ్లింది. ఇక బెంగళూరుతో 197 లక్ష్యంతో బరిలోకి దిగి 50 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తాజాగా జరిగిన రాజస్థాన్ పోరులో టార్గెట్ 183 పరుగులే అయినా ఛేదించలేక చేతులెత్తేసింది. చివరికి 176 రన్స్‌కే పరిమితమైంది. ఈక్రమంలో సీఎస్కే లక్ష్య ఛేదనలపై భారత మాజీ క్రికెటర్ సెహ్వాగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా చెన్నై 180+ టార్గెట్ను ఛేదించలేదని గుర్తు చేశాడు.

"రెండు ఓవర్లలో 40 పరుగులు చేయడం చాలా కష్టం. ఎంతటి పెద్ద ప్లేయర్ ఉన్నా సరే అంత తేలికేం కాదు. ఏదోఒకటి లేదా రెండు సందర్భాల్లో నే ఇలా జరుగుతుంది. గతంలో ధోనీ ఒకే ఓవర్లో 25 పరుగులు చేసినట్లు గుర్తు. అదీ అక్షర్ పటేల్ బౌలింగ్ అనుకుంటా. అంతకుముందు ఇర్ఫాన్ పఠాన్ ఓవర్లో 20 వరకు కొట్టాడు. ఇలాంటి పీట్లు ప్రతిసారీ జరగవు. ఎందుకంటే గత ఐదేళ్లలో చెన్నై ఒక్కసారి కూడా 180+ టార్గెట్‌ను ఛేదించిన దాఖలాలు లేవు" అని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు.

**ధోనీ, జడేజా ఇంకాస్త ముందు మొదలెట్టాల్సింది: పుజారా**

"రవీంద్ర జడేజా, ధోనీ క్రీజ్లో ఉన్నప్పుడు ప్రత్యర్థి బౌలర్లు ఒత్తిడికి గురవుతారు. కానీ, వీరిద్దరూ కలిసి 22 బంతుల్లో 35 పరుగుల భాగస్వామ్యం మాత్రమే నిర్మించారు. ఇంకాస్త దూకుడుగా ఆడాల్సింది. సందీప్ శర్మ వేసిన 17వ ఓవర్లో లో సింగిల్స్ మాత్రమే తీశారు. ఆ ఇద్దరిలో ఎవరైనా ముందే ఔటైతే పరిస్థితి ఇంకాస్త కఠినంగా ఉంటుందని భావించి ఉండొచ్చు. సీఎస్కే బ్యాటింగ్ లైనప్పై కూడా మేనేజ్మెంట్ ఆలోచించాలి. రుతురాజ్ గైక్వాడ్ ఓపెనర్ వస్తేనే జట్టుకు ప్రయోజనం. రాహుల్ త్రిపాఠి ఇబ్బందిపడుతున్నాడు. దేవన్ కాన్వేను తీసుకోవాలి. అతడు ఆరంభంలో దూకుడుగా పరుగులు రాబడతాడు" అని భారత వెటరన్ క్రికెటర్ ఛెతేశ్వర్ పుజారా తెలిపాడు.

# గుండె తరుక్కుపోయింది! : అంబటి రాయుడు



ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ వరుస ఓటములును అందుకుంటోంది. మొన్న ఆర్సీబీపై ఏకంగా 50 పరుగుల తేడాతో ఓడిన ఆ జట్టు.. ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్‌పై 6 పరుగులు తేడాతో పరాజయాన్ని అందుకుంది. అయితే గుహావతి వేదికగా జరిగిన మ్యాచులో రాజస్థాన్ రాయల్స్ ఫీల్డింగ్ చేసిన విధానాన్ని పలువురు మాజీ క్రికెటర్లు, అభిమానులు ప్రశంసిస్తున్నారు. ఈ మ్యాచులో ఇరు జట్ల ఫీల్డింగ్ ప్రదర్శనను పోలుస్తూ, అందులో ఉన్న తేడాని గుర్తించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలోనే సీఎస్కే మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కూడా సీఎస్కే వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ ఎలాంటి పాత్ర పోషించిందో వివరించాడు. రాజస్థాన్ రాయల్స్ చేసిన కచ్చితత్వమైన ఫీల్డింగే వారి విజయానికి కారణమయ్యాయని తెలిపాడు. "చెన్నై సూపర్ కింగ్స్ ఫీల్డింగ్‌లో మెరుగైన జట్టుగా గుర్తింపు పొందలేదు. తొలి రెండు మ్యాచ్‌లలోనే సీఎస్కే ఆటగాళ్లు సులభమైన క్యాచ్‌లను విడిచిపెట్టడం, అవుట్‌ఫీల్డులో తడబడటం వంటి తప్పిదాలు చేశారు. వాటిని గుర్తించి సరిచేసుకోవాలి. వీటిని త్వరగా సరిచేసుకోకపోతే, జట్టుకు పెద్ద నష్టం కలుగుతుంది. సీఎస్కే చేసిన కొన్ని పొరపాట్లు, తప్పిదాలు చూస్తుంటే, నిజంగానే చాలా బాధకరంగా అనిపించాయి," అని సీఎస్కే ఓటమి తర్వాత అంబటి రాయుడు వ్యాఖ్యానించాడు.

"ఒక మ్యాచ్ గట్టిపోటీకరంగా మారినప్పుడు, చిన్న చిన్న విషయాలు కూడా ఫలితాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ మ్యాచ్‌లో కొన్ని అద్భుతమైన, అసాధారణమైన క్యాచ్‌లు చూశాం. సాధారణంగా ఇటు వంటి క్యాచ్‌లు అరుదుగా చూస్తాం! అయితే, చెన్నై సూపర్ కింగ్స్ మాత్రం ఫీల్డింగ్‌లో చేతులెత్తేసింది. ఒకటి లేదా రెండు క్యాచులు తప్ప, వారి ఫీల్డింగ్‌లో పెద్దగా ప్రభావం లేదని స్పష్టంగా కనిపించింది. అదే రాజస్థాన్ రాయల్స్ అద్భుతంగా ఆడింది. ఫీల్డింగ్ అనేది కేవలం యువ జట్టును కలిగి ఉండటం వల్లే బాగా రాణించగలమని అనుకోవడం తప్పు. అది ముందుగా అంచనా వేసి, ఫీల్డ్ లో అప్రమత్తంగా ఉండటంపై ఆధారపడి ఉంటుంది. శివమ్ దూబే భారీ షాట్లు కొడుతూ డేంజర్‌గా మారుతున్న సమయంలో రియాన్ పరాగ్ అందుకున్న క్యాచ్, మ్యాచ్‌లో కీలక మలుపుగా మారింది," అని రాయుడు విశ్లేషించాడు.

## డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడనున్న ఆ ఇద్దరు!

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు మరో రెండు నెలల సమయమే ఉంది. రెండేళ్ల క్రితం విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా మరోమారు టెస్టు గదను ఒడిసిపట్టాలనే కసితో ఉంది. ఇప్పటికే ఈ మెగా టోర్నీ సన్నద్ధతలో ఉన్న మాజీ ఛాంపియన్‌కు గుడ్ న్యూస్. లార్డ్స్‌లో జరిగే ఫైనల్ పోరుకు ఇద్దరు కీలక ఆటగాళ్లు అందుబాటులో ఉండే అవకాశ ముంది. పేస్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్, స్టార్ స్పిన్నర్ నాథన్ లియాన్‌లు త్వరలోనే జట్టుతో కలుస్తారని సమాచారం. వెన్నుపాముకు సర్జరీ చేయించు కున్న గ్రీన్ తాను వేగంగా కోలుకుంటున్నాడు. ఈమధ్యే అతడు ఆస్పత్రి బెడ్ మీద నవ్వుతూ దిగిన ఫొటోను, ఆ తర్వాత ఫిట్‌గా మారిన ఫొటోను అభిమా నులతో పంచుకున్నాడు.

'నేను ఫిట్‌గానే ఉన్నా. త్వరలోనే ఇంగ్లండ్ కౌంటీ క్లబ్.. గ్లౌకోసెస్టర్‌షైర్ తరఫున మైదానంలో అడుగు పెట్టనున్నాను. ఒకవేళ వెస్టర్న్ ఆస్ట్రేలియా జట్టు షెఫీల్డ్ షీల్డ్ ఫైనల్ చేరితే.. ఆ మ్యాచ్‌లో ఆడేందుకు సిద్ధంగా ఉన్నాను' అని వెల్లడించాడు గ్రీన్. తొడకండరాల గాయం నుంచి కోలుకుంటున్న నాథన్ లియన్ సైతం త్వరలో నే ఫామ్ చాటుకోనున్నాడు. అతడు కూడా స్వదేశంలో జరుగుతున్న షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో ఆడే అవకాశం ఉందని టాక్. అదే జరిగితే.. వీళ్లిద్దరూ డబ్ల్యూ టీసీ ఫైనల్ కల్లా జట్టుతో కలిసే అవకాశముంది. రెండేళ్ల క్రితం టీమిండియాకు షాకిచ్చి టెస్టు గదను సొంతం చేసుకున్న కంగారు జట్టు.. రెండోసారి కూడా విజేతగా నిలవాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు ఒక్కటంటే ఒక్క ఐసీసీ ట్రోఫీ కూడా గెలవని సఫారీలు.. ఈ అవకాశాన్ని జారవిడవకూడదని భావిస్తున్నారు.



## ఆదిత్య మెహతా ఫౌండేషన్ అథ్లెట్లు చారిత్రాత్మక విజయం

**మొదటి నేషనల్ పారా రోడ్ సైక్లింగ్ ఛాంపియన్షిప్‌కు 25 పతకాలు కైవసం**

**హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :** మేడ్చల్ ఔటర్ రింగ్ రోడ్డులో జరిగిన మొదటి నేషనల్ పారా రోడ్ సైక్లింగ్ ఛాంపియన్షిప్ 2025లో ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్) 25 పతకాలు కైవసం చేసుకోవడం ద్వారా చారిత్రాత్మక విజయం సాధించింది. ఈ విజయం ఆదిత్య మెహతా ఫౌండేషన్ నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. ఆదిత్య మెహతా మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన నవోదయ విద్యాలయ సమితి (జేఎన్వీ రంగారెడ్డి) పాఠశాల పారా సైక్లిస్టులు 16 పతకాలు గెలుచుకున్నారు. వీరి అచంచలమైన అంకితభావం పారా సైక్లింగ్లో కొత్త ప్రమాణాలు నెలకొల్పాయి. ఈ ఛాంపియన్షిప్‌లో దేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన 90 మంది పారా సైక్లిస్టులు పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన వారిలో హర్యానాకు చెందిన ప్రీతమ్ పునియా (జూనియర్ హ్యాండ్ సైకిల్ - పురుషులు), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చందన (జూనియర్ హ్యాండ్ సైకిల్ - మహిళలు), మహారాష్ట్రకు చెందిన ప్రశాంత్ అర్కల్ (సీనియర్ హ్యాండ్ సైకిల్ - పురుషులు), మధ్యప్రదేశ్‌కు చెందిన హరిమంగేష్ (జూనియర్ మెన్ - సీ2), అస్సాంకు చెందిన లాల్రామ్ (జూనియర్ పురుషులు - సి3), ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమీర్ చౌదరి (జూనియర్ పురుషులు - సీ4), జమ్మూ, కాశ్మీర్‌కు చెందిన అబిద్ హుస్సేన్ ఖాన్ (జూనియర్ పురుషులు - సీ5), గుజరాత్కు చెందిన విశ్వ (జూనియర్ మహిళలు - సీ3), అస్సాంకు చెందిన లిసా (జూనియర్ మహిళలు - సీ5), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అర్షద్ షేక్ (సీనియర్ పురుషులు - సూ2), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పవన్ కన్నోజియా (సీనియర్ పురుషులు - సి3), మహారాష్ట్రకు చెందిన జ్యోతి గదేరియా (సీనియర్ మహిళలు సీ2), కర్ణాటకకు చెందిన బసవరాజ్ (సీనియర్ పురుషులు సీ5) ఉన్నారు.

## ఐపీఎల్‌లో సిక్సర్లు..

- తొలి భారత ఆటగాడిగా ధోనీ రికార్డు
- చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ మహేంద్ర సింగ్ ధోనీ

ఐపీఎల్‌లో అదిరిపోయే రికార్డు సాధించాడు. 30 ఏళ్లు నిండిన తర్వాత ఐపీఎల్‌లో 200 సిక్సు బాదిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు. ఆదివారం రాజస్థాన్ రాయల్స్ జరిగిన మ్యాచ్లో తుషార్ దేశ్పాండే వేసిన 19 ఓవర్లో సిక్స్ బాదడం ద్వారా ధోనీ ఈ ఫీట్ సాధించాడు. ఓవరాల్గా ఈ జాబితాలో ధోనీ రెండో స్థానంలో ఉండగా.. క్రిస్ట్ (347 సిక్సు) అగ్రస్థానంలో ఉన్నాడు. భారత ఆటగాళ్ల విషయానికొస్తే.. ధోనీ తర్వాత రోహిత్ శర్మ (113), అంబటి రాయుడు (109), దినేశ్ కార్తీక్ (104) మాత్రమే 30 ఏళ్లు నిండిన తర్వాత 100 కంటే ఎక్కువ సిక్సర్లు బాదారు.ప్రస్తుతం ధోనీ వయసు 43 ఏళ్లు. అయినప్పటికీ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ ఐపీఎల్లో తన కెరీర్ను కొనసాగిస్తున్నాడు. పూర్తి స్థాయి వికెట్‌కిపర్‌గా ఉంటూ మెరుపు స్టంపింగ్స్ చేస్తున్నాడు. బ్యాటిం గ్‌లో మాత్రం మునుపటి జోరును ప్రదర్శించలేక పోతున్నాడు. రాజస్థాన్తో మ్యాచ్లో ఏడో స్థానంలో వచ్చిన ధోనీ 11 బంతుల్లో 16 పరుగులు చేశాడు. అటు సీఎస్కే కూడా ఈ సారి ఆకట్టుకోలేక పోతోంది. తొలి మ్యాచ్లో ముంబ యిపై గెలిచిన చెన్నై.. తర్వాత వరుసగా రెండు మ్యాచ్ ల్లో ఓడింది.

# మహిళా మావోయిస్టు నేత చైతు మృతి

- వరంగల్ జిల్లా కడవెండి నివాసి
- ఉన్నత విద్యను అభ్యసించి మహిళా సంఘంలో కీలకపాత్ర
- ఆమెపై చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం 25 లక్షలు, తెలంగాణ ప్రభుత్వం 20 లక్షల రివార్డు





**దంతేవాడ,మార్చి 31 (జనంసాక్షి) :** చత్తీస్‌గడ్‌లో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ముఖ్య నాయకురాలు మరణించారు. ఎన్‌కౌంటర్ మృతురాలి గుర్తింపు ఎస్పీ గౌరవ్ రాయ్ వెల్లడించారు. దంతేవాడ జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతి చెందిన మహిళా మావోయిస్టు గుర్తింపు. దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక అలియాస్ చైతు అలియాస్ సరస్వతిగా గుర్తించారు. చైతుది వరంగల్ జిల్లా కడవెండి గ్రామం ఆమె 35 ఏళ్ల క్రితం పార్టీలో వెళ్లారు. మృతురాలి స్వస్థలం వరంగల్ జిల్లా కడ వెండి నివాసి ఛత్తీస్ ఘడ్ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక అలియాస్ చైతు అలియాస్ సరస్వతి దండకారణ్యం లో ఒకవైపు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ తన రచన ద్వారా అమరవీరుల ఎన్ కౌంటర్‌లో త్యాగాలను కీర్తిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ ఉన్నత చదువులు చదివిన ఒక విద్యావంతు రాలు అమరత్వం పొందడం చాలామంది విప్లవ సానుభూతిపరులను, మేధావులను కలవరపరుస్తుంది.

న్యాయవిద్య అభ్యసించిన తదుపరి, తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ, అటు మహిళా సంఘంలో కీలకంగా పనిచేస్తూ రేణుకఏ చైతు మావో యిస్టు పార్టీలోకి పూర్తిస్థాయి కార్యకర్తగా వెళ్లిన రేణుక మరణం వరకు 35 ఏళ్ల క్రితం పార్టీలోకి వెళ్లిన చైతు విప్లవోద్యమంలో కొనసాగుతూ స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ప్రస్తుతం కొనసాగుతున్నట్లు తెలుస్తుంది తాను దోపిడీదారుల గుండెల్లో బాకులా, అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ పోరాటా లు చేస్తూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం పీడిత ప్రజల పక్షాన నిలబడి తన చివరి శ్వాస వరకు పోరాడుతూ కార్పొరేట్ పెట్టుబడుదారుల కాపలా కుక్కలైనటువంటి ప్రభు త్వ యంత్రాంగానికి బానిసలుగా పనిచేస్తున్న సైనిక బలగాల చేతులో అమరత్వం పొందడం చాలా బాధాకరమైన విషయం గా కడవెండి గ్రామస్తులు రేణుక యొక్క గత స్మృతులు నెమరు వేసుకుంటున్నారు.రేణుక తండ్రి సోమయ్య (సార్)ఉపాధ్యా యుడిగా పనిచేసే పదవి విరమణ చేశారు .తనకు ఇద్దరు సోదరులు ఉన్నారు ఒక సోదరుడు గుమ్మడి వెల్లి రాజశేఖర్ న్యాయవాదిగా పనిచేస్తూ, ఒక స్వచ్ఛంద సంస్థకు లీగల్ అడ్వైజర్ గా కొనసాగుతున్నట్టు సమాచారం. మరొక సోదరుడు గుమ్మడవెల్లి వెంకట కిషన్ ప్రసాద్ఏపూసండి ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో బిబిసి(తెలుగు)లో జర్నలిస్టుగా పనిచేస్తున్నట్టు సమాచారం. గతంలో ఇతను కూడా మావోయిస్టు అగ్రనేతగా పనిచేసే అనారోగ్య కారణాల వల్ల ప్రభుత్వానికి లొంగిపోయి లొంగిపోయి నట్లు తెలిసింది.కడవెండి గ్రామం అంటేనే రజాకార్లకు సైతం గుండెల్లో వణుకు పుట్టించిన గ్రామంగా,విప్లవాల ఖిల్లా గా పేరుంది. రేణుకఏచైతు మరణంతో కడవెండి గ్రామం లో విషాద ఛాయలు నెలకొన్నాయి. కడవండి గ్రామం నుంచి వెళ్లిపోయి రేణుక తల్లిదండ్రులు ప్రస్తుతం హైదరాబాదులోని నాగారంలో ఉంటున్నట్టు సమాచారం రేణుక మృతదేహాన్ని తీసుకురావడాని కి వాళ్లు కుటుంబ సభ్యులతో కలిసి చతిస్గడ్ వెళ్తున్నట్టు తెలిసింది. వీళ్ళ కుటుంబం ఆదర్శ బావాలు గల కుటుంబంగా పేరుంది వీరి మేనమామ సైతం రవి అజ్ఞాతంలో ఉన్నట్టు తెలుస్తుంది.

# జిహెచ్ఎంసిలో నిధుల కొరత

**మరోమారు ఎర్లీబర్డ్ స్కీమ్**




**హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :** ఎర్టీబర్డ్ స్కీమ్‌తో మరోమారు గ్రేటర్ హైదరాబాద్ ముందుకు వచ్చింది. సోమవారంతో 90శాతం వడ్డీ రాయితీ పథకం ముగిసింది. దీంతో ఇప్పుడు నిధుల వేటలో ఉన్న జిహెచ్ఎంసి ఈ ప్రయత్నంలో ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను చెల్లింపుపై జీహెచ్ ఎంసీ ఎర్టీబర్డ్ స్కీం ప్రవేశ పెట్టింది. ఆస్తిపన్ను చెల్లింపు దారుల ప్రయోజనం కోసం ఎర్లీ బర్డ్ స్కీంను బల్దియా తీససుకుని వచ్చింది. గతంలోనూ ఇలాంటి ప్రయోగం చేసి మంచి ఫలితం రాబట్టింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం నాడు ఓ ప్రకటన విడుదల చేశారు. ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ఆస్తి పన్ను ఏప్రిల్ 30వ తేదీ లోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందే అవకాశం ఉంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎర్లీ బర్డ్ స్కీం అందుబాటులో ఉండనుంది. కేవలం 2025-26 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్నుకు మాత్రమే ఎర్లీ బర్డ్ స్కీం వర్తింస్తుందని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై ఎర్లీ బర్డ్ స్కీం వర్తించని విషయం తెలిసిందే. 2024-25 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను ఓటీఎస్ స్కీం ముగిసింది. ఆస్తి పన్ను వసూలుకు మరో ముందడుగుగా ఎర్లీ బర్డ్ స్కీంను జీహెచ్ఎంసీ ప్రవేశపెట్టింది. దీనిపై అధికారులు లక్ష్యాలను నిర్దేశించారు.

# గజ్వేల్‌లో చలివేంద్రం ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త





**హైదరాబాద్, మార్చి 31 (జనంసాక్షి) :** ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో అమర నాగేందర్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఐవిఎఫ్ రాష్ట్ర నాయకులు పబ్బా చంద్రశేఖర్, కటకం శ్రీనివాస్, కొడిప్యాక నారాయణ, నంగునూరి సత్యనారాయణ,గోలి సంతోష్, ఐవిఎఫ్ సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, జిల్లా అధ్యక్షుడు నేతి శ్రీనివాస్ తో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా అనంతరం శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్మాణంలో ఉన్న శ్రీ కమలం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ పనులను సమీక్షించారు ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ అందరికీ నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ, శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో అందరూ కోరుకున్నది నెరవేరాలని ఆకాంక్షించారు.

ప్రతి ఒక్కరూ సేవా నిరతి కలిగి ఉండాలని ఎండాకాలం ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయ మని అన్నారు ఆర్యవైశ్యులకు అండగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యువజన అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్, పట్ట ణ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్, అత్తెల్లి కిషన్, ఆదిమూలం నారాయణ, జె శేఖర్,ప్రసాద్, సామ శ్రీధర్,దొంతుల సత్యనారాయణ, సంపత్, కొమురవెల్లి ప్రవీణ్, నోముల మహేందర్, బాలేష్, సంతోష్ ,ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ నాయకులు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు

# మాజీమంత్రి గిరిజా వ్యాస్‌కు ప్రమాదం

**ఇంట్లో హారతి ఇస్తుండగా అంటుకున్న మంటలు**

**జైపూర్, మార్చి 31 (జనంసాక్షి) :** కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత గిరిజా వ్యాస్ సోమవారంనాడు ప్రమాదానికి గురయ్యారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో సోమవారంనాడు తన నివాసంలో పూజ చేస్తుండగా హారతి అంటుకోవడంతో ఆమె గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఒక ప్రైవేటు-ఆసుపత్రిలో చేర్చి ప్రాథమిక చికిత్స అనంతరం అహ్మదాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఇంట్లో ఆమె హారతి ఇస్తుండగా.. కింద వెలుగుతున్న దీపం నుంచి మంటలు ఆమె దుపట్టాకు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగిటనట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారన్నారు. కాంగ్రెస్ నాయకురాలైన గిరిజా వ్యాస్ గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలందించారు. రాజస్థాన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా, జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గానూ పనిచేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
1 ఏప్రిల్ 2025
తెలంగాణ




# గురుకులాల్లో దారుణాలు ఆగేనా?

## విద్యార్థినీలను చివాట్లు పెట్టి చితకబాదిన ప్రిన్సిపాల్

- క్రమశిక్షణ కలిగిన గురుకులంలో బూతు పురాణం
- ఉపాధ్యాయుల అధ్యాపకుల విశృష్టకు ఉన్నతాధికారుల తనిఖీలు లేకపోవడం కారణమేనా..
- భయం గుప్పట్లో విద్యార్థులు
- పరీక్షల ముందు బయటకొస్తున్న సంఘటనలు



**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 31 (జనం సాక్షి):** గురుకులాల్లో ఉన్నత అధికారుల తనిఖీ కొరవడింది. అధ్యాపకులు ఉపాధ్యాయులపై ఉన్నతాధికారుల అజామయిషి అదుపు తప్పింది. వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుంది. విద్యార్థులపై గురుకులం సిబ్బంది కర్కశంగా ప్రవర్తిస్తున్నారు. ఫలితంగా గురుకులంలో జరిగే దారుణాలు వెలుగులోకి రావడం లేదు. విద్యార్థులు తెగిస్తే తప్ప నిజాలు బయటకి రావడం లేదు. టెన్త్ ఇంటర్ పరీక్షల ముందు గురుకులంలో జరిగిన సంఘటనలు ఒక్కొక్కటి బయటికి వస్తున్నాయి. తాజాగా ముగ్గురు విద్యార్థులకు చివాట్లు పెడుతూ బూతు పురాణం వల్లిస్తూ వారిని దండిస్తున్న ప్రిన్సిపల్ వైనం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల. జూనియర్ కళాశాల .సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కొత్తగడి వికారాబాద్‌లో జరిగింది. ఈ సంఘటన జాతీయ బాలల హక్కుల కమిషన్ దృష్టికి వెళ్ళింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగడి గురుకులంలో ప్రిన్సిపల్ సాయి లత ముగ్గురు విద్యార్థులను తమ ఆఫీసులోకి పిలిచి బండ బూతులు తిడుతూ చివాట్లు పెడుతూ విద్యార్థుల చంపలపై. తలపై లావు బుక్కుతో కొడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ ముగ్గురు విద్యార్థులు తమ అవసరాల కోసం షాపింగ్ కు వెళ్ళినట్లుగా గుర్తించిన ప్రిన్సిపల్ సాయి లత వారి తల్లిని బండ బూతులు తిడుతూ విద్యార్థులను కొట్టినట్లు వీడియోలో స్పష్టంగా రికార్డు అయింది. అంతేకాకుండా చదువురాని పాకి ముండ కూలి పని చేసుకొని మీరు బతకవచ్చు... కానీ ఉద్యోగాలు పోతే జైలుకు వెళ్తే మాకు బాధ్యులు ఎవరంటూ వారిని దండిస్తున్నట్లు స్పష్టంగా రికార్డయింది. విద్యార్థులు గురుకులం నుంచి ఎలా బయటికి వెళ్లారు అన్నది మిస్టరీగా ఉంది. వాచ్ మెన్ వారికి సహకరించారా లేక ఉపాధ్యాయుల వెనుక వెళ్లారా లేక వారి తల్లిదండ్రులు ఎవరైనా తీసుకు వెళ్లారా అనే విషయం వెలుగులోకి రావడం లేదు. వాచ్ మెన్ తో సహా అధ్యాపకులు అందరూ నెపం విద్యార్థులపై నెట్టి వారిని కొట్టినట్లు వీడియో రికార్డు అయింది. ఈ సంఘటనను గురుకులంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వీడియో రికార్డు చేసి జాతీయ బాలల హక్కుల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాకుండా కొందరు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరగవలసి ఉంది. అయితే విద్యార్థుల తప్పిదం ఉన్న వారి తల్లిదండ్రులను గురుకులానికి పిలిపించి విద్యార్థులకు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వవలసిన అధ్యాపకులు ప్రిన్సిపల్ వారి స్థాయిని మరిచిపోయి వారిని కొట్టడం పట్ల సర్వత్ర చర్చ జరుగుతుంది. గురుకులంలో వందలాది సంఖ్యలో ఉన్న పేద పిల్లలను అదుపులో పెట్టడానికి అధ్యాపకులకు ఉపాధ్యాయులకు ప్రిన్సిపల్ కు ఎంతో సహనం అవసరమని వారే ఆ సహనానికి గురై విద్యార్థుల పట్ల దారుణంగా ప్రవర్తిస్తే వారి భవిష్యత్తు ఏమవుతుందని వీడియో చూసిన వారంతా చర్చిస్తున్నారు. సహనం కోల్పోయిన ప్రిన్సిపాల్ సాయిలత గురుకులం ప్రిన్సిపల్‌గా అనర్హురాల నీ ఆమెను బాధ్య తల నుంచి తప్పించాలనే చర్చ గురుకులం బయట జరుగుతుంది. గురుకులంలో ఉన్నతాధికారుల తనిఖీలు కొరవడిన కారణంగానే సిబ్బందిపై అజ్జమాయిషి లేక ఇలాంటి సంఘటనలు తరచు జరుగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. టెన్త్ ఇంటర్‌తో పాటు మిగతా తరగతుల విద్యార్థులకు కామన్ పరీక్షలు జరుగుతున్న సమయంలో వికారాబాద్ జిల్లాలోని నవాబ్ పెట్ శివ రెడ్డి పేట కొత్త గడి- వికారాబాద్ గురుకులాల్లో ఈ సంఘటనలు జరిగాయి. గురుకులాల్లో జరుగుతున్న దారుణాల పట్ల సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేద విద్యార్థులు స్వేచ్ఛగా చదువుకునే అవకాశం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తారని ఆశిద్దాం.



# రంజాన్ త్యాగానికి ప్రతీక..

- సీఎం ఆధ్వర్యంలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అమలు
- ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన మంత్రి కొండ సురేఖ, మేయర్

**వరంగల్ ఎంజీఎం, మార్చి 31(జనంసాక్షి):** రంజాన్ పండగ త్యాగానికి ప్రతీక అని పవిత్ర రంజాన్ మాసంలో అతి పవిత్రమైన చివరి రోజు రంజాన్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖమంత్రి కొండ సురేఖఅన్నారు .సోమవారం ఫోర్ట్ రోడ్డు ఈద్గాలో మంత్రి కొండా సురేఖ. మేయర్ గుండు సుధారాణితో కలిసి రంజాన్ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ హిందు ముస్లిం భాయి భాయి అంటూ రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి వెంట మేమందరం రాష్ట్ర ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో ఈద్గాలు మసీదులకు ఖబరస్తాన్లను నిర్లక్ష్యం చేయడమే కాకుండా సరైన పద్ధతిలో వారికి నిధులను విడుదల చేయకపోవడం వల్ల రాష్ట్రంలో ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం లో మైనార్టీ కుటుంబాలు సంక్షోభంలో పడ్డాయని మంత్రి కొండ సురేఖఅన్నారు.తాను గతంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన ఈద్గాల అభివృద్ధి ఇప్పటివరకు కొనసాగుతున్నాయని తెలిపారు. గడిచిన పదేండ్లలో అభివృద్ధికి నోచుకోని ముస్లిం పవిత్ర ఆలయాలు మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీల పండుగలకు కొత్త శోభ సంతరించుకుంటుందని దర్గాలు ఈద్గాల అభివృద్ధి కొరకు 1. కోటి 28 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో కార్పొరేషన్ నిధుల నుండి వరంగల్ తూర్పు లో ఉన్న అన్ని ఈద్గాలకు మసీద్ లకు ప్రత్యేక నిధులను కేటాయించి ఈద్గలు, దర్గాలు కబరస్థాన్లలో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి పథంలో నడిపించే విధంగా చర్యలు తీసుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ మంత్రి కొండ సురేఖ హామీ ఇచ్చారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ రంజాన్ పండుగ త్యాగానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు, నవీన్ రాజ్,39వ డివిజన్ పోర్టు రోడ్డు ఈద్గా అధ్యక్షులు ఎంఏ జబ్బార్, ప్రధాన కార్యదర్శి చాంద్ పాషా, ఎండి ముగ్దుం, హసన్ హాలీబేగ్, ఎండి అంజాద్, దస్తగిరి సర్వర్, షబ్బీర్, పాహిం, సాదిక్, కమిటీ సభ్యులు, 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, శ్రీనివాస్, జారతి రమేష్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు. వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ ఆధ్వర్యంలో మిల్స్ కాలనీ సర్కిల్ ఇన్స్పెక్టర్ జూపల్లి వెంకటరత్నం భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సిఐ రామకృష్ణ చర్యలు తీసుకోగా, మిల్స్ కాలనీఎస్సైలు సురేష్ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై మావోయిస్టు పార్టీ ఆగ్రహం

- పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో తాజాగా లేఖ
- ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పేర్కొన్న పార్టీ




**హైదరాబాద్ మార్చి 31 (జనంసాక్షి) :** ఓయూలో నిర్బంధ ఆంక్షలు, కాంగ్రెస్ ప్రభుత్వంపై మావోయిస్టు పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో తాజాగా లేఖ విడుదల చేయడం కలకలం రేపుతోంది. నేటి పాలకుల విధానాల వలన మునుపెన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఈ లేఖలో మావోయిస్టు పార్టీ ధ్వజమెత్తింది. ఈ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారి గొంతును నొక్కేస్తున్నారని మండిపడింది. నియంతృత్వ విధానాలను అమలు చేస్తూ కనీస పౌర స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపించిం ది. ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేయకూడదని ఈ నెల 13న ఓయూ రిజస్ట్రార్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరించిన వారినీ కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించిందని, యూనివర్సిటీల్లో విద్యార్థుల పోరాటాలను అణిచివేయడానికి ఈ నిషేధాజ్ఞలు విధించారని ఆరోపించింది. ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యల రాజ్యాంగ విరుద్ధం అని అప్రజాస్వామికం అని ధ్వజమెత్తింది. ఇలాంటి నిరంకుశత్వ చర్యలు దేశ భవిష్యత్తు ను నాశనం చేస్తాయని పేర్కొంది. విద్యను ప్రైవేట్ పరం చేసిన కార్పోరెట్లకు అప్పగించడానికే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని పేర్కొంది. ఓయూ యునివర్సిటీ విద్యార్థులు నిజాం మొదలు నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నారని దేశ రాజకీయాల్లో తెలంగాణ సామాజిక, రాజకీయ ఆర్థిక పోరాటాలలో క్రియాశీలంగా పాల్గొన్నారు. విద్యార్థులు కేవలం సమస్యలకే పరిమితం కాలేదు ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి అనేక త్యాగాలు చేశారని లేఖలో ప్రస్తావించింది. నేడు చాలా మంది అనుభవిస్తున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక ఫలాలన్నీ విద్యార్థులు చేసిన విరోచిత పోరాటాల ఫలితమేనని కానీ నేడు దోపిడీ పాలక వర్గాలు మాత్రం దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల ప్రయోజనాలను రక్షించడమే తమ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారని ధ్వజమెత్తింది. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రభుత్వం విధించిన నిర్బంధ ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. ఈ ఆంక్షలను ఎత్తివేసే వరకు విద్యార్థులంతా ఐక్యంగా పోరాడాలని ఈ లేఖలో మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

# ముస్లింలకు వేముల రంజాన్ శుభాకాంక్షలు

- బిఆర్ఎస్ అన్ని మతాలను గౌరవిస్తుందని వెల్లడి
- హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకంపై ఆగ్రహం



**నిజామాబాద్,మార్చి31(జనంసాక్షి) :** ముస్లింలకు మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా బాబాపేటలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు మోయిజ్ ఇంట్లో విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని మతాల పండగలను ప్రభుత్వం ఆదరించిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో తెలంగాణ ఆగం అవుతోందన్నారు. వరిపంటలకు నీరు అందడం లేదన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి దుస్థితి లేదన్నారు. గ్రామాల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. భూములుల అమ్మి ప్రభుత్వాన్ని నడిపే ప్రభుత్వంగా మారిందన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీఛార్జినిప్రశాంత్ రెడ్డితీవ్రంగా ఖండించారు. యూనివర్సిటీలో పోలీసులను మోహరించి నిరసన తెలియజేసిన విద్యార్థినుల్ని లాఠీలతో కొట్టడం, పోలీసులు స్టేషన్‌కి ఈడ్చుకెళ్లడం.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని నిలదీశారు. కేంద్ర విద్యాసంస్థలకు చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వం తమ వ్యాపార ప్రయోజనాలకు వాడుకోవడమేంటని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును, రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. విద్యాసంస్థల భూముల అమ్మకాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నారా అని ప్రశ్నించారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే హింసించడమేనా మీ ప్రజాస్వామ్యం అని అడిగారు. జీవవైవిధ్యాన్ని రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, కానీ భూములను అమ్మి కాంక్రీట్ జంగల్ సృష్టిస్తారా చెప్పాలని స్పష్టం చేశారు. 400 ఎకరాల భూమిలో ఉన్న వన్యప్రాణులను నాశనం చేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భూమిని అప్పగించాలనుకోవడం ఎంతవరకు న్యాయమేని ప్రశ్నించారు. భూముల వేలాన్ని నిలిపివేయడానికి పర్యావరణ, అటవీ శాఖలు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. యూనివర్సిటీ భూములను రక్షించేందుకు భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలకతీతంగా అందరూ ఏకం కావాలని ఆయన కోరారు. ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ భూములపై పునరాలోచించి, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బండి సంజయ్‌ని ఎవరికైనా చూపించండి

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీజేపీకి ఎవరూ దొరకనట్టు బండి సంజయ్‌నే ఎందుకు కేంద్ర మంత్రిని చేశారో వారికే తెలియాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. దయ చేసి ఆయనను త్వరగా ఎవరికైనా చూపిస్తే అందరి కీ మంచిదన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కి దేశ భక్తులు, దేశ ద్రోహులు కూడా ఎవరో తెలియదని ఇలాంటి వాళ్ళను ఎంపీలుగా చేసి కేంద్రప్రభుత్వం ఎవరిని ఉద్ధరించాలని అనుకుంటుందో అర్థం కావడం లేదన్నారు. బీజేపీ అధ్యక్ష పదవి కోసమే పోటీ పడి ఇష్టం వచ్చినట్టు మాట్లాడు తున్నారని.. త్వరగా ఆ పదవి ఎవరికో ఒకరికి ఇస్తే వీళ్ళ నోర్లు మూతపడతాయని ఆశిస్తున్నాను అన్నారు. సన్నబియ్యం అనే క్రెడిబిలిటీ అనేది కాంగ్రెస్ దక్కుతుందని అద్దంకి స్పష్టం చేశారు. దేశం మొత్తం మీద పేదలకు సన్నబియ్యం ఇస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. దేశంలో ఆహారభద్రత పథకాన్ని తెచ్చింది కూడా కాంగ్రెస్ ఘనతే అని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఇచ్చి అప్పుడు బండి సంజయ్ మాట్లాడాలని సూచించారు. రాష్ట్రానికి ఏవైనా నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడానికి కేంద్రంతో కొట్లాడాలి కాని ఏ పనీ చేయకుండా పేర్ల కోసం కొట్లాడే పంచాయితీ మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రారంభించిన పథకాలకు ఇందిరాగాంధీ, సోనియా గాంధీ పేర్లను పెట్టే దమ్ము ఉందా అని అద్దంకి దయాకర్ సవాల్ విసిరారు.

# హెచ్సీయూ భూములపై మరోసారి ఆలోచించాలి

### ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హెచ్సీయూ వివాదంపై బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పందించారు. హెచ్సీయూ భూములపై ప్రభుత్వం మరోసారి ఆలోచించాలని సూచించారు. 50 ఏళ్లుగా ఆ భూముల్లో చెట్లు, కొండలు ఉన్నాయని.. వాటిలో వివిధ రకాల పక్షులు, జంతువులు నివసిస్తున్నాయని అన్నారు. ఇపుడు రాష్ట్ర ఆర్థికపరిస్థితి బాగోలేదని వర్సిటీ భూములు అమ్ముతారా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రకృతి, విద్యార్థులకు నష్టం కలిగించొద్దని హితవు పలికారు. గతంలో ఎన్నో ప్రభుత్వ భూములను తెగమ్మిన బీఆర్ఎస్ నేతలు ఇపుడు మాత్రం ధర్నా చేయడం విడ్డూరం ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

# రాష్ట్రంలో 3 రోజుల పాటు వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మండుతున్న ఎండలతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కూల్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఏప్రిల్ 1 తేదీ నుంచి మూడో తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని అంచనా వేసింది.

మంగళవారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నది. వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చే నాలుగు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు రెండు నుండి నాలుగు డిగ్రీలు తగ్గే అవకాశం ఉంది. ఆ తరువాత గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

తెలంగాణలోని నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మోస్తరు వర్షాలు కురిసే అవకా శాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. తెలంగాణ లో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు వడగండ్లతో కూడిన వర్షాలు ఉన్న కారణంగా మొక్కజొన్న తదితర పంటలు వేసిన రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# రేవంత్‌రెడ్డి సెంట్రల్ యూనివర్సిటీ భూములు అమ్ముడేమిటి?

### మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్

### హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్రానికే తలమానికం

**హైదరాబాద్, మార్చి 31 (జనం సాక్షి):** రేవంత్ ప్రభుత్వం హెచ్ సీ యు భూములు అమ్మి అప్పులు కట్టాలని నీచమైన ప్రయత్నం చేస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. దీన్ని అక్కడి విద్యార్థులు అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. హైదరాబాద్ లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చింది. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్ గా మారుతుంది. రేవంత్ రెడ్డి ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారు తెలియడం లేదు అన్నారు. 15 నెలలుగా ప్రతి నిర్ణయం ప్రజా కంటకం, ప్రజా వ్యతిరేకమైనదే. తిరోగమన చర్యలు. విద్యార్థుల మీద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.. వారికి సంఘీభావం తెలుపుతున్నాం.. అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతాం అని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విశ్వవిద్యాలయం భూములు అమ్మకూడదని డిమాండ్ చేశారు.



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్రానికే తలమానికం. కొన్ని వేలమంది నిష్ణాతులను తీర్చిదిద్దిందని అన్నారు. హైదరాబాద్ లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చింది. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్ గా మారుతుందని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు.

# ముగిసిన ఎల్‌ఆర్‌ఎస్ 25%శాతం ఫీజు రాయితీ

### మరో నెల రోజులు పొడిగించాలని దరఖాస్తుదారుల విజ్ఞప్తి

**హైదరాబాద్ మార్చి 31 (జనంసాక్షి) :**
లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సర్కారు ప్రకటించిన 25% రాయితీ గడువు సోమవారంతో ముగిసింది. ఆ తర్వాత స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) కొనసాగనున్నప్పటికీ రాయితీ మాత్రం వర్తించదు. దరఖాస్తుదారులు మాత్రం దీన్ని మరికొంతకాలం పొడిగించాలని కోరుతున్నారు. పలు కారణాల వల్ల ఫీజు చెల్లింపులో ఇబ్బందులు తలెత్తాయని, టెక్నికల్ సమస్యలు కూడా తోడవడంతో తాము లబ్ధి పొందలేకపోయామని చెబుతున్నారు. అయితే రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాయితీ గడువు పొడిగించే ప్రసక్తే లేదని గతంలో చెప్పిన నేపథ్యంలో సర్కారు నిర్ణయంపై దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ నెలకొంది.



### 20 లక్షల్లో 5 లక్షల మందే చెల్లింపు

లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్)లో భాగంగా సర్కారు 25% రాయితీతో కూడిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) ప్రకటించిన సంగతి తెలిసిందే. తమ వద్ద ఉన్న దరఖాస్తులను పరిశీలించినటువంటి ప్రభుత్వం మొత్తం 20,00,493 మందికి ఫీజు చెల్లించాలంటూ డిమాండు నోటీసును జారీ చేసింది. అంటే వీరంతా రాయితీ పోను మిగతా ఫీజును చెల్లించి తమ స్థలాలు క్రమబద్ధీకరణ చేసుకోవచ్చు. అయితే శనివారం సాయంత్రం వరకు దాదాపు 4 లక్షల మంది మాత్రమే ఫీజును చెల్లించారు. చివరి రోజైన సోమవారం మరో లక్ష మంది వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించవచ్చని అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ ఇంకా 15 లక్షల దరఖాస్తులు మిగిలిపోతాయి. వాస్తవానికి మార్చి మొదటి వారంలోనే ఓటీఎస్‌ను(వన్‌టైమ్ సెటిల్‌మెంట్) అందుబాటులోకి తెచ్చినప్పటికీ మొదట్లో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లింపునకు పలు ఆటంకాలు ఎదురుకావడం, ఒక్కోసారి పోర్టల్ ఓపెన్ కాకపోవడంతో పాటు ఫీజు చెల్లించిన తర్వాత కూడా ప్రొసీడింగ్‌లు రాకపోవడం లాంటివి ఇబ్బందిపెట్టాయి.

### పొడిగించాలని కోరుతున్న దరఖాస్తుదారులు

తరువాత అధికారులు క్రమంగా ఒక్కో సమస్యను పరిష్కరించారు. గత 7 రోజులుగా అంతా సాఫీగా సాగుతోంది. అందుకే ఇప్పటి వరకు పూర్తయిన ఫీజు చెల్లింపుల్లో సగం గత వారం రోజుల్లోనే జరిగాయి. ఆదివారం ఉగాది పర్వదినం కాగా సోమవారం రంజాన్. సెలవు రోజులైనప్పటికీ ఫీజు చెల్లించవచ్చని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కానీ, పండగ రోజుల్లో డబ్బులు సర్దుబాటు చేసుకోవడం కష్టమని, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని మరో నెల రోజులైనా ఓటీఎస్‌ను(వన్ టైం సెటిల్‌మెంట్) పొడిగించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370